సమావేశము - IV
వాల్యూము - II
సెం. 1

వెల : రూ. 20-00
18 మార్చి, 2016
శుక్రవారం,
(శక సం. 1937,
ఫాల్గుణం - 28)

# తెలంగాణ శాసన పరిషత్తు కార్యకలాపాలు

## అధికార నివేదిక

విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| I. | ప్రశ్నోత్తరాలు | ... | 1 |
| II. | సభా సమక్షంలో ఉంచబడిన పత్రము: | ... | 25 |
| | (అ) 2014-15 సంవత్సరానికి గాను నిజాం చక్కెర సంస్థవారి 77వ వార్షిక నివేదిక సమర్పణ. | | |
| III. | ప్రభుత్వ ప్రతిపాదనలు: | ... | 25 |
| | (అ) 2016-17 : "ప్రభుత్వ లెక్కల సమితి, ప్రభుత్వం రంగ సంస్థల సమితికి ఒక్కొక్కరిని సభ్యులుగా ఎన్నుకొనుట" గురించి. | | |
| IV. | ప్రకటన: | ... | 25 |
| | (అ) 2016-17 : "ప్రభుత్వ లెక్కల సమితి, ప్రభుత్వ రంగ సంస్థల సమితికి సభ్యుల ఎన్నికల షెడ్యూలు" గురించి. | | |
| V. | ప్రత్యేక ప్రస్తావనలు | ... | 25 |
| VI. | 2016-17 సంవత్సరానికి వార్షిక ఆదాయవ్యయ పట్టిక (బడ్జెట్)పై చర్చ (కొనసాగింపు) | ... | 26 |

# తెలంగాణ శాసన పరిషత్తు

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| ఛైర్మన్ | : | శ్రీ కె. స్వామిగౌడ్ |
| డెప్యూటి ఛైర్మన్ | : | శ్రీ నేతి విద్యాసాగర్ |
| కార్యదర్శి | : | డా. ఎస్. రాజ సదారామ్ |
| సంయుక్త కార్యదర్శి | : | డా. వి. నరసింహాచార్యులు |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ టి.బి. జయచందర్<br>శ్రీ ఎస్. దుర్గాప్రసాద్<br>శ్రీ సి.హెచ్. ఉపేందర్ రెడ్డి<br>శ్రీమతి వి.ఎస్. ప్రసన్నకుమారి |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీమతి యస్. నాగమణి |

# తెలంగాణ శాసన పరిషత్తు కార్యకలాపాలు

## అధికార నివేదిక

## (నాల్గవ సమావేశము -  ఆరవ రోజు)

## శుక్రవారం, మార్చి 18, 2016

(సభ ఉ. గం. 10.00 లకు ప్రారంభమైనది)

(గౌరవ ఛైర్మన్ అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

మిస్టర్ ఛైర్మన్:  సభకు నమస్కారం. మొదటగా ప్రశ్నోత్తరాల కార్యక్రమం.  ప్రశ్న నెం.1026 మరియు 1002 ప్రశ్న వేసిన సభ్యుడు ఒకరే కాబట్టి, రెండింటికి కలిపి సమాధానం చెప్పవలసిందిగా గౌరవ వ్యవసాయ శాఖ మంత్రిగారిని కోరుతున్నాను.

### I. ప్రశ్నోత్తరాలు

### సమగ్ర ఉద్యానవన అభివృద్ధి పథకం

ప్రశ్న నెం.1026 (41)

శ్రీ పాతూరి సుధాకర్‌రెడ్డి, ఎం.ఎల్‌సి.:- గౌరవనీయులైన వ్యవసాయ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా :

అ) సమగ్ర ఉద్యానవన అభివృద్ధి పథకం క్రింద రైతులకు సమకూరుస్తున్న సబ్సిడీ వివరాలు  ఏమిటి;

ఆ) రాష్ట్రీయ కృషి వికాస్ యోజన క్రింద రైతులు పొందుతున్న సబ్సిడీ వివరాలు ఏమిటి;

ఇ) 2015-16 సంవత్సరంలో రైతులకు చేసిన చెల్లింపుల జిల్లావారీ వివరాలు ఏమిటి?

వ్యవసాయ మరియు ఉద్యానవన శాఖ మంత్రి (శ్రీ పోచారం శ్రీనివాస రెడ్డి):-  అ) రాష్ట్రంలో ఉద్యానవన సమగ్ర అభివృద్ధి కోసం ఈ క్రింది పథకాలకు ఉద్యానవన శాఖ  సబ్సిడీలను సమకూర్చుతున్నది.

| వరుస సంఖ్య | పథకం పేరు | సబ్సిడీ విధానం |
|---|---|---|
| 1. | సూక్ష్మ సాగు | 5 హెక్టార్ల గరిష్టం వరకు ఎస్‌సి, ఎస్‌టిలకు 100 శాతం, ఎస్ఎఫ్ / ఎంఎఫ్,  బిసిలకు 90 శాతం, ఇతరులకు 80 శాతం. |
| 2. | ఉద్యానవన సమగ్ర అభివృద్ధి మిషన్ (ఎన్‌హెచ్ఎం) | వివిధ అంశాలపై 35 నుండి 50 శాతం |
| 3. | పాలిహౌజ్‌ల నిర్మాణం | మూడు ఎకరాల గరిష్టం వరకు 75 శాతం సబ్సిడీ |
| 4. | రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కెవిపై) | కూరగాయల మినీ కిట్స్ (90 శాతం) మినహా అన్ని అంశాల కోసం 50% సబ్సిడీ |
| 5. | నూనె గింజలు, నూనెపామ్‌పై జాతీయ మిషన్ | పంట పరికరాలపై 85 శాతం సబ్సిడీ నిర్వహణపై 50 శాతం. |

ఆ) వివరాలను నివేదిక రూపంలో సభాసమక్షంలో ఉంచడమయింది.

ఇ) వివరాలను నివేదిక రూపంలో సభాసమక్షంలో ఉంచడమయింది.

శాసన పరిషత్తు ప్రశ్న నెం. 1026 (బి) ఖండానికి సమాధానం

ఆర్‌కెవివై పథకం క్రింద ఇచ్చిన అంశాల వారీ సబ్సిడీ వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

i) హైబ్రిడ్ కూరగాయల విత్తనాల సరఫరా - ఒక్కో లబ్ధిదారునికి ఒక హెక్టారుకు రూ. 3,000/- చొప్పున కూరగాయల విత్తనాలను సరఫరా చేయడం.

ii) క్రీపర్ మెష్ - ఒక ఎకరానికి రూ. 40,000/- మించకుండా 50 శాతం ఆర్థిక సహాయం. గరిష్ఠ అర్హత ఒక్క లబ్ధిదారునికి 1 హెక్టారు.

iii) ఒక చదరపు మీటరుకు రూ. 25/- చొప్పున యూనిట్ వ్యయంతో కూరగాయల సాగుకు షేడ్ నెట్‌ను సరఫరా చేయడం. ఒక చదరపు మీటరుకు రూ.12.5/- కు మించకుండా 50 శాతం ఆర్థిక సహాయం. ప్రతి రైతు 10000 చదరపు మీటర్ల వరకు సహాయాన్ని పొందవచ్చును.

iv) సీడ్‌లింగ్ ప్రోట్రేస్ - 99 సెల్స్ గల ఒక ప్రోట్రే రూ.7.50/- మించకుండా 50 శాతం ఆర్థిక సహాయం. ప్రతి రైతుల 200 ల వరకు ప్రోట్రేలకు సహాయాన్ని పొందవచ్చు.

v) పట్టణ కూరగాయల సాగు - 50 శాతం సబ్సిడీతో 700 యూనిట్లను (లబ్ధిదారులు) పర్తింపు చేయడానికి సబ్సిడీ భాగం, అంటే ఒక యూనిట్‌కు 3,000/-లు.

vi) కూరగాయల మినీ కిట్లు - రూ.100/- ల కిట్టుకు 90 శాతం ఆర్థిక సహాయం. ప్రతి రైతు 2 కూరగాయల మినీ కిట్ల వరకు సహాయం పొందవచ్చు.

vii) శాశ్వత పందిర్లు - ఎకరానికి రూ. 1,00,000/- మించకుండా 50 శాతం ఆర్థిక సహాయం. గరిష్ఠ అర్హత ఒక లబ్ధిదారునికి 1 హెక్టారు.

viii) ప్లాస్టిక్ క్రేట్స్ - ఒక ప్లాస్టిక్ క్రేటుకు గరిష్ఠంగా రూ.120/- లకు లోబడి పరికరాల 50 శాతం వ్యయం. గరిష్ఠ అర్హత ఒక రైతుకు 40 క్రేట్లు.

శాసన పరిషత్తు ప్రశ్న నెం. 1026 (సి) ఖండానికి సమాధానం

2015-16 సంవత్సరానికి ఇప్పటి వరకు ఆర్‌కెవివై క్రింద నిధులు ఇంకా అందనందున ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

| వరుస సంఖ్య | జిల్లా పేరు | సూక్ష్మ సాగు | ఆర్‌కెవివై | ఎస్‌హెచ్‌ఎం | పాలిహౌజ్ | ఎన్ఎంఒఎపి | మొత్తం |
|---|---|---|---|---|---|---|---|
| 1. | ఆదిలాబాద్ | 9.59 | 1.37 | 0.88 | 3.54 | 0 | 15.38 |
| 2. | కరీంనగర్ | 9.70 | 0.90 | 1.56 | 3.15 | 0 | 15.31 |
| 3. | ఖమ్మం | 2.93 | 0.61 | 2.50 | 3.54 | 0.90 | 10.48 |
| 4. | వరంగల్ | 16.58 | 1.53 | 8.53 | 2.17 | 0 | 28.81 |
| 5. | మెదక్ | 4.59 | 2.91 | 4.31 | 16.27 | 0 | 28.08 |
| 6. | మహబూబ్‌నగర్ | 44.16 | 3.68 | 5.68 | 14.05 | 0 | 67.57 |
| 7. | నల్గొండ | 16.47 | 10.23 | 3.45 | 14.94 | 0.10 | 45.19 |
| 8. | నిజామాబాద్ | 9.86 | 1.29 | 3.76 | 5.3 | 0 | 20.21 |
| 9. | రంగారెడ్డి | 25.34 | 2.61 | 6.41 | 12.61 | 0 | 46.97 |
| | **మొత్తం** | **139.22** | **25.13** | **37.08** | **75.57** | **1.00** | **278.00** |

## ఉద్యానవన పంటలకు గిట్టుబాటు ధర

ప్రశ్న నెం.1002 (వితార)(45)

శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి, ఎం.ఎల్.సి.:- గౌరవనీయులైన వ్యవసాయ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా :

అ) ఉద్యానవనాలను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం వాస్తవమేనా;

ఆ) సదరు పంటలపై రైతులకు అవగాహన కల్పించడానికి తీసుకున్న చర్యలు ఏమిటి;

ఇ) ఉద్యానవన పంటలకు గిట్టుబాటు ధరను కల్పించేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యల వివరాలు ఏమిటి?

గౌరవ వ్యవసాయ శాఖ మంత్రి (శ్రీ పోచారం శ్రీనివాస రెడ్డి) :- అ) అవునండీ.

ఆ) రైతులలో అవగాహన కల్పించడానికి శిక్షణ, అవగాహన సందర్శనలను నిర్వహించడంతో పాటుగా రాష్ట్ర, జిల్లా స్థాయిలో పంట నిర్దిష్ట వర్క్‌షాప్‌లను, అవగాహన కార్యక్రమాలను, మేళాలను, రాష్ట్ర ఉద్యానవన శాఖ నిర్వహించింది.

ఇ) వారి ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలను పొందడానికి రైతు బజార్లలో వారి తాజా ఉత్పత్తులను విక్రయించడానికి రైతులకు మార్కెటింగ్ శాఖ ఏర్పాట్లు చేసింది. రైతుల లబ్ధి కోసం మెదక్ జిల్లా ములుగులోని ఒంటి మామిడి వద్ద ఒక మార్కెటును అభివృద్ధి చేసింది. వినియోగదారులకు కల్తీ లేకుండా మేలు రకపు ఉత్పత్తులను సమకూర్చేందుకు, రైతులకు ఆదాయం పెంచే ఉద్దేశ్యంతో ఉద్యానవన పంటల సేకరణతో పాటుగా గ్రేడింగ్, ప్యాకింగ్, ప్రాసెసింగ్, నిల్వ, మార్కెటింగ్ చేసేందుకు మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడం ద్వారా 2016-17 కాలంలో మెదక్ జిల్లా ములుగు వద్ద 200 ఎకరాలలో తెలంగాణ రాష్ట్ర ఉద్యానవన అభివృద్ధి సంస్థను తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నది.

శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి (ఉపాధ్యాయ నియోజకవర్గం- మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ మరియు కరీంనగర్) :

అధ్యక్షా, నేను రెండు ప్రశ్నలు వేయడం జరిగింది. ఒకటి రాష్ట్రస్థాయిలో సమగ్ర ఉద్యానవన అభివృద్ధి పథకం గురించి. దానికి మంత్రిగారు గణాంకాలతో, చాలా వివరంగా సమాధానం చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసి, ఇతర వర్గాలవారికి సబ్సిడీలు ఎంత ఇస్తున్నదీ చెప్పారు. మాకు ఉన్న అనుమానం ఏమిటంటే గత సంవత్సరం మా ఆదిలాబాద్ జిల్లా బిల్వాపూర్ మండలం, కల్వ గ్రామంలో రైతులు మామిడి మొక్కలను పెంచుకోవడానికి ప్రభుత్వం సబ్సిడీ ఇస్తామని రైతులను ప్రోత్సహించడం జరిగింది. తదనుగుణంగా అక్కడి రైతులంతా మంచి ఉత్సాహాన్ని కనబరిచి, మామిడి మొక్కలను పెంచడానికి ఏర్పాట్లు చేసుకుని, తమ ప్రణాళికలను వ్యవసాయ విస్తీర్ణాధికారికి సమర్పించారు. తరువాత వారు చెప్పిందేమిటంటే మొక్కలను మీరే కొనుగోలు చేసుకోండి, ప్రభుత్వం రూ.23/- సబ్సిడీ ఇస్తుంది అన్నారు. కేవలం ఇరవై మూడు రూపాయలు మాత్రమే ఇస్తామంటే మా రైతుల పరిస్థితి ఏమి కావాలి? రైతులు నాణ్యమైన మొక్కలు కొనాలనే ఆలోచనతో కొందరు యాభై రూపాయలు, కొందరు అరవై, కొందరు ఎనభై రూపాయలు ఖర్చుపెట్టి, మొక్కలు కొనడం జరిగింది. అసలు ఇంతవరకు వారికి ఎలాంటి రాయితీ చెల్లించబడలేదు. రైతులంతా ఆందోళన చెందుతున్నారు. కాబట్టి వారికి రావలసిన రాయితీని త్వరగా చెల్లించవలసిన ఏర్పాటు చేస్తారా అన్నది నా మొదటి ప్రశ్న.

ఇక రెండవ ప్రశ్న కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున హార్టికల్చర్‌ను అభివృద్ధి చేయాలనే ఉద్దేశ్యంతో, వ్యవసాయ మరియు హార్టికల్చర్ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరను, అలాగే రైతులకు మౌలిక సదుపాయాలను కల్పించే విధంగా ఒక పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. రైతులు స్వయంగా ఉత్పత్తి చేసినటువంటి పంటలను ప్రభుత్వం కొనుగోలు చేసి, తదనుగుణంగా ఒక సెంటర్‌ను ఏర్పాటు చేసి, ఒక్కొక్క సెంటరుకు రెండు కోట్ల రూపాయల వరకు రాయితీ ఇచ్చే అవకాశం ఉంది. కాబట్టి మన రాష్ట్రంలో అటువంటి సెంటర్లను ఇప్పటికి ఎన్ని ఏర్పాటు చేసారు, ఇప్పటికి ఎన్ని నడుస్తున్నాయి, ఎంతమంది రైతులు ఈ రాయితీని పొందారు అనేటటువంటిది నా రెండవ ప్రశ్న. మంత్రిగారు స్వయంగా వ్యవసాయదారుడు కాబట్టి, వారు సరైన విధంగా సమాధానం చెప్పవలసిందిగా కోరుతున్నాను.

శ్రీ బోడకుంటి వెంకటేశ్వర్లు(శాసనసభ నియోజకవర్గం): అధ్యక్షా, మా వరంగల్ జిల్లాలో డ్రిప్ ఇరిగేషన్ కొరకు పందొమ్మిది వేల మంది రైతులు దరఖాస్తు చేసుకోవడం జరిగింది. ప్రభుత్వం డ్రిప్ ఇరిగేషన్‌ను పెద్ద ఎత్తున ప్రోత్సహించడానికి నిర్ణయించి, అందులో భాగంగా గత ఏడాది నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసి మరియు ఇతర రైతులు పెట్టుకున్న అప్లికేషన్లు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని త్వరితగతిన శాంక్షన్ చేయించవలసిందిగా మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. అదే విధంగా మా జిల్లాలో పన్నెండు,పదమూడు కోట్ల రూపాయల మేరకు పంట నష్టం జరిగింది. అది కాక మరొక ఐదారు కోట్ల రూపాయల వరకు రైతులు పెట్టుకున్న అప్లికేషన్లు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని కూడా శాంక్షన్ చేయవలసిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ మహమ్మద్ ఆలి షబ్బీర్(శాసనసభ నియోజకవర్గం): అధ్యక్షా, 2014-15లో మామిడి పంటకు నష్టం జరిగిన సందర్భాలలో రైతులకు నష్టపరిహారం ఇస్తామని చెప్పారు. కాని ఇంతవరకు అది ఎవరికీ అందలేదు. అరటి రైతులకు కూడా నష్ట పరిహారం అందవలసి ఉంది. ఇంతకుముందు గౌరవ సభ్యులు చెప్పినట్లు మా నియోజక వర్గంలో కూడా డ్రిప్ ఇరిగేషన్ అప్లికేషన్లు మొత్తం పెండింగ్‌లో ఉన్నాయి. అందరికీ సబ్సిడీ ఇస్తామని మీరు పబ్లిసిటీ మాత్రం బాగా చేస్తున్నారు. కాబట్టి దయచేసి ఈ కరువు కాలంలో మీరు ఆ సబ్సిడీని విడుదల చేసినట్లయితే, పంటలు కాపాడుకోవడానికి అవకాశముంటుంది.

శ్రీ పోచారం శ్రీనివాస రెడ్డి: అధ్యక్షా, గౌరవ సభ్యులు శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డిగారు మొక్కలకు ఇవ్వవలసిన రాయితీ గురించి అడిగారు. ఆ డబ్బును ఇటీవలే ఆన్‌లైన్‌లో పంపడం జరిగింది. త్వరలోనే రైతుల ఖాతాలకు ఆ డబ్బు జమ అవుతుంది. మన రాష్ట్రం పండ్ల తోటల విషయంలో మూడవ స్థానంలో ఉన్నది. పసుపు పంటలో మన రాష్ట్రం

ప్రథమ స్థానంలో ఉంది. మనకు పండ్లు, కూరగాయలు, పూలు, మిర్చి, పసుపు, మసాలాలు, ఉల్లిగడ్డ, ఎల్లిగడ్డ ఇటువంటివన్నీ కలుపుకుంటే, రాష్ట్రంలో 7.39 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో ఈ పంటలు పండుతున్నాయి. సగటున 92 లక్షల టన్నుల ఉత్పత్తులు జరుగుతున్నాయి.

మన రాష్ట్రంలో రైతులను ప్రోత్సహించే క్రమంలో గతంలో ఉన్న సబ్సిడీ విధానంలో మన గౌరవ ముఖ్యమంత్రిగారు పెద్ద ఎత్తున మార్పులు, చేర్పులు చేయడం జరిగింది. గౌరవ సభ్యులు బోడకుంటి వెంకటేశ్వర్లుగారు మరియు మన ఎల్‌ఓపి గారు అడిగిన ప్రశ్నకు సమాధానంగా గతంలో ఇంత సబ్సిడీ ఇచ్చేవారు కాదు. డ్రిప్ ఇరిగేషన్ క్రింద ఒక హెక్టారుకి ఒక లక్ష రూపాయలు మాత్రమే సబ్సిడీ ఇచ్చేవారు. ఒక హెక్టారు గరిష్ట పరిమితి ఉండగా, ఇప్పుడు మేము దానిని ఒక హెక్టారు నుండి ఐదు హెక్టార్లకి పెంచాము. అంటే ఒక రైతుకు దాదాపు రూ.6.50 లక్షల వరకు ఈ సబ్సిడీ వస్తుంది. ఎస్సీ, ఎస్టీకి వంద శాతం సబ్సిడీ ఉంటుంది. ఈ విధంగా సబ్సిడీ పెంచడం వల్ల, రైతులు చాలా మంది ఆసక్తి చూపించి, ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు చేసుకోవడం జరిగింది. 2014-15 మరియు 2015-16 సంవత్సరాలకు అందిన దరఖాస్తులను పరిశీలించినవి పోను, ఇంకా 1.05 లక్షల హెక్టార్లకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

మొన్న బడ్జెటు రూపకల్పన జరిగినప్పుడు, ముఖ్యమంత్రిగారు చేసిన సూచన ఏమిటంటే దరఖాస్తులు చాలా పెండింగ్‌లో ఉన్నాయి, రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇచ్చే రూ.300-400కోట్లు సరిపోదు. కేంద్రం నుండి మనకు వచ్చే డబ్బుకు అదనంగా నాబార్డ్ నుండి రూ.1,000 కోట్లు తీసుకుందామని చెప్పారు. అంటే మొత్తం రూ.1300 కోట్ల రూపాయలు ఈ సంవత్సరం డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ ఇరిగేషన్ క్రింద రాబోతున్నది. కాబట్టి ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్ లేకుండా, మొత్తం సబ్సిడీ రిలీజ్ చేయడం జరుగుతుంది.

అదే విధంగా గౌరవ సభ్యులు మామిడి తోటల నష్ట పరిహారం గురించి కూడా అడిగారు. నాకు తెలిసినంతమటుకు గతంలో ఉన్న పెండింగ్ ఇన్‌పుట్ సబ్సిడీ దరఖాస్తులు అన్నీ క్లియర్ చేయడం జరిగింది. GO Rt.No. 75, Dt.1-10-2015 ప్రకారం April, May and June,2015 మధ్య కాలంలో సంభవించిన వడగళ్ల వానలో నష్టపోయిన తొమ్మిది జిల్లాలకు చెందిన 47,850 మంది రైతులకు రూ. 62.79 కోట్లను విడుదల చేయడం జరిగింది. ఎక్కడన్నా ఒకటి,రెండు దరఖాస్తులు మిగిలిఉన్నాయేమో తెలియదుగాని, మాగ్జిమం ఇచ్చేసాము.

అలాగే హార్టికల్చర్ పంటల విషయంలో 2010-2013 మధ్య కాలంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను కూడా కన్సిడర్ చెయ్యాలని ఉప ముఖ్యమంత్రిగారు ఆదేశిస్తే, దాని ప్రకారం GO Rt.No. 65, Dt.9-9-2015 నాడు ఏడు జిల్లాలకు రూ.21.75 కోట్లు విడుదల చేయడం జరిగింది. ఈ విధంగా హార్టికల్చర్‌కు చెందిన ఇన్‌పుట్ సబ్సిడీకి సంబంధించి, దాదాపు అన్ని దరఖాస్తులను శాంక్షన్ చేయడం జరిగింది. సంవత్సరాల తరబడి పెండింగ్ పెట్టకుండా, వెంటవెంటనే నిధులు విడుదల చేయడం జరుగుతున్నది.

ఈ సంవత్సరం పాలీహౌజ్ అనే ఒక మంచి కార్యక్రమం కూడా చేపట్టడం జరిగింది. గౌరవ సభ్యులు రాయితీల గురించి కూడా అడిగినారు కాబట్టి, వివరాలు చెబుతున్నాను. ఇంతకుముందు ఒక్క ఎకరానికి మాత్రమే సబ్సిడీ ఇచ్చేవారు. అది కూడా రాష్ట్ర ప్రభుత్వ ప్రోగ్రాం కాదు. MIDH Programme క్రింద కేంద్ర ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ ఇచ్చేది. అది కూడా చాలా తక్కువ. జిల్లాకు ఒకటి లేదా రెండు ఎకరాలకు మాత్రమే. కేంద్ర ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ క్రింద పాలీ హౌజ్ ఇస్తుంటే, గౌరవ ముఖ్యమంత్రిగారు అది సరిపోదు అని, రాష్ట్ర ప్రభుత్వం నుండి కొంత నిధులు ఇవ్వాలని చెప్పి, గత సంవత్సరం రూ.250 కోట్లు, 847 ఎకరాలు టార్గెట్ నిర్ణయించడం జరిగింది. ఒక ఎకరం ఉన్న దానిని మూడు ఎకరాలకు పెంచాము. సబ్సిడీ మొత్తం యాభై శాతం ఉంటే, దానిని డెబ్బై శాతం పెంచాము. 2016-17లో నాన్-సబ్సిడీ అంశం గురించి కూడా ఆలోచించాము. రైతులలో దళితులు, గిరిజనులు, పేదవారు ఉంటారు. వారికి బ్యాంకువారు consent ఇవ్వరు. ఆస్తులు

తాకట్టుపెట్టమని రైతులను వేధించడం జరుగుతుంది. సవాలక్ష ప్రశ్నలు వేసి, స్కీంను అమలు చేయకుండా ఆపివేస్తారు కాబట్టి, గౌరవ ముఖ్యమంత్రి గారు మా వ్యవసాయ శాఖ బడ్జెటు రూపకల్పనలో వచ్చే 2016-17 సంవత్సరం నుండి ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం సబ్సిడీ ఇవ్వాలని ఆదేశించడం జరిగింది.

10.20 ఉ.

అంటే 95 శాతం హార్టీ కల్చర్ డిపార్ట్‌మెంటు, మిగిలిన 5 శాతం ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ క్రింద సబ్సిడీ ఇవ్వబోతున్నాం.

చాలా మంది రైతులకు తమ ద్వారా వివరించేది ఏమంటే, ఒక ఎకరానికి మీరు 75% వరకు సబ్సిడీ ఇచ్చి, రూ.30 లక్షలు ఇస్తున్నారు అని అంటున్నారు ఇది సత్యం కాదు. నిర్మాణం ఖర్చు గానీ, బోదెలు తవ్వడం గానీ, రూ.40 లక్షల వరకు ఖర్చు వస్తుంది. రూ.30 లక్షలు గవర్నమెంట్ ఇస్తే, రూ.10 లక్షలు బ్యాంకుకి కట్టాలంటే, మిగిలిన రూ.10 లక్షల అప్పు కోసం కొంత మంది రైతుల తీసుకోలేకపోతున్నారు. భూమి సీలింగ్ విస్తీర్ణం ఒక లక్షకి ఫిక్స్ చేయలేదు.

అర ఎకరానికి గాని, పావు ఎకరానికి గాని, అఖరికి రెండు కుంటల భూమి ఉన్నా రాయితీ ఇస్తాం. అంటే రెండు వందల చదరపు మీటర్లు ఉన్నటువంటి విస్తీర్ణంలో పంట వేస్తే కూడా ఇస్తాము. దానికి ఎస్సీ,ఎస్టీ వారికి 100 శాతం రాయితీ ఇస్తాము. మిగతా వారికి 75 శాతం ఇవ్వడం జరుగుతుంది. ఉదాహరణకు రెండు వందల చదరపు మీటర్లకి రూ.2,12,000 ఖర్చు వస్తే, దానిలో రూ.53 వేలు రైతు కడితే, మిగతా ఖర్చు మొత్తం మేము ఇస్తాము. ఈ విధంగా మంచి కార్యక్రమం చేపట్టడం జరిగింది. ప్రారంభంలో దేశం మొత్తం మీద నిర్మాణం చేసే కంపెనీలు రాలేదు. ఇప్పుడు 35 కంపెనీలు వచ్చాయి, బాగా స్పీడ్ అందుకుంది. శాంక్షన్ కూడా ఇచ్చేశాము. మంచి దిగుబడి వస్తుంది. మాములు పంట కంటే పదిరెట్లు ఎక్కువ దిగుబడి వస్తుంది.

నిర్మాణం చేసినటువంటి ఫీల్డ్‌లోకి కూడా వెళ్లి వచ్చాను. వారి అభిప్రాయం, అనుభవం తెలుసుకున్నాను. నర్సాపురం మండలం ఇబ్రహీమ్‌బాగ్‌లో శ్రీనివాస్ అనే దళితుడికి పొలం ఉంది. ఆ పొలంలో పంట వేసే ముందు నేనే కొబ్బరికాయ కొట్టి ప్రారంభించాను. ఒక ఎకరంలో క్యాప్సికమ్ పంట వేసు కున్నాడు. జూన్‌లో పంట వేయడం జరిగింది. ఆగస్టు నుంచి తెంపడం మొదలుపెట్టాడు. అక్టోబర్ వరకు ఖర్చులన్నీ తీసి వేయగా ఒక ఎకరంకు రూ.12 లక్షలు మిగలడం జరిగింది.

భువనగిరి దగ్గర వెంకటేశ్వర్లు అనే రైతు దగ్గరికి వెళ్లాను. ఐదు కుంటల భూమిలో పంట వేసుకున్నాడు. జూన్‌లో మొక్కలు నాటాడు. ఆగస్టు నుంచి తెంపడం మొదలుపెట్టాడు. అక్టోబర్ వరకు 28 క్వింటాల 63 కిలోల క్యాప్సికమ్ వచ్చింది. సగటున రూ.35లకు కిలో అమ్మాడు. రూ.98,000లు వచ్చినాయి. ఎంత ఖర్చు వచ్చిందని అడిగాను. ఖర్చు రూ.16,000లు సార్, మిగతా డబ్బులు బ్యాంకులో ఉన్నాయి అన్నాడు. దయచేసి మీద్వారా రాష్ట్ర రైతాంగానికి విజ్ఞప్తి చేసేది ఏమిటంటే, గౌరవ ముఖ్యమంత్రిగారు రాష్ట్ర రైతు ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఏ పంటలు వేస్తే లాభాలు వస్తాయో తెలుసుకొని, ఆ పంటల గురించి రైతు లకు తెలియజేయాలని కోరుతున్నాను.

అధిక దిగుబడి, అధిక లాభాలు వచ్చేటువంటి పంటలు వేసుకుంటే అప్పులు తీరుతాయి, రైతు బాగుపడతాడు, ఆత్మహత్యలు తగ్గుతాయి. ఇంత పెద్ద ఎత్తున రాయితీ ఇచ్చే రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం మాత్రమే. గుజరాత్, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, జార్ఖండ్ వెళ్లివచ్చాను. ఎక్కడా కూడా 50%కి మించి సబ్సిడీ లేదు. 70% సబ్సిడీ ఇస్తున్నటువంటి ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం. ఎస్సీ, ఎస్టీలకు 2016-2017వ సంవత్సరం నుంచి 70% సబ్సిడీ ఇస్తాము. కాబట్టి దీని మీద చాలా నిర్ణయాలు తీసుకున్నాం. ఈ విధంగా పాలీహౌజ్ కార్యక్రమం ద్వారా పందిరి కూరగాయలు పండించే కార్య క్రమం ఇది. ఈ సంవత్సరం రాష్ట్రం మొత్తం మీద 1500 ఎకరాలలో పందిరి కూరగాయలకి సబ్సిడీ దొరుకుతాయి. ఒక నల్గొండ జిల్లాలోనే 980 ఎకరాలు వేశారు. ఆ పందిరి

కూరగాయలకి ఒక ఎకరానికి లక్ష రూపాయలు సబ్సిడీ ఇస్తున్నాం.

(అంతరాయం)

పందిరి కూరగాయల పంట నుండి మంచి దిగుబడి వస్తుంది. సబ్సిడీ ఎకరానికి లక్ష రూపాయలు ఇస్తాం. సుమారు రెండున్నర ఎకరాల వరకు సబ్సిడీ రైతుకి ఇస్తాం. ఈ సంవత్సరం కూడా నల్గొండ జిల్లా వారు చాలా వాడుకున్నారు. మీ ద్వారా మనవి చేసేది ఈ పథకం కింద ఎంతమంది దరఖాస్తు పెట్టుకున్నా వాటిని పరిశీలించి శాంక్షన్ చేస్తాము. ఈ విధంగా పాలిహౌజ్, మైక్రో ఇరిగేషన్ వంటి కార్యక్రమాలు చేపడుతున్నాం. రైతుల యొక్క ప్రయోజనాలు కాపాడే విధంగా గౌరవ ముఖ్యమంత్రిగారు గతంలో ఎన్నడూ లేనంత రాయితీ ఇస్తున్నారు.

ఈ పథకం వచ్చినప్పటినుండి నుంచి మన రాష్ట్రంలో 120 ఎకరాల వరకు సబ్సిడీ ఇవ్వడం జరిగింది. రూ.24 కోట్లు 10 సంవత్సరాలలో రాయితీ ఇచ్చాము కానీ, రెండు సంవత్సరాలలో రూ.250 కోట్లు, వేల ఎకరాలకు కూడా రాయితీ ఇవ్వడం జరిగింది. ఇంకా ఎంతమంది రాయితీ కోసం అప్లై చేసుకున్నా కూడా వారిని ప్రోత్సహిస్తాం. గౌరవ ముఖ్యమంత్రి గారు చెప్పారు ఎవరికి రాయితీ రాకపోయినా బాధపడవద్దు. కావాలంటే ఎక్కువ నిధులు మంజూరు చేసి ఇస్తామని మీ ద్వారా తెలియజేస్తున్నాను.

శ్రీ పాతూరి సుధాకర్‌రెడ్డి: అధ్యక్షా, నిర్దిష్టంగా ప్రశ్న వేశాం. సవివరంగా మొదటి ప్రశ్నకు జవాబు చెప్పారు. రైతుల పంట లకు గిట్టుబాటు ధర వచ్చేటట్టుగా చర్యలేమి తీసుకుంటున్నారు. నేను అడిగిన ప్రశ్న ఏమిటంటే ఉద్యానపంటలకు గిట్టుబాటు ధర, మౌలికవసతుల కల్పనకు, వ్యవసాయోత్పత్తుల ఉత్పత్తిదార్లకు కంపెనీల ఏర్పాట్లకు ఏమి చర్యలు తీసుకున్నారు. ఈ ప్రశ్నకు జవాబు రాలేదు. నా దగ్గర ఉన్న సమాచారం ప్రకారంగా కేంద్ర ప్రభుత్వం ఇస్తున్నటువంటి సంస్థ ద్వారా ఈ రోజు మన జిల్లాలో ఆదర్శంగా ఉండేటట్లు ఐదు జిల్లాలు ఎంపిక చేశాము. దానిలో ప్రయోగాత్మకంగా ఆదిలాబాద్, నిజామాబాద్, నల్గొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఈ జిల్లాల్లో ఏ రకమైనటువంటి చర్యలు తీసుకున్నారు. రాష్ట్రమంతా ఎప్పటి నుంచి దీనిని విస్తరించేటువంటి కార్యక్రమం ఉంటుంది.

శ్రీ పోచారం శ్రీనివాస రెడ్డి: అధ్యక్షా రైతులు పంట పండించినప్పుడు మనం చూశాము. టమాట ఒక రోజు రూ.70 కిలో అమ్మకం జరిగింది. మరొకనాడు ఒకరూపాయికి అమ్మకం జరిగింది. ఈ యొక్క వ్యత్యాసాన్ని తీసివేయటానికి గౌరవ ముఖ్యమంత్రిగారు ములుగు దగ్గర రెండు వందల ఎకరాల స్థలం మాకు కేటాయించారు. వెంటనే ఒక నాలుగు వందలు, ఐదు వందల కోట్ల రూపాయల పెట్టుబడితో ప్రాసెస్ యూనిట్స్ ప్రభుత్వం పరంగా ఏర్పాటు చేస్తున్నాం. ప్రభుత్వ పరంగానే హార్టికల్చర్ డెవలప్‌మెంట్ డిపార్టుమెంటు ద్వారా ఈ కార్పొరేషన్‌కి ప్రాసెస్ యూనిట్స్‌ని నిర్వహించేటటువంటి బాధ్యతను నిర్వహిస్తాం.

గిట్టుబాటు ధర రావడానికి ఇప్పుడున్న పరిస్థితిలో కొంత ఇబ్బంది ఉంది. రాష్ట్రానికి 54 క్లస్టర్లు ఏర్పాటు చేశాము. ఒక్కో జిల్లాకి 4,5 క్లస్టర్లు ఆ క్లస్టర్లలో ఎంతమంది జనం ఉన్నారు. వారికి అవసరమైనటువంటి కూరగాయాలు, పండ్లు, బియ్యం, ఉప్పు, పప్పు, నూనెలు, చింతపండు, మాంసం, కోడి, గుడ్డు ఎంత ఇవన్నీ లెక్కకట్టి క్లస్టర్లలో రైతుకి గిట్టుబాటు ధర వచ్చే విధంగా చూడాలి. అధిక దిగుబడి వచ్చి అధిక పంట పండించి బజారులో తక్కువ ధరకు అమ్ముకునేటువంటి పరిస్థితి రాకుండా చూడాలి. ఉదాహరణకి 6 లక్షల మంది జనాభా ఉన్నారు. 6 లక్షల జనాభాకి ఏది ఎంత కావాలి. ఒక్క వ్యక్తికి రోజుకి సగటున 300 గ్రాముల కూరగాయలు కావాలి. 150 గ్రాముల పండ్లు కావాలి. 25 గ్రాముల ఉల్లిగడ్డ కావాలి. 25 గ్రాముల మసాలాలు కావాలి. 400 గ్రాముల బియ్యం కావాలి. 70 గ్రాముల పప్పు కావాలి. 35 గ్రాముల మటన్, 30 గ్రాముల చేపలు, నూనె 30 గ్రాముల, సంవత్సరానికి 200 గుడ్లు కావాలి. ఈ విధంగా లెక్కగట్టి రైతుల గిట్టుబాటు ధర లభించే విధంగా చూడాలి.

ఎక్కువ పంట పండించి నష్టపోయే బదులు ఆ ప్రాంతం యెక్క జనాభాను లెక్కగట్టుకొని ఆ చుట్టుప్రక్కల మండలాలలో పంటలు పండించి, అక్కడి వాళ్లకు సరఫరా చేయడం వినియోగదారులకు అనుకూలంగా ఉండే విధంగా రైతులకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా ఈ క్లస్టర్లను ముందే గుర్తించాము. ఈ సంవత్సరం పైలెట్ ప్రాజెక్ట్ క్రింద జిల్లాల వారిగా క్లస్టర్లు తీసుకుంటాం. వచ్చే ఖరీఫ్ నుంచి జిల్లాకు ఒక క్లస్టర్ తీసుకొని, అమలు చేస్తాము. ఈ విధంగా చేసిన తరువాత మిగిలిన సరుకు ఏదైనా ఉంటే హార్టీకల్చర్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ద్వారా ప్రాసెస్ చేసి మంచి మిర్చిపొడి, మంచి పసుపు పొడి, మంచి మసాలలు, మంచి సరుకు క్వాలీటితో కూడుకున్నటువంటి సరుకును, ప్రభుత్వ పరంగా పంపిణీ చేసే కార్పోరేషన్ కాబట్టి, ఆ సరుకును వినియోగదారులకు కూడా అందిస్తాం. ఈ పద్ధతి ప్రకారంగా రైతులకు ఈ ఒక్క పద్ధతి చేస్తేనే గిట్టుబాటు ధర వస్తుంది గానీ, పనికి రాని పంటలు పండించి రూ.70/- ఉన్న టమాట ధర ఈనాడు ఒక రూపాయి అయ్యింది. ఆ పరిస్థితి లేకుండా రైతులకు నష్టం లేకుండా ఈ చర్యలను తీసు కుంటామని మనవి చేస్తున్నాను.

(అంతరాయం)

అధ్యక్షా, కోల్డ్ స్టోరేజ్‌కు రెండు కోట్ల రూపాయలు కాదు. ఇంకా ఎంతైనా ఖర్చు పెడతాం. కోల్డ్ స్టోరేజ్ కోసం నేను ఢిల్లీ దాకా వెళ్లి అపెడా సంస్థను కలిశాను. పదిచోట్ల కోల్డ్ స్టోరేజ్‌కు ఎన్ని కోట్లు ఖర్చు వచ్చినా అపెడ సంస్థ సహకారంతో దానిని నిర్మాణం చేస్తాము. ఒక్కో సెంటర్‌కు రెండు కోట్లు కాదు. రైతు ప్రయోజనాలను కాపాడటం కోసం ఎంతైనా ఖర్చు పెట్టడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

### ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రాయితీ రుణాలు

ప్రశ్న నెం.1063(42)

శ్రీ సబావత్ రాములు నాయక్, ఎం.ఎల్.సి.:- గౌరవనీయులైన పరిశ్రమల శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) సబ్సిడీ భాగంతో పాటు ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు మంజూరు చేసిన రుణాల వివరాలు ఏమిటి;

ఆ) షెడ్యూల్డు తెగల జనాభా దామాషా ప్రకారం షెడ్యూల్డు తెగల ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రుణాలను మంజూరు చేయడం లేదన్న విషయం వాస్తవమేనా;

ఇ) అయితే, పరిస్థితిని మెరుగుపరచడానికి తీసుకున్న చర్యలేమిటి?

గౌరవనీయులైన పరిశ్రమల శాఖ మంత్రి (శ్రీ జూపల్లి కృష్ణారావు):- అ) పరిశ్రమల శాఖకు సంబంధించినంత వరకు ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఎటువంటి రుణాలను మంజూరు చేయడం లేదు. అయినప్పటికీ, తెలంగాణ రాష్ట్ర కార్యక్రమం పథకం (టి-ప్రైడ్) క్రింద దళిత పారిశ్రామికవేత్తలకు సత్వర అభివృద్ధి కోసం ఈ క్రింద చూపిన విధంగా పెట్టుబడి సబ్సిడీ మంజూరు కోసం ఏర్పాటు ఉంది.

ఆ) ఎస్సీ/ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఏర్పాటు చేసే సూక్ష్మ, చిన్న తరహా సంస్థలు (ఎంఎస్ఇల) కోసం నిర్ణయించిన మూలధన పెట్టుబడిపై 35 శాతం పెట్టుబడి సబ్సిడీ, ఎస్సీ/ఎస్టీ ఔత్సాహిక మహిళా పారిశ్రామిక వేత్తల కోసం 35 శాతం + 10 శాతం అదనపు సబ్సిడీ (రూ.10.00 లక్షల గరిష్టానికి లోబడి) + టి – ప్రైడ్ పథకం ప్రకారం యూనిట్ ఒక్కింటికి రూ.75.00 లక్షలు గరిష్ట పెట్టుబడి సబ్సిడీ పరిమితిని వర్తింప చేస్తూ గిరిజన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు షెడ్యూల్డు ప్రాంతాలలో ఏర్పాటు చేసే యూనిట్లు కోసం అదనపు 5 శాతం పెట్టుబడి సబ్సిడీ.

ఇ) 2014, జూన్ నుండి 2016, జనవరి వరకు ఎస్సీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం 1821 యూనిట్లకు రూ.83.71 కోట్లు, ఎస్సీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం 1511 యూనిట్లకు రూ.67.37 కోట్ల పెట్టుబడి సబ్సిడీని మంజూరు చేయడమయింది.

శ్రీ సబావత్ రాములు నాయక్(నామినేటెడ్): అధ్యక్షా, నేను ప్రశ్న వేసిందేమో లోన్స్ మరియు సబ్సిడీల గురించి.

ఎస్సీ, ఎస్టీలకు 35 శాతం అదే మహిళా పారిశ్రామికవేత్తలకు అయితే 40 శాతం సబ్సిడీ ఇస్తున్నారు. పోయినసారి ఈ ప్రశ్నను వాయిదా వేయడం జరిగింది. ఇది ఆర్థిక మరియు గిరిజన సంక్షేమ శాఖలకు సంబంధించినది. తరువాత పరిశ్రమలకి సంబంధించినది. పరిశ్రమలకు లోన్ ఇవ్వడానికి మాకు ఎటువంటి అభ్యంతరం లేదు. విద్యుత్ గానీ, భూమి గానీ, నీరు గానీ అనుమతులన్నీ పరిశ్రమల శాఖ ఇస్తుంది. 35 శాతం సబ్సిడీతో ఇప్పటివరకు ట్రైబల్ వారికి యూనిట్లు మంజూరు అయ్యాయి. ఆదిలాబాద్‌లో-88, హైదరాబాద్‌లో-92, కరీంనగర్‌లో -32, ఖమ్మంలో-266, మహబూబ్‌నగర్‌లో-145, మెదక్‌లో-142, నల్గొండలో-219, రంగారెడ్డిలో-168, వరంగల్‌లో-109.

మన రాష్ట్ర ఆవిర్భావానికి ముందు 233 యూనిట్లుగా సమైక్య రాష్ట్రంలో ట్రైబల్స్‌కి మంజూరు అయ్యింది. తరువాత 1511 ఇండస్ట్రీస్ మన రాష్ట్రం వచ్చిన తరువాత ఏర్పడినవి. సబ్సిడీ అందరికి ఇస్తున్నారు. ఒక ట్రైబల్ వారికి వచ్చేవరకు క్వార్టర్లీగా రెండు సార్లు మాత్రమే సబ్సిడీ ఇవ్వడం జరిగింది. మన ముఖ్యమంత్రి గారు ఎస్సీ, ఎస్టీ వారు బాగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశ్యంతో జూన్ 12, 2015 నాడు రూ.456 కోట్ల రూపాయలను విడుదల చేయడం జరిగింది. జనరల్ వారికి సబ్సిడీ ఇచ్చారు. ఎస్సీ మిత్రులకు రూ.250 కోట్లు ఇచ్చారు. కానీ, గిరిజనులకి రూ.16 కోట్లు మంజూరు చేయడం జరిగింది. వీటి గురించి ప్రభుత్వానికి ఒక ఉత్తరం రాయడం జరిగింది.

శ్రీ కడియం శ్రీహరి: గౌరవ సభ్యులు చెబుతున్న విషయం ఏమిటంటే ప్రశ్న సంబంధిత శాఖకు వెళ్లలేదు, నాకు కావలసిన సమాధానం రావడం లేదు, ఈ ప్రశ్నను ఆర్థిక శాఖకు గానీ, ట్రైబల్ శాఖకు గానీ, వేస్తే సమాధానం వచ్చేదని అంటున్నారు.

(అంతరాయం)

మిస్టర్ చైర్మన్: నేను ఆ మాట ముందుగానే చెప్పాను. అయినా సభ్యుడికి అడగాలని ఉండి అడగడం జరిగింది.

శ్రీ కడియం శ్రీహరి : మీకు కావలసిన సమాధానం ఇప్పుడు రాదు.

(అంతరాయం)

శ్రీ సబావత్ రాములు నాయక్: లేఖ నెం.16214 తేది. 24-11-2015 అప్పటికే ఎస్టీలకు రూ.65కోట్లు సబ్సిడీ రావాలి. రూ. 16 కోట్లు రిలీజ్ చేశారు. అక్కడ ఎస్టీల సంఖ్య పెరగడం వల్ల ఇంకా రూ.53 కోట్లు విడుదల కావలసి ఉంది. రూ.32 కోట్లు రెండు విడతలలో రావలసి ఉండగా అది కూడా పెండింగ్‌లో ఉంది. దాదాపు రూ.100 కోట్లు రావలసి ఉంది. ఎస్టీ సబ్‌ప్లాన్ ఉంది దానిలో నిధులను విడుదల చెయ్యమనండి. లేదా ఆర్థిక శాఖతో మాట్లాడి నిధులను రిలీజ్ చెయ్యమని అడుగుతున్నాను. ఉదాహరణకు, చర్లపల్లిలోని భిక్షపతి నాయక్ అనే ఒక బి.టెక్. ఇంజనీర్ గ్యాస్ ఫ్యాక్టరీ పెట్టుకొని, సబ్సిడీ రాక టెన్షన్స్ వల్ల గుండె పోటు వచ్చి చనిపోవడం జరిగింది. అతి తొందరగా రూ.100 కోట్ల సబ్సిడీని విడుదల చేయవలసిందిగా కోరుతున్నాను.

10.40 ఉ. శ్రీ యం. రంగారెడ్డి(శాసనసభ నియోజకవర్గం): అధ్యక్షా, అసలు టియస్ఐడిసి ఉందా? ఉంటే, యస్సీ యస్టీలకు ఈ ఈక్విటీ, సెక్యూరిటీ వర్తిస్తుందా? సెక్యూరిటీ లేకుండా ఎస్సీ, ఎస్టీలకు టియస్ఐడిసి నుంచి గానీ, ఎస్.ఎఫ్.సి. నుంచి గానీ రు.5కోట్ల వరకు ఇచ్చే స్కీముందా? ఎస్సీ, ఎస్టీలకు సబ్సిడీ బకాయిలు రాలేదని రాములు నాయక్ అంటున్నారు. అసలు ఈ పాలసీలో ఈప్రాంత ప్రజలకు పరిశ్రమలు స్థాపించడంలో ప్రాధాన్యత ఉందా? ఒకప్పుడు ఎస్సీ, ఎస్టీ పిల్లలు మెట్రిక్యులేషన్ కూడా పూర్తి చేసే వారు కాదు. కానీ నేడు లక్షల మంది ఎస్సీ, ఎస్టీ పిల్లలు పెద్ద చదువులు చదువుకుంటున్నారు. అందరికంటె వాళ్లకే ఎక్కువ తెలివి. ఆ ప్రజలకి ఈక్విటీ, సెక్యూరిటీ ఏమీ లేదు. ఈ ప్రభుత్వం పెద్దపెద్ద మాటలు చెబుతోంది కానీ అసలు టైముకి వచ్చేసరికి ఏమీ లేదు. వాస్తవంగా వరంగల్ మరియు ఇతర ఏడు జిల్లాలలో 25 శాతం నుంచి 30శాతం వుంది, కానీ 12శాతం కూడా పక్కకిపోయింది. అసలు ఈపాలసీ ఉందో లేదో చెప్పండి.

శ్రీ జూపల్లి కృష్ణారావు: అధ్యక్షా, ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి అంటే 02.06.2014నాటికి ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన పరిశ్రమల సబ్సిడీ బకాయిలు రూ.76.59కోట్లు ఉన్నాయి. అందులో ఈ ప్రభుత్వం ఈ ఒకటిన్నర సంవత్సరంలో రూ.60.22కోట్లు రిలీజ్ చేయడం జరిగింది. దాంతోబాటు ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి ఇండస్ట్రియల్ ప్రమోషన్ క్రింద రూ.19కోట్లు రిలీజ్ చేయడం జరిగింది. అలాగే పావలా వడ్డీ క్రింద పెండింగు ఉన్న మొత్తాన్ని ఇవ్వడం జరిగింది. Only power subsidy for industries కి సంబంధించి కొన్ని బకాయిలున్న మాట వాస్తవమే. దానికి సంబంధించి నేను ఆర్థికమంత్రితో, సంబంధిత ప్రిన్సిపల్ సెక్రటరీగారితో మాట్లాడడం జరిగింది. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే లోపల, 15రోజుల్లో substantial portion రిలీజ్ చేయడం జరుగుతుందని వారు ఒప్పుకోవడం జరిగింది.

గతంలో ఎప్పుడూ లేని విధంగా ఎస్సీ, ఎస్టీలను పారిశ్రామికవేత్తలుగా అభివృద్ధి చేయడానికి, సుమారుగా 200 మందిని కాంట్రాక్టర్లుగా ఎస్సీ, ఎస్టీలను డెవలప్ చేయాలనే గౌరవ ముఖ్యమంత్రిగారి నిర్ణయం మేరకు ఒక జీ.ఓ. జారీ చేయడం జరిగింది. దానికి సంబంధించిన గైడ్‌లైన్స్ ప్రాసెస్‌లో ఉన్నాయి. గతంలో ఎవరైనా ఎస్సీ, ఎస్టీ, బిసి లు ఒక పరిశ్రమ పెట్టాలంటే నెలల తరబడి, సంవత్సరాల తరబడి ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా అవసరమైన లైసెన్సులు గాని, ఇన్సెంటివ్స్ గానీ ఇచ్చిన పరిస్థితి లేదు. కానీ ఈ రోజు ఎంత చిన్న వ్యక్తి అయినా, ఎస్సీ, ఎస్టీ, బిసి, ఓసి లు ఎవరైనా పరిశ్రమలు పెట్టాలంటే ఎవరి చుట్టూ తిరగవలసిన అవసరం లేకుండా లైసెన్సులు, పర్మిషన్లు ఇస్తున్నాం. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి, భూమి కొనుగోలు చేస్తున్నపుడు కట్టే స్టాంప్ డ్యూటీని నూరుశాతం రీయింబర్స్‌మెంటు చేస్తున్నాం. లీజున్నా కూడా నూరు శాతం సబ్సిడీ ఇస్తున్నాం. ల్యాండ్ కాస్ట్‌లో 33.3శాతం సబ్సిడీ ఇస్తున్నాం. ల్యాండ్ కన్వర్షన్ సమయంలో కట్టవలసిన డబ్బుల్లో కూడా 25శాతం సబ్సిడీ ఇస్తున్నాం. విద్యుత్ వినియోగానికి సంబంధించి ప్రతి యూనిట్‌కి రూ.1.50పైసలు, అంటే 25శాతం నుంచి 30శాతం వరకు సబ్సిడీ ఇస్తున్నాం. సీడ్ కేపిటల్ అసిస్టెన్స్‌కి సంబంధించి 20శాతం సబ్సిడీ ఇస్తున్నాం. టీయస్ – ప్రైడ్ ప్రకారం దళితులను, గిరిజనులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వమే రూ.5కోట్లకు గ్యారంటీ ఇచ్చే విధంగా పాలసీలో ఉంది. Policy is under consideration. At the earliest, ఆ పాలసీ రిలీజ్ చేయడం జరుగుతుంది. గతంలో ఏ ప్రభుత్వాలు చేయని విధంగా మేము చేస్తున్నాం, గత ప్రభుత్వాలకు కనీసం ఆ స్పృహ కూడా లేకుండా పోయింది. కాంట్రాక్టర్లంటే గొప్ప గొప్ప వాళ్లే ఉండేవారు. ఎస్సీ, ఎస్టీలు ఏమి పాపం చేశారు, అన్ని వర్గాలు సంతృప్తిగా ఉన్నపుడే బంగారు తెలంగాణకి అర్థం ఉంటుందనే ఆలోచనతో ఎవ్వరూ అడగకుండానే, చెప్పకుండానే దళితులను, గిరిజనులను పారిశ్రామికవేత్తలుగా, కాంట్రాక్టర్లుగా చేయాలని, భారతదేశంలో ఏరాష్ట్రంలో లేని విధంగా స్కీములు, ఇన్సెంటివ్స్, సబ్సిడీలు, పర్మిషన్స్... in every aspect, our State is number one in the country as far as Policy is concerned, as far as incentives are concerned, as far as subsidies are concerned. ఎస్సీ, ఎస్టీలను ప్రోత్సహించడంలో దేశంలోని ఏరాష్ట్రమూ సాటిరాని విధంగా చేస్తున్నాం. మీరు అడిగిన బకాయిలను ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు రిలీజ్ చేసే విధంగా ఫైనాన్స్ డిపార్టుమెంటుతో కోఆర్డినేట్ చేస్తున్నాం. ఈ రోజు ఉదయం ఫైనాన్స్ మినిస్టర్ గారితో మాట్లాడడం జరిగింది. తప్పకుండా న్యాయం చేస్తామని తెలియజేస్తున్నాను.

శ్రీ యం.యస్. ప్రభాకర్ రావు(స్థానిక సంస్థలు–హైదరాబాద్): ప్రభుత్వం గురించి కొన్ని వాస్తవాలు చెప్పారు. మీరు అన్నట్లుగా ఎవరైనా employment giver గా ఉండాలే గానీ employment seeker గా ఉండకూడదు. సబ్సిడీకి సంబంధించి కొన్ని బకాయిలు మిగిలిపోయాయి. బ్యాంకర్స్ ఒత్తిడి తీసుకొస్తున్నాయి. నాలుగు మాసాల లోపు ఈ సబ్సిడీ బకాయిలను రిలీజ్ చేసే ఆలోచన వుందా? పరిశ్రమలకు భూమి కేటాయింపు విషయంపై జీ.ఓ.102ని

జారీ చేశారు. ఇందులో లీజు పీరియడ్ పదేళ్లని ఉంది. It is too short. లీజు పీరియడ్‌ని కనీసం 25 నుంచి 30సంవత్సరాలకు పెంచడానికి ప్రభుత్వం ఆలోచిస్తుందా? long lease ఇవ్వడం వల్ల బ్యాంకర్స్ ఫైనాన్షియల్‌గా సపోర్టు చేయడానికి ముందుకు వస్తారు.

శ్రీ జూపల్లి కృష్ణారావు: అధ్యక్షా, కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఇండస్ట్రియల్ పార్కులలో దళితులకు, గిరిజనులకు ప్రపోర్షనేట్‌గా రిజర్వేషన్ కల్పించే ఏర్పాటు చేస్తున్నాం. వాళ్ల అవసరాన్ని బట్టి, type of industryని బట్టి, we are extending this also. ఎలాంటి సమస్య లేదు. గతంలో ఎస్సీ, ఎస్టీ కార్పోరేషన్స్ నుంచే వాటికి సంబంధించి కూడా సబ్సిడీ పర్సంటేజీ చాలా తక్కువగా ఉండేది. గతంలో 20శాతం, 30శాతం సబ్సిడీ ఉంటే, 70శాతం బ్యాంకు పోర్షన్ ఉండేది. ఇప్పుడు అన్ని స్కీములో 80శాతం ప్రభుత్వమే భరిస్తూ, 20శాతం బ్యాంకు నుంచి ఇచ్చే ఏర్పాటు చేస్తున్నాం, not only for establishing industries, in other schemes also. గతంలో ఎప్పుడూ లేని విధంగా దళిత గిరిజన యువకులకు, పారిశ్రామికవేత్తలు కాబోయే వారికి పెద్ద ఎత్తున అన్ని రకాలుగా ప్రోత్సాహకాలు ఇచ్చే ఏర్పాట్లు చేస్తున్నాం. పెండింగులో ఉన్న సబ్సిడీ బకాయిలను నాలుగు మాసాలలో కాదు, ఇంకా పదిహేను రోజుల సమయం ఉంది, ఈ ఆర్థిక సంవత్సరంలోనే వీలైనంత వరకు క్లియర్ చేసే విధంగా we are making all the efforts. Definiteగా వాళ్ల సమస్యలను పరిష్కారం చేస్తాం.

## MAINTENANCE OF SCHOOLS BY VILLAGE PANCHAYATS

LCQ No.1341 (43)

Sri Kompally Yadava Reddy, MLC:- Will the Deputy Chief Minister & Minister for Education be pleased to state:

(a) whether it is a fact that it is under consideration to entrust the responsibility of maintenance of schools to Village Panchayats;

(b) if so, the details thereof; and

(c) whether the Panchayats will be allocated separate funds for this purpose?

HON'BLE DEPUTY CHIEF MINISTER & MINISTER FOR EDUCATION (SRI KADIYAM SRIHARI):- (a, b & c) Yes Sir, the matter is under consideration of the Government.

శ్రీ కొంపల్లి యాదవరెడ్డి(శాసనసభ నియోజకవర్గం): అధ్యక్షా, మంత్రిగారు నా ప్రశ్నకి ఆన్సర్ ఒక లైనులో చెప్పడం జరిగింది. వారు చాలా అనుభవజ్ఞులు. వారికి అన్ని విషయాలపై చక్కటి అవగాహన ఉంది. కానీ నేను అడిగిన ప్రశ్నకి ఇటువంటి సమాధానం చెబితే ఇక మేము ప్రశ్నలు అడగాలా లేదా అనే సంశయం ఏర్పడుతోంది. ఈ సబ్జెక్టునే చులకన చేసేటట్లుగా అధికారులు ఎందుకు ఈ ఆన్సర్‌ని ప్రొవైడ్ చేశారో, దాన్నే మంత్రిగారు ఎందుకు ఈసభలో చెబుతున్నారో నాకు అర్థం కావడం లేదు. నేను అడిగిన ప్రశ్నను తిప్పి రాశారు. If it is so, details thereof? Yes అని చెప్పారు. డీటెయిల్స్ ఏవైనా ఉంటే చెప్పగలుగుతారా? ఇక్కడ డీటెయిల్స్ ఏమీ లేవు కానీ యస్ అన్నారు. సి ప్రశ్న – ఈ ప్రయోజనం కోసం పంచాయతీలకు ప్రత్యేక నిధులను కేటాయించడమువుతుందా? అంటే యస్ అన్నారు. This is under the consideration of the Government అని ఇంగ్లీష్‌లో ఉంది. ఒకసారి యస్ అన్న తర్వాత ఇక under consideration ఏమి ఉంటుంది? కాబట్టి ఈ ప్రశ్నకి ఎవరైతే ఇటువంటి సమాధానాలు తయారు చేశారో వారి మీద తక్షణమే చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది. ఇది చాలా సీరియస్ ఇష్యూ. ఈమధ్యనే ముఖ్యమంత్రిగారు రెవ్యూ చేసి విద్యారంగాన్ని బాగు చేయాలనే ఉద్దేశ్యంతో ఒక నిర్ణయం తీసుకొన్న సందర్భంలో ఇటువంటి సమాధానాలు రావడం బాధాకరం.

శ్రీ నారదాసు లక్ష్మణరావు(స్థానిక సంస్థలు–కరీంనగర్): అధ్యక్షా, పాఠశాలల నిర్వహణ గ్రామ పంచాయతీలకు అప్పగించడమున్నది ఒక మంచి నిర్ణయం. కానీ అందులో ఏ, ఏ బాధ్యతలు గ్రామ పంచాయతీలకు అప్పగించాలనే ప్రతిపాదన ఉంది? ఆ బాధ్యతలు గ్రామ పంచాయతీలకు అప్పజెప్పిన తర్వాత, ఆ గ్రామ పంచాయతీల మీద

పర్యవేక్షణాధికారాలు ఏరకంగా ఉండబోతున్నాయి? ఎందుకంటే గ్రామ పంచాయతీలకు అప్పజెప్పిన తర్వాత ప్రభుత్వ స్ఫూర్తిని, ఉద్దేశ్యాలను వారు సరిగా అర్థం చేసుకోక వేరే రకంగా పెత్తనం చెలాయించే అవకాశాలున్నాయి కాబట్టి దాని మీద పర్యవేక్షణాధికారాలు ఏరకంగా ఉంటాయి, అదే విధంగా ఏ, ఏ బాధ్యతలు గ్రామ పంచాయతీలకు అప్పజెబుతారో.. ఈరెండింటికీ సమాధానాలు చెప్పాలని కోరుతున్నాను.

శ్రీ పూల రవీందర్(ఉపాధ్యాయ నియోజకవర్గం-వరంగల్, ఖమ్మం మరియు నల్గొండ): అధ్యక్షా, మన గౌరవ ముఖ్యమంత్రిగారు ఒకమంచి ఆలోచన చేయడం సంతోషం. రూ.40లక్షలు, రూ.50లక్షలు ఖర్చు పెట్టి పాఠశాలలకు బిల్డింగులు కట్టిస్తున్నాం. పాఠశాలలను గ్రామ పంచాయతీలకు అప్పజెబుతున్నపుడు, ఆ పాఠశాలల్లో శానిటేషన్‌కి సంబంధించి పూర్తి స్థాయిలో బడ్జెటు కేటాయింపులు చేసి వాటిని గ్రామపంచాయతీలకు అప్పగించడం జరిగిందా? లేదా?

శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి: అధ్యక్షా, మంత్రిగారు గతంలో లెక్చరర్‌గా బాధ్యతలు నిర్వహించారు. అదేవిధంగా గతంలో విద్యాశాఖా మంత్రిగా కూడా పని చేశారు. సార్, ఇది చాలా సీరియస్ ఇష్యూ . ఎందుకంటే పాఠశాలల నిర్వహణ బాధ్యతంటే మామూలు విషయమా? The total administration will be handed over to the Gram Panchayats. Is it correct? నిన్ననేమో పంచాయతీరాజ్ శాఖామంత్రిగారు .. only sanitation అనే మాట చెప్పారు. ఈరోజు మీరు total administration will be handed over to the Gram Panchayats అంటున్నారు. What is this? ఎంత పేలవంగా జవాబు చెప్పారో చూడండి. A,B, C... Yes అంటే ఎలా?

శ్రీ కడియం శ్రీహరి: అధ్యక్షా, కొంత understanding gap ఉన్నదని నా అభిప్రాయం. Please, go through the Question in English version. What is the Question? This question is confined to the maintenance of schools. Please go though the question put by Sri Yadava Reddy garu – “whether it is a fact that it is under consideration to entrust the responsibility of maintenance of schools to Village Gram Panchayats?” for which I replied – ‘Yes, the matter is under consideration of the Government.’ What is wrong in it ఇందులో ఏదో తప్పున్నట్లు ఆయనొక వైపు, మీరొక వైపు మాట్లాడుతున్నారు. దాన్ని మీరు సరిగా అర్థం చేసుకోలేదు. పభుత్వ పరిశీలనలో ఉందా అని మీరడిగారు. అవును, ఉందని నేను చెప్పాను. బి ప్రశ్నకు సంబంధించి – వివరాలు తయారుచేస్తున్నాం.

(C) Whether the Panchayats will be allocated separate funds for this purpose? అని అడిగారు, అవునండీ, దాని గురించి ఆలోచిస్తున్నామని చెప్పాను.

విషయం ఏమంటే – గ్రామీణ ప్రాంతాలలో, పట్టణ ప్రాంతాలలో పాఠశాలల నిర్వహణ కొంత సమస్యగా మారింది. అక్కడ ఎవ్వరూ ఊడ్చే వాళ్లు లేరు, పిల్లలకి మంచినీళ్లు పెట్టే వారు లేరు, మనం హరితహారం క్రింద పెట్టిన మొక్కలకు నీళ్లు పోసే వారు లేరు. అక్కడ ఉండే అసెట్స్‌ని కాపాడడానికి వాచ్‌మెన్ సిస్టం లేకుండా పోయింది. దాన్ని దృష్టిలో పెట్టుకొని మా విద్యాశాఖని రెవ్యూ చేస్తున్నపుడు, ఆ కార్యక్రమంలో గౌరవ ముఖ్యమంత్రిగారిని ఒక విషయం అడిగాము. సార్, ఈ పాఠశాలలకు ఒకస్వీపర్, ఒకవాచ్‌మేన్ చొప్పున ఏర్పాటు చేయండి. దీంతో మన పాఠశాలలను నిర్వహణ చేయడానికి వీలవుతుందని అడిగాము. అప్పుడు వారు ఏమన్నారంటే – స్వీపర్ లేదా వాచ్‌మెన్లను పెట్టడం వల్ల ఈసమస్య పరిష్కారం కాదు.

ఈ నిర్వహణ మొత్తాన్ని లోకల్ బాడీస్‌కి అప్పజెప్పుదాం, వాళ్లకి సరిపడ స్టాఫ్ ఉంది, డ్రింకింగ్ వాటర్ వాళ్ల కంట్రోల్‌లో ఉంటుంది, శానిటేషన్ వాళ్ల కంట్రోల్‌లో ఉంటుంది, హరితహారం వాళ్లకంట్రోల్‌లో ఉంటుంది, అర్బన్ లోకల్ బాడీస్ కావచ్చు, రూరల్ లోకల్ బాడీస్ కావచ్చు, వాళ్లకి అప్పజెప్పినట్లయితే బాగుంటుందని అన్నారు. వెంటనే నేను పంచాయతీ రాజ్ స్పెషల్ సి.యస్., మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ స్పెషల్ సి.యస్.తో మాట్లాడి, మీరు ఎడ్యుకేషన్

డిపార్టుమెంటు కలిసి వీటిని ఏరకంగా నిర్వహించాలో మోడాలిటీస్ తయారుచేయాలని చెప్పడం జరిగింది. పంచాయతీరాజ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఉన్నతాధికారులు వెంటనే they have addressed letters to their Directors. మీరు, ఎడ్యుకేషన్ డిపార్టుమెంటుతో కూర్చొని మోడాలిటీస్ తయారుచేయమని చెప్పారు. పాఠశాలల నిర్వహణను గ్రామ పంచాయతీలకు బదిలీ చేస్తూ in principle పంచాయతీరాజ్ శాఖ మాకు ఒక లెటర్ కూడా ఇచ్చింది. విద్యాశాఖ, పంచాయతీరాజ్ శాఖ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ.. ఈ మూడు శాఖల పరిశీలనలో ఈసమస్య ఉంది. Maximum ఒక పదిహేను, లేదా నెల రోజుల్లో దీనికి ఒక తుది రూపం ఇవ్వబోతున్నాం. ముఖ్యమంత్రిగారు ఇంకొక మాట కూడా చెప్పారు. అవసరమైతే ఒక చట్టం కూడా తీసుకొద్దామన్నారు. చట్టం తీసుకొచ్చి లోకల్ బాడీస్‌లో ఉండే గవర్నమెంట్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ నిర్వహణను ఆయా లోకల్ బాడీస్‌కి అప్పజెబితే బాగుంటుందనే ఒక పాజిటివ్ దృక్పథంతో తీసుకున్న నిర్ణయమే తప్ప మరొకటి కాదని గౌరవ సభ్యులకు మీద్వారా తెలియజేస్తున్నాను.

### ఇంటర్మీడియట్ పరీక్షలలో గ్రేడింగ్ పద్ధతిని ప్రవేశపెట్టుట

ప్రశ్న నెం.1031(44)

సర్వశ్రీ కాటేపల్లి జనార్ధన్‌రెడ్డి, పూల రవీందర్, ఎమ్మెల్సీలు :- గౌరవనీయులైన ఉప ముఖ్యమంత్రి(విద్య) గారు దయచేసి ఈక్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) పదవ తరగతి పరీక్షలలో అమలు చేస్తున్న విధంగా ఇంటర్మీడియెట్ పరీక్షలలో కూడా గ్రేడింగ్ పద్ధతిని ప్రవేశపెట్టే ప్రతిపాదన ఏదైనా ఉన్నదా;

ఆ) ఇందుకు సంబంధించి తీసుకున్న చర్యలేమిటి?

గౌరవనీయులైన ఉప ముఖ్యమంత్రి (విద్య) (శ్రీ కడియం శ్రీహరి):- అ) లేదండీ

ఆ) ఈప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీ కాటేపల్లి జనార్ధన్‌రెడ్డి (ఉపాధ్యాయ నియోజకవర్గం- మహబూబ్‌నగర్, రంగారెడ్డి మరియు హైదరాబాద్) : అధ్యక్షా, ఇంటర్మీడియేట్ రిజల్ట్స్ వచ్చినపుడు ఏవిధంగా టి.వి.ఛానల్స్‌లో అడ్వర్టయిజ్‌మెంట్స్ వస్తున్నాయో మనందరమూ చూస్తున్నాం. ప్రజలను మభ్యపెట్టే విధంగా, మొత్తం ఎంత మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు, అందులో ఎంతమందికి ర్యాంకులు వచ్చాయో చెప్పకుండా, చాలా గొప్పగా వేలాది ర్యాంకులు మాకు వచ్చాయని ప్రకటనలు చేస్తున్నారు. వేలాది మంది పరీక్షలకు హాజరవుతుంటే అందులో వచ్చిన అతి తక్కువ ర్యాంకులను గొప్పగా చెప్పుకోవడం వల్ల అనారోగ్యకరమైన పోటీ వాతావరణం ఈరోజు కార్పోరేటు కళాశాలల్లో ఏర్పడిందనే మాట వాస్తవం.

**11.00 ఉ.** దానిని నియంత్రించడానికి 10వ తరగతిలో పెట్టినట్లుగా గ్రేడింగ్ పద్ధతిని ఇంటర్‌మీడియట్‌లో కూడా పెట్టినట్లయితే కొంత కార్పోరేట్ కళాశాలల యొక్క మోసాన్ని నియంత్రించిన వాళ్లం అవుతామనేది మీద్వారా మంత్రి గారి దృష్టికి తీసుకువస్తున్నాను.

కళాశాలల మోసం అనేది ఏవిధంగా ఉందనంటే, 10వ తరగతిలో మెరిట్ వచ్చినటువంటి విద్యార్థికి fees concession ఇస్తున్నామని చెప్పి ప్రైవేటు కళాశాలల వారు, వారి కళాశాలల్లో అడ్మిషన్ ఇస్తున్నారు. తరువాత విద్యార్థులు మంచి మార్కులు తెచ్చుకోలేదని చెప్పి మొత్తం ఫీజు చెల్లించాలని తల్లిదండ్రులను ఒత్తిడి చేసినటువంటి సందర్భాలు చాలా ఉన్నాయి. మెరిట్ విద్యార్థిని డల్‌గా మార్చినందుకు పనిష్‌మెంట్ కళాశాల వారికి ఇవ్వాలా? ఎవరికి పనిష్‌మెంట్ ఇవ్వాలి? మెరిట్ విద్యార్థిని డల్‌గా మార్చి ఫీజుల రూపంలో కళాశాలల వారు తల్లితండ్రులకు పనిష్‌మెంట్ ఇవ్వడం ఎంత వరకు కరెక్ట్? దీనిని ఏవిధంగా నియంత్రించాలో ఒకసారి ఆలోచన చేయాల్సిన అవసరముందని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ఎందుకంటే, ఈ గ్రేడింగ్ పద్ధతిని ప్రవేశపెట్టినట్లయితే కొంత కాంపిటీషన్ తగ్గుతుందనే భావనతోటే మేము అడగడం జరిగింది.

ఏదేమైనప్పటికీ, కార్పోరేట్ కళాశాలలను నియంత్రించే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఏ కండీషన్లు

కూడా fulfill చేయకుండా కళాశాలలు ఏర్పాటు చేస్తున్నారు. కళాశాలల్లో ఆట స్థలాలుండవు. ఈరోజు చాలా కళాశాలలు అపార్టుమెంట్లలోనే ఎక్కువగా నడుస్తున్నాయి. అది ఎంతవరకు సమంజసం అనేది ప్రభుత్వం ఆలోచన చేయాలని మీద్వారా కోరుతున్నాను. గతంలో బోడుప్పల్‌లో కూలిపోయినటువంటి కళాశాలను చూడడం జరిగింది. వీటిని నియంత్రించడానికి ప్రభుత్వం వద్ద ఏమైనా ఆలోచన ఉన్నదా? దీనిమీద ఒక హౌజ్ కమిటీ వేసినా ఇబ్బంది లేదు. ఒకవేళ హౌజ్ కమిటీ వేస్తే కళాశాలల మోసాలు ఏవిధంగా జరుగుతున్నాయనేది తెలియడానికి ఆస్కారం ఉందని తెలియజేస్తున్నాను.

శ్రీ పూల రవీందర్ : అధ్యక్షా, ఇంటర్‌మీడియట్ విద్యావ్యవస్థను చాలా సంస్కరించాల్సిన అవసరం ఉంది. కార్పోరేట్ విద్యాసంస్థలు ఎప్పుడైతే మొదలయ్యాయో ఆ సందర్భంలో ఆ కళాశాలలకు ఇచ్చినటువంటి అనుమతులు గానీ, వారి అడ్మినిస్ట్రేషన్ గానీ ప్రభుత్వానికి ఏమాత్రం సంబంధం లేకుండా నడుస్తుంటాయి. అపార్టుమెంట్లలో పొరపాటునా ఏదైనా అగ్ని ప్రమాదాలు జరిగితే అందులో ఉండే వందల మంది పిల్లలు బయటకు వచ్చే ముందే అది పూర్తిగా దగ్ధమవుతుంది. క్రీడా మైదానం ఎక్కడా లేదు. మొన్నటివరకు జరిగినటువంటి పాఠశాల విద్యలో ఏదైతే advertisement పద్ధతి ఉండెనో, గ్రేడింగ్ పద్ధతి వచ్చిన తరువాత టివిల్లో, పత్రికల్లో అవి బంద్ అయ్యాయి. ఇంటర్ మీడియట్‌లో మాత్రం కార్పోరేట్ కళాశాలలు ఒక పది ర్యాంకులు వచ్చాయని చెప్పి, వేలమంది పిల్లలని ప్రక్కకు పెట్టి ఈ విద్యా వ్యవస్థను పూర్తిగా నాశనం చేస్తున్నారు. ఈరోజు రైతు ఆత్మహత్యలకు కూడా ఈ కార్పోరేట్ కళాశాలలే అని చెప్పే తమరి ద్వారా గౌరవ మంత్రివర్యులకు విజ్ఞప్తి చేస్తున్నాను.

సొసైటీల్లో ఈ కార్పోరేట్ కళాశాలల్లో చదివించలేక ఇబ్బందులు పడుతూ, అప్పులు చేస్తూ ఈ కళాశాలలకు వస్తే రైతుల, మధ్య తరగతి కుటుంబాల రక్తం పీల్చే విధంగా ఈ విద్యా వ్యవస్థ పోతుంది. అందుకని, కార్పోరేట్ విద్యా రంగాన్ని మాత్రం పూర్తిగా కంట్రోల్ చేయాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాము.

శ్రీ డి.రాజేశ్వర్ రావు(నామినేటెడ్) : ఈ రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని గౌరవ ముఖ్యమంత్రి గారు కోరుకుంటున్నారు. తోటి గౌరవ సభ్యులు చెప్పినట్లుగా, 10వ తరగతిలో ఎవరైతే విద్యార్థులు మెరిట్ పొందుతున్నారో వారి అడ్రస్ తీసుకొని, వారి ఇంటికి వెళ్లి, వారి తల్లితండ్రుల దగ్గర సంతకాలు తీసుకొని fees concession విషయంలో కార్పోరేట్ విద్యా సంస్థలు నానా ఇబ్బందులు పెడుతున్న విషయం వాస్తవం. కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులెంత మంది? వారికి బోధిస్తున్న లెక్చరర్స్ ఎంత మంది అనేది తెలియడం లేదు. దానిమీద కూడా చర్య తీసుకోవాలి. గతంలో కొన్ని ఇంజనీరింగ్ కళాశాలలని మూసివేయడం జరిగింది. కానీ వారు మేనేజ్‌మెంట్ కోటాను పెట్టుకొని విచ్చలవిడిగా డబ్బులు వసూలు చేస్తున్నారు. వాటిమీద చర్యలు చేపట్టాలని గౌరవ ఉప ముఖ్యమంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి(శాసనసభ నియోజకవర్గం): అధ్యక్షా, ఇది చాలా సీరియస్ అంశం. దీనిమీద అందరికీ యునానిమస్ ఒపీనియన్ ఉంటుందని అనుకుంటున్నాను. దయచేసి దీనిమీద ప్రభుత్వం ఒక హౌస్ కమిటీ వేయాలని కోరుతున్నాను. ఎందుకంటే ఈ దోపిడీని అరికట్టాల్సిన అవసరం ఉంది. ఇంట్లో టివి ఆన్ చేస్తే ఒక బ్రహ్మాండమైన టోన్‌తో 1, 2, 3, 4, 5, 6, 7 ర్యాంకులని చెప్పుకుంటూ, మెస్మరైజ్ చేసి విపరీతమైన కార్పోరేట్ దోపిడీ చేస్తున్నారు. విద్యా శాఖలో ఉన్నటువంటి నియమాల్ని ఎక్కడా పాటించడం లేదు. నియమ, నిబంధనల్ని తుంగలో తొక్కుతున్నారు. ఇది మధ్య తరగతి వారికి చాలా ఇబ్బందికరంగా ఉంది. ఫీజులు కట్టలేకపోతున్నారు. రైతు ఆత్మహత్యలకు కూడా దీనితో లింకు ఉంది. ప్రైవేటు సంస్థలు అనేక రకాలుగా దోపిడీ చేస్తున్నాయి. కాబట్టి దీనిని

నియంత్రించడానికి దీనిమీద ఒక హౌజ్ కమిటీ వేయాలని ఈ సందర్భంగా డిమాండు చేస్తున్నాను.

SRI KADIYAM SRIHARI : Sir, This question is limited to grading system in Intermediate. సభ్యులు ఏం ప్రశ్నలు అడుగుతున్నారు? ఎటు పోతున్నారో నాకు అర్థం కావడం లేదు. అవకాశం వచ్చినప్పుడు ప్రశ్న ఏమున్నది, దానికి సప్లిమెంటరీ ఏమి అడగాలని ఆలోచన చేసి అడిగితే బాగుంటుందని నేను గౌరవ సభ్యులకి సూచిస్తున్నాను.

సభా సమయాన్ని వృథా చేస్తూ దీనిని ఎటు నుండి ఎటో పట్టుకపోవడం కరెక్ట్ కాదు. The question is related to grading system in Intermediate. సిబియస్ఈ మరియు స్టేట్ సిలబస్ అయినటువంటి 10వ తరగతిలో గ్రేడింగ్ పద్ధతి ఉన్నది. ప్రభుత్వం ఇంటర్‌మీడియట్‌లో గ్రేడింగ్ పద్ధతిని ఎందుకు ప్రవేశపెట్టడం లేదని అడుగుతున్నారు. ఇంటర్‌మీడియట్ మార్కుల ఆధారంగా 25శాతం వెయిటేజి ఎంసెట్‌లో, 40శాతం వెయిటేజ్ Joint Entrance Examination(JEE)లో ఉన్నది. ఇక్కడ చాలామంది విద్యాసంస్థలు కూడా నడిపేవారు ఉన్నారు. ఒక్క మార్కు తేడాతో వందల స్థాయిలో ర్యాంకులు మారిపోతాయి. కాబట్టి, తప్పకుండా subject - wise marks ఇవ్వాల్సిన అవసరం ఉన్నది. Keeping in view the JEE & EAMCET దానికొరకే ఇంటర్ మీడియట్‌లో గ్రేడింగ్ పద్ధతి పెట్టడం లేదు. Subject-wise marks ఇస్తున్నాము. దయచేసి గౌరవ సభ్యులు అర్థం చేసుకోవాలని కోరుతున్నాను. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రైవేటు విద్యా సంస్థలను ఇబ్బడి ముబ్బడిగా ప్రోత్సహించిన విషయం మీ అందరికీ తెలియంది కాదు. పాఠశాలల నుండి మొదలు పెట్టుకుంటే, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, ఇంజనీరింగ్ కళాశాలలు, ఎంబిఏ కళాశాలలు వంటివాటికి ఎందుకు అనుమతులిచ్చారో మాకైతే తెలియదు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబిఏ కళాశాలలు వంటి వాటికి కొత్తగా అనుమతులు ఇవ్వలేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన పొరపాట్లు ఇప్పుడు రిపీట్ కావద్దనే ఉద్దేశంతోని మేము చాలా జాగ్రత్త పడుతున్నాము. ఇంకా వాటిని రెగ్యులేట్ చేసేటువంటి ప్రయత్నం చేస్తున్నాము. ప్రభుత్వం మీద గానీ, నామీద గానీ, కోర్టుల ద్వారా గానీ అనేక రకాలుగా ఒత్తిడులు తెచ్చినప్పటికీ ఇంజనీరింగ్ కళాశాలలను రెగ్యులేట్ చేశాం. ఎక్కడా కూడా ఈల్డ్ కాకుండా, తెలంగాణ రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలలని బలోపేతం చేస్తున్నాము. ఇంజనీరింగ్ విద్యార్థి భారతదేశంలోనే కాకుండా ప్రపంచంలో ఎక్కడైనా కాంపిటీషన్‌ని ఎదుర్కొనే విధంగా చేస్తున్నాము. ప్రతి సంవత్సరం తనిఖీలు చేసిన తరువాతనే affiliation ఇస్తున్నాము. ఇంజనీరింగ్ విద్యా సంస్థలకి మామీద, ప్రభుత్వం మీద ఎంత కోపం ఉండాలో, అంత కోపం ఉంది. అయినా కూడా, in order to regulate Engineering education, we are doing that. మొట్టమొదటిసారిగా జూనియర్ కళాశాలలని కూడా రెగ్యులేట్ చేశాం. చాలా కళాశాలలకి అనుమతులు ఇవ్వలేదు. ప్రైవేటు జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, ఇంజనీరింగ్ కళాశాలలు, ఎంబిఏ కళాశాలలు ఫార్మా కళాశాలలు, డిఈడీ కళాశాలలు అవసరానికి మించి ఉన్నాయి. ఇప్పుడా కళాశాలలన్ని విద్యార్థులు లేక, వసతులు లేక వాళ్లంతట వారే వచ్చి మేము క్లోజ్ చేసుకుంటామని మాకు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇంటర్ మీడియట్ విద్యలో కూడా చాలా మార్పులు తీసుకువచ్చాము. Board of Intermediate చేసేటువంటి సర్వీసులన్నింటిని ఆన్‌లైన్‌లో పెట్టాము. గతంలో ఇంటర్ మీడియట్ బోర్డుకు వెళ్లి ఏదైనా పని చేసుకోవాలంటే డబ్బులు అడుగుతున్నారనే అపవాదు ఉండేది.

నేను విద్యా మంత్రి అయిన తరువాత Board of Intermediate చేసేటువంటి సర్వీసులన్నింటిని ఆన్‌లైన్‌లో పెట్టాము. ప్రతిదీ ట్రాన్స్‌ఫరెంట్‌గా, అవినీతికి, అక్రమాలకు ఆస్కారం లేకుండా చేస్తున్నాము. ఇంటర్‌మీడియట్ విద్యను పూర్తిగా ఉచితంగా చేశాం. భారతదేశం మొత్తంలో ఇంటర్‌మీడియట్ విద్యను పూర్తిగా ఉచితంగా ఇస్తున్న రాష్ట్రం

తెలంగాణ రాష్ట్రమని చెప్పడం నాకు చాలా గర్వంగా ఉంది. పిల్లలకి పుస్తకాలు ఫ్రీగా ఇస్తున్నాము, ఫీజులు వసూలు చేయడం లేదు. 2016-17 బడ్జెట్‌లో గౌరవ ముఖ్యమంత్రి గారు పాఠశాలల్లోనే కాకుండా ఇంటర్‌మీడియట్ విద్యార్థులకు కూడా మిడ్ డే మీల్ అందిస్తామని చెప్పడం చాలా గొప్ప విషయం.

Board of Intermediate వారు, Commissioner, Intermediate Education వారు గానీ ఎక్కడా కూడా చిన్న సంఘటన జరగకుండా పరీక్షలను చాలా చక్కగా నిర్వహించారు. ఇది అన్నింటికంటే సంతోషకరమైన విషయం. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రభుత్వ విద్యా సంస్థలతో పోల్చుకుంటే, ప్రైవేటు విద్యా సంస్థల్లో రెండింతల మంది ఎక్కువగా ఉన్నారు. దానిని జాగ్రత్తగా రెగ్యులేట్ చేయాలి తప్ప, ఒకేసారి విరుచుకుపడి వాటిన్నింటిని మూసివేయాలని ఆలోచన చేస్తే, దానిని బేర్ చేసేటువంటి పరిస్థితిలో ప్రభుత్వం ఉన్నదా? లేదా అనేది ప్రభుత్వం ఆలోచించుకోవాల్సిన అవసరం ఉంది.

కాబట్టి, అనేకరకాలుగా ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్న విద్యా రంగాన్ని ఇప్పుడిప్పుడే ప్రక్షాళన చేసే ప్రయత్నం చేస్తున్నాము. గత సంవత్సరం అంతా కూడా ఎక్కడెక్కడా గ్యాప్స్ ఉన్నాయి. ఎక్కడెక్కడా intervention అవసరమున్నది, రెగ్యులేటరీ మెకానిజాన్ని ఏ రకంగా బలోపేతం చేయాలని ఆలోచించి, ఒక్కొక్కటిగా మౌలిక వసతులు గానీ, faculty గానీ, regulatory mechanism కావచ్చు. వీటన్నింటిని కూడా బలోపేతం చేసుకుంటూ వస్తున్నాము. కార్పోరేట్ కళాశాలల్లో ఎక్కువ ఫీజులు వసూలు చేస్తున్నారనేది మాత్రం వాస్తవం. మేనేజ్‌మెంట్స్‌తో కూర్చోని దానిని నియంత్రించే ప్రయత్నం చేయాలనే ఆలోచనతోని ఉన్నామని తమద్వారా గౌరవ సభ్యులకి తెలియజేస్తున్నాను.

శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి (మైకు లేకుండా) : అధ్యక్షా, గౌరవ ఉప ముఖ్యమంత్రి గారికి అపారమైన అనుభవం ఉంది. బ్రహ్మాండంగా సమాధానమిచ్చారు. మమ్మల్ని కొద్దిగా కించపరిచేటట్లు మాట్లాడారు. ఎందుకంటే, ఎవరికీ అనుభవం లేక అనుబంధ ప్రశ్న వేయడం నేర్చుకోండి అని మాట్లాడారు. గ్రేడింగ్ పద్ధతి గురించి చెప్పారు, చాలా సంతోషం. మీరు ఇంకో ఫార్మ్‌లో లఘు చర్చ రూపంలో రండీ అంటే బాగుండేది. ఇక్కడ అంతా అనుభవజ్ఞులే. (Addressing the Hon'ble Deputy Chief Minister) We appreciate your reply. But, you are not supposed to comment on our credentials. దయచేసి ఇది పెద్దల సభ. సభలో ఏమి మాట్లాడాలో, ప్రజలతో ఏమి మాట్లాడాలో, మీతో ఏమి మాట్లాడాలో మాకు తెలుసు........... దయచేసి మీరు వాపస్ తీసుకోండి.

శ్రీ కడియం శ్రీహరి : అధ్యక్షా, బిఏసి సమావేశానికి పెద్దలు శ్రీ మహమ్మద్ ఆలి షబ్బీర్ గారు, శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి గారు హాజరయ్యారు. ఆరోజు status of Education in Telangana అనే subject తీసుకుందామని అన్నారు. ఇప్పటికే ఛైర్మన్ గారు దానిమీద నిర్ణయం తీసుకున్నారు. అది మాకు కమ్యూనికేట్ కూడా అయింది. ప్రభుత్వం తరఫున మేము దానికి సిద్ధంగా ఉన్నాము అధ్యక్షా. మీరు ఏరోజు చర్చ పెట్టినా విద్యావ్యవస్థ మీద చర్చించడానికి మేము సిద్ధంగా ఉన్నాము. నేను ఎవరిని ఉద్దేశించి కించపరిచే విధంగా మాట్లాడలేదు. నేను అన్నది ఏమంటే, ప్రశ్న ఏమిటి? మనం అడుగుతున్న అనుబంధ ప్రశ్నలేమిటి? దయచేసి చూసుకోవాలి, సరి చేసుకోవాలని మాత్రమే చెప్పాను.

## FILLING UP OF VACANCIES IN AIDED EDUCATIONAL INSTITUTIONS

LCQ No.1209 (46)

Sri Farooq Hussain, MLC:- Will the Deputy Chief Minister (Education) be pleased to state:

(d) the number of Government Aided Schools, Junior and Degree Colleges in the State;

(e) whether it is a fact that the number of vacancies of both teaching and non-teaching are lying vacant therein;

(f) if so, the steps proposed to be taken to fill up them;

(g) whether it is also a fact that these Institutions are not paying salaries to its employees regularly; and

(h) if so, the action taken in this regard?

HON'BLE DEPUTY CHIEF MINISTER & MINISTER FOR EDUCATION (SRI KADIYAM SRIHARI):- (a) There are 742 Aided Schools, 43 Aided Junior Colleges & 68 Aided Degree Colleges functioning in the State.

(b) Yes, Sir

(c) A General Ban on recruitment of Aided Staff in these Educational Institutions was imposed vide G.O. Ms.No. 35, Education Department, dt: 27.03.2006.

(d) No, Sir.

(e) Does not arise.

శ్రీ ఫారూక్ హుస్సేన్(నామినేటెడ్)ః అధ్యక్షా, ఎయిడెడ్ పాఠశాలల్ని బర్కాస్ చేసేటువంటి ఆలోచన ప్రభుత్వానికి ఏమైనా ఉన్నదా? హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలలో ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలలు ఎన్ని ఉన్నాయి? హైదరాబాద్ జిల్లాలోని ఎయిడెడ్ పాఠశాలల్లో, కళాశాలల్లో ఆంధ్ర వారిని నియమిస్తున్నట్లుగా సమాచారం అందుతుంది. అది ఎంతవరకు నిజం అనేది తెలియాలి. ఎయిడెడ్ పాఠశాలల్లో, కళాశాలల్లో ఉద్యోగస్తులను నియమించేందుకు రూల్స్ ఏమైనా ఉన్నాయా? అవి ఎంతవరకు అమలు జరుగుతుంది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలోని ఉర్దూ మీడియం పాఠశాలల్లో, కళాశాలల్లో ఉపాధ్యాయులు గానీ, లెక్చరర్స్ పోస్టులు గానీ ఖాళీగా ఉన్నాయి. వాటిని భర్తీ చేసేటువంటి ఆలోచన ప్రభుత్వం వద్ద ఏమైనా ఉన్నదా? లేకపోతే అవి మూతపడే పరిస్థితులు ఉన్నట్లుగా మాకు తెలుస్తుంది. పాఠశాలల్లో, కళాశాలల్లో ఉపాధ్యాయులు గానీ, లెక్చరర్స్ పోస్టులు గానీ భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ పూల రవీందర్ః అధ్యక్షా, ఎయిడెడ్ వ్యవస్థ ఎప్పుడో ఏర్పడింది. కొన్ని కళాశాలల్లో సరిపోయేంత పిల్లలున్నారు. కానీ, అక్కడ స్టాఫ్ లేరు. చాలా పాఠశాలల్లో, కళాశాలల్లో పిల్లలు లేక మూసివేశారు. కానీ వారిని adjustment చేయడంలో పూర్తిస్థాయిలో నిర్ణయం జరుగలేదు. ఒక నిర్దిష్టమైన నిర్ణయం తీసుకొని పాఠశాలల్ని, కళాశాలల్ని ఏవిధంగా adjustment చేస్తున్నారనేటువంటిది తెలియజేయాలి. అక్కడి స్టాఫ్‌కి కూడా ప్రతినెల వేతనాలు అందేట్లుగా చూడాలని మీద్వారా గౌరవ ఉప ముఖ్యమంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ కడియం శ్రీహరిః అధ్యక్షా, ఈ ప్రభుత్వం ఎయిడెడ్ సంస్థలని మూసేసేటటువంటి ఆలోచనలో ఉందని గౌరవ సభ్యులు శ్రీ ఫారూక్ హుస్సేన్ గారు చెప్పడం జరిగింది. తెలంగాణ ప్రభుత్వానికి అటువంటి ఆలోచన లేదని తమరి ద్వారా గౌరవ సభ్యులకి తెలియజేస్తున్నాను. అక్టోబరు, 2004లో ఒక మెమో విడుదల చేశారు.

11.20 ఉ. కాంగ్రెస్ ప్రభుత్వం అక్టోబర్ 2004 సంవత్సరంలో ఉత్తర్వులిచ్చింది. మళ్లీ 2006 సంవత్సరంలో జి.ఓ.యం.యస్. నెం.35 ప్రకారం అదే కాంగ్రెస్ పార్టీ ఉత్తర్వులిచ్చింది. దీంట్లో కూడా ప్రైవేటు ఎయిడెడ్ ఇనిస్టిట్యూషన్స్‌లో ఏర్పడే ఖాళీలను గానీ, అవసరమున్న మేరకు పోస్టులకు అనుమతించడం గానీ లేదా భర్తీ చేయడానికి వీలు లేదని, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం వలన ఇవ్వాళ ఎయిడెడ్ ఇనిస్టిట్యూషన్స్ బందీ అయిపోయి, అనేక రకాల ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. ఈ సమస్య గురించి మేము సంబంధిత శాఖాధికారులతో చర్చించడం జరిగింది.

తెలంగాణలో ఎయిడెడ్ ఇనిస్టిట్యూషన్స్‌ని కూడా revive చేయాల్సిన అవసరమున్నది. ఎగ్జిబిషన్ సొసైటీ ద్వారా నడుస్తున్న కళాశాలలను కూడా revive చేయాల్సిన అవసరమున్నది. ఇప్పుడున్నటువంటి పరిస్థితుల్లో ఒక్క డిగ్రీ కళాశాల నెలకొల్పడానికి సుమారుగా రూ.40కోట్ల నుండి రూ.50కోట్లు అవసరమవుతుంది. ఇప్పుడున్నటువంటి ఎయిడెడ్ ఇనిస్టిట్యూషన్స్ అయిన జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు ఏవైతే ఉన్నాయో, అందులో కొన్నింటికి రూ.25కోట్ల నుండి రూ.50కోట్ల వరకు assets ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఎయిడెడ్ ఇనిస్టిట్యూషన్స్‌ను revive చేయాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉన్నది. గౌరవ ముఖ్యమంత్రి గారి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి ఎయిడెడ్ ఇనిస్టిట్యూషన్స్‌ను revive చేయడం జరుగుతుంది. ఇక్కడ

ఉన్నటువంటి తెలంగాణ విద్యార్థులకు మరికొన్ని విద్యాసంస్థలు అందుబాటులో వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

శ్రీ మహమ్మద్ ఆలి షబ్బీర్ : అధ్యక్షా, గౌరవ ఉప ముఖ్యమంత్రిగారిని అడిగేదేమంటే, 2002-2003 సంవత్సరంలో తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నప్పుడు ఈ బ్యాన్ పెట్టారు. దాని తర్వాత సడలింపు చేసేందుకు ప్రభుత్వం ఒక clause పెట్టింది. అవసరమున్నప్పుడు ప్రభుత్వ అనుమతి తీసుకొని పోస్టులను భర్తీ చేయండని అన్నారు. అప్పటి వరకు ప్రభుత్వ అనుమతి లేకుండానే మేనేజ్‌మెంట్ పోస్టులను భర్తీ చేసుకొని, ప్రభుత్వం నుండి claim చేసే వాళ్లు. వాటిని క్రమబద్ధీకరించే విషయంలో దయచేసి కరెక్ట్ చేయండి.

SRI KADIAM SRIHARI: Sir, Final Order against filling up of vacancies in aided educational institutions issued in the year 2006. Again I would like to remind this august House that when the Congress Party was in the Government in the year 2004, a memo was issued according to which "no new posts of grant in aid would be created and the existing vacancies will also not be filled up except what has been specifically authorized since there is a general ban on recruitment except for the posts for which the permission was specifically granted by the Government. 2006 సంవత్సరంలో వచ్చిన జి.ఓ.నే ఇప్పటి వరకు ఉన్న చివరి జి.ఓ. గతంలో ఇష్యూ చేసిన అన్ని జి.ఓలలో consolidate చేసుకుంటూ ఫైనల్ జి.ఓ ఇచ్చారు. జి.ఓ.యం.యస్. నెం.35, 2006 సంవత్సరంలో వచ్చింది. అదే ఇప్పుడు ఎయిడెడ్ ఇనిస్టిట్యూషన్స్‌కు సంబంధించిన ఫైనల్ జి.ఓ. ఆ జి.ఓ ఇప్పుడు ఆపరేషన్‌లో ఉంది. దానిని amend చేస్తే తప్ప, ఇప్పుడు ఫారూక్ హుసేన్ గారు చెప్పినట్లు, ఇప్పుడున్నటువంటి ఖాళీలను భర్తీ చేయడం గానీ, కొత్త పోస్టులను సృష్టించడం గానీ వీలుకాదు. ఇది ప్రభుత్వ పరిశీలనలో ఉంది. గౌరవ ముఖ్యమంత్రిగారి దృష్టికి తీసుకెళ్లి ఎయిడెడ్ ఇనిస్టిట్యూషన్స్‌ను revive చేసే విధంగా చర్యలు తీసుకుంటాము.

శ్రీ ఫారుఖ్ హుసేన్ : అధ్యక్షా, ఇప్పుడున్నటువంటి ఉపాధ్యాయులకు నాలుగైదు నెలల నుండి జీతాలు ఇవ్వడం లేదని తెలిసింది. అటువంటప్పుడు వారు వేరే ఉద్యోగంలోకి వెళ్లి పోతున్నారు. అందువల్ల పాఠశాలలు మూతబడుతున్నాయి. ప్రభుత్వానికి కొత్త ఆలోచన ఉన్నప్పుడు సంతోషమే. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇది చేసింది, అది చేసింది అనే బదులు తెలంగాణ ప్రభుత్వం వచ్చి 22 నెలలు అవుతుంది. మంచి పనులు చేసి, ప్రజలతోటి శభాష్ అనిపించుకోండి.

శ్రీ కడియం శ్రీహరి : అధ్యక్షా, 2016-17 ఆర్థిక సంవత్సరంలో ఎయిడెడ్ విద్యా సంస్థలకి సంబంధించిన రెగ్యులర్ బేసిస్ మీద వాళ్లకు జీతాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. గౌరవ సభ్యులు ఫారూక్ హుసేన్ గారు అన్నట్లుగా గతంలో రెండు, మూడు నెలలకొకసారి వేతనాలు వచ్చేవి. అటువంటి పరిస్థితి రాకుండా 2016-17 ఆర్థిక సంవత్సరంలో నెలకు ఒకసారి వాళ్లకు వేతనాలు అందజేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాము.

**వెనుకబడిన వర్గాల్లో క్రీమీ లేయర్ పథకం అమలు**

ప్రశ్న నెం.1028(47)

శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి, యం.యల్.సి.:- గౌరవనీయులైన అటవీ & వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) క్రీమీ లేయర్ వ్యవస్థను అమలు చేయడం వల్ల లబ్ధి పొందబోయే బి.సి. వర్గాల వివరాలు ఏమిటి;

ఆ) ఈ వ్యవస్థను ఏ రాష్ట్రాలలో అమలు చేస్తున్నారన్న సమాచారం ప్రభుత్వం వద్ద ఉందా;

ఇ) ఈ వ్యవస్థను అమలు చేయడం కోసం ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు ఏమిటి?

గౌరవ అటవీ మరియు బి.సి. సంక్షేమ శాఖ మంత్రి (శ్రీ జోగు రామన్న):– అ) క్రీమి లేయర్ వ్యవస్థను అమలు చేయడం వల్ల తెలంగాణ రాష్ట్ర జాబితాలో చేర్చిన సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల అన్ని (113) కులాలు / వర్గాలు లబ్ధి పొందుతాయి.

ఆ) క్రీమి లేయర్ వ్యవస్థను దేశంలోని ఈ క్రింది రాష్ట్రాలు అమలు చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్, బీహార్, చత్తీస్‌ఘడ్, గుజరాత్, జార్ఖండ్, కర్నాటక, మహారాష్ట్ర, పంజాబ్, రాజస్థాన్, తమిళనాడు, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్.

ఇ) క్రీమి లేయర్‌ను అమలు చేయడానికి ప్రభుత్వం 18-12-2015 & 11-01-2016 తేదీ గల ప్రభుత్వ మెమో నెం.3009/బిసిడబ్ల్యు/ఒపి/2011 ద్వారా మార్గదర్శకాలను జారీ చేసింది. (ప్రతులను జతపరచడమయింది).

శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి : అధ్యక్షా, మంత్రిగారు సవివరంగా సమాధానమిచ్చారు. అందుకు మేము కూడా సంతృప్తి చెందుతున్నాము. కాకపోతే ఒకటే అనుమానం ఏమిటంటే, బిసి సర్టిఫికేట్ తీసుకోవాలంటే ఇప్పటికే ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. ఎంతో అవినీతి జరుగుతున్నదనేటువంటి ఆరోపణలు వస్తున్నాయి. మళ్లీ క్రీమిలేయర్ సర్టిఫికేట్ కావాలంటే, చాలా ఇబ్బందవుతుంది. కాబట్టి ఈ క్రీమిలేయర్ సర్టిఫికేట్ ఇవ్వడానికి ఏమైనా యంత్రంగాన్ని ఏర్పాటు చేశారా? కార్యాలయానికి వెళ్లినప్పుడు బిసి సర్టిఫికేట్‌తో పాటే, క్రీమిలేయర్ సర్టిఫికేట్ ఇచ్చే పరిస్థితి ఏమైనా ఉంటుందా?

శ్రీ జోగు రామన్న : అధ్యక్షా, గౌరవ సభ్యులు అడిగినట్లు, ఆల్‌రెడీ రెండు మెమోల ద్వారానే క్రీమిలేయర్ సర్టిఫికేట్‌తోపాటు క్రీమిలేయరేతర సర్టిఫికేట్లు కూడా జారీ చేసేటప్పుడు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సవివరమైన మార్గదర్శకాలను, స్పష్టీకరణాలను అనుసరించాలని, తెలంగాణ ప్రభుత్వం 18.12.2015 తేదీలో గానీ, 11.01.2016 తేదీ గల ప్రభుత్వం జి.ఓ నెం.3009/బిసిడబ్ల్యు/ఒపి/2011 ద్వారా భూపరిపాలన ముఖ్య కమిషనర్‌లు మరియు జిల్లా కలెక్టర్లందరికీ కూడా హైదరాబాద్‌లోని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కమీషనర్లకు తెలియజేస్తూ, కుల ధృవీకరణం జారీ చేసే అధికారులందరి దృష్టికి ఈ అంశాన్ని తీసుకు రావాలని కోరడమైనది. అంతేకాకుండా దరఖాస్తుదారుని క్రీమిలేయర్, క్రీమిలేయరేతర స్థితులను నిర్ణయించేటప్పుడు వేతనాల ఆదాయం, వ్యవసాయ భూములుండే ఆదాయం పరిగణలోకి తీసుకోకూడదని స్పష్టంగా తెలియజేయడమైనది.

## బంగారు తల్లి పథకం

ప్రశ్న నెం.1118(48)

శ్రీమతి ఆకుల లలిత, సర్వశ్రీ మహమ్మద్ ఆలీ షబ్బీర్, యం. రంగారెడ్డి, పొంగులేటి సుధాకర్ రెడ్డి, యం.యల్.సి.,లు:– గౌరవనీయులైన రోడ్లు, భవనాలు, మహిళా, బాలల, వికలాంగుల, వయోవృద్ధుల శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాలను నిలిపివేయాలని ప్రభుత్వం ఉద్దేశిస్తున్న విషయం వాస్తవమేనా;

ఆ) శాసన మండలి చట్టం ద్వారా ప్రవేశ పెట్టిన పథకాలు అంటే ఎ.పి. బంగారు తల్లి, బాలికా అభివృద్ధి సాధికారిత చట్టాన్ని నిలిపివేస్తున్న విషయం కూడా వాస్తవమేనా;

ఇ) అయితే, అందుకు గల కారణాలేమిటి?

గౌరవ మహిళా, బాలల, వికలాంగుల, వయోవృద్ధుల శాఖ మంత్రి (శ్రీ తుమ్మల నాగేశ్వరరావు):– అ) లేదండీ.

ఆ) అవునండీ. బంగారు తల్లి పథకాన్ని ఆపివేయడమవుతున్నది.

ఇ) "బంగారు తల్లి" అనేది నేరుగా నగదు బదిలీ కార్యక్రమం కనుక తల్లిదండ్రులకు ఇచ్చిన నగదు బాలికల కోసం వినియోగించేలా చూసే కార్యక్రమ ఉద్దేశాలను నెరవేర్చేందుకు ఎటువంటి సమర్థ యంత్రాంగం లేదు

అంతేకాకుండా, బాలికల వివాహం కోసం తెలంగాణ ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేస్తున్నందున, బంగారు తల్లి పథకాన్ని కొనసాగించాల్సిన అవసరం లేదు.

శ్రీమతి ఆకుల లలిత : అధ్యక్షా, "బంగారు తల్లి" చట్టం జి.ఓ.యం.యస్ నెం.307 Empowerment Act ప్రకారం 2009 సంవత్సరంలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారి కొరకు ఈ పథకాన్ని తీసుకొచ్చారు. ఇది చాలా మంచి పథకం. ఈ పథకాన్ని నిలిపి వేయొద్దని నేను కోరుతున్నాను. ఎందుకంటే షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మితోపాటు ఇది కూడా కంటిన్యూ చేయాలి. మొదటిసారి డెలివరీ అయిన తరువాత బర్త్ రిజిస్ట్రేషన్‌కు రూ.2,500/- ఇవ్వడం జరిగింది. మళ్లీ immunization కొరకు రూ.1,000/- ఇవ్వడమవుతోంది.

అలాగే అంగన్ వాడీకి రూ.1,500/- అదేవిధంగా మొదటి తరగతి నుండి ఐదవ తరగతి చదివే పిల్లలకు రూ.2,000/- అలాగే ఆరవ తరగతి నుండి ఎనిమిదవ తరగతి వరకు రూ.2,500/-, తొమ్మిదవ తరగతి, పదవ తరగతి పిల్లలకు రూ.3,000/-, పదకొండవ తరగతి నుండి పన్నెండవ తరగతి వరకు రూ.3,500/-, గ్రాడ్యుయేషన్ నుండి రూ.4,000/-లు ఇవ్వడం జరుగుతోంది.

ఈ విధంగా మొత్తం after registration of the child Rs.2,500/-, after Intermediate and Graduation Rs.1,55,000/- totally the female child will get Rs.2,16,000/- in different stages. ఇవన్నీ కూడా నిలిపివేయకూడదు. ఎందుకంటే ఒక అమ్మాయి పుట్టిన తరువాత వాళ్ల కాళ్ల మీద వారు నిలబడేందుకు గాను ఇటువంటి హెల్త్, న్యూట్రిషన్, ఎడ్యుకేషన్, స్కిల్ డెవలప్‌మెంట్, సెల్ఫ్ డెవలప్‌మెంట్ కొరకు ప్రభుత్వం సహాయం ఇస్తూనే ఉండాలి. అలాగే కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలు కూడా చాలా మంచి కార్యక్రమాలు. ఈ రెండింటిని మార్చవద్దని నేను కోరుకుంటున్నాను.

శ్రీ యం. రంగారెడ్డి : అధ్యక్షా, బంగారు తల్లి పథకాన్ని తీసేసి, పెళ్లి చేసుకోవడానికి కొంతమందికి పథకాన్ని వర్తింప చేసి ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నది. ఆడపిల్ల పుట్టినప్పుడు రూ.2,50,000/- ఎందుకిచ్చారంటే, ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన తరగతులలో పుట్టిన ఆడపిల్లలను ఇవాళ చంపుకునే పరిస్థితి ఉన్నది. అంత పెద్ద కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొస్తే, దానిని ప్రక్కన పెట్టేసి, షాదీముబారక్ లాంటి పథకాలు కొంతమందికి మాత్రమే ఇచ్చి ప్రకటనలు మాత్రం మూడింతలు చేస్తున్నారు. కానీ, ఈ బంగారుతల్లి పథకాన్ని తప్పకుండా పరిగణలోకి తీసుకోవాలి. ఎందుకంటే ఆడపిల్లలు పుట్టంగానే వారిని చంపిన సంఖ్య మన రాష్ట్రంలో ఎక్కువగానే ఉన్నది. అందువల్ల పాజిటివ్‌గా ఆలోచించమని కోరుతున్నాను.

శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి : అధ్యక్షా, గౌరవ మంత్రిగారు మౌలికవసతులు లేక బంగారుతల్లి కార్యక్రమాన్ని ఆపేశామని చెప్పారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి మంచి కార్యక్రమాలకు మేము స్వాగతం పలుకుతాము. ఇంతకుముందు సోదరిమణి, సోదరుడు చెప్పినట్లు దీనికి అనుసంధానం చేస్తే బాగుంటుంది. దయచేసి ఆలోచించండి. ప్రపంచ వ్యాప్తంగా ఈ బంగారుతల్లి పథకం గురించి కొంతమంది జర్నల్స్ కూడా వ్రాశారు. అమెరికా దేశంలోని పేపర్లలో ఈ పథకం గురించి ప్రశంసలు వచ్చాయి. మీరు అధికారంలో ఉన్నారు. కాబట్టి, ఇందులో ఏమైనా లోపాలుంటే సరి చేయండి. ఈ పథకానికి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలు కూడా add చేసి, దీనికి ఇంకా సమగ్రంగా integrate చేస్తే బాగుంటుందని, మీ ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ తుమ్మల నాగేశ్వర రావు : అధ్యక్షా, 10 సంవత్సరాల పెద్దల పాలనలో బంగారుతల్లి పథకానికి సంబంధించి, ఎన్నికలకు రెండు, మూడు నెలల ముందు ఈ చట్టం తీసుకురావడం జరిగింది. నిజంగా పేదల కోసం యం. రంగారెడ్డి గారి ఆవేదనకు అనుగుణంగా మొదటి సంవత్సరంలో పెట్టి ఉంటే, ఈ 10 సంవత్సరాలకు, ఇంకొక 7, 8 సంవత్సరాలైతే ఆ అమ్మాయికి డబ్బులన్నా వచ్చేవి.

ప్రభుత్వం ఈ పథకాన్ని ఎన్నికల కోసం పెట్టలేదు. ఓట్లకోసం పెట్టలేదు. మ్యానిఫెస్టోలో పెట్టాలని పెట్టలేదు. మాటిచ్చామని పెట్టలేదు. ఈ పథకం ద్వారా అమ్మాయికి 18 సంవత్సరాలు వచ్చేసరికి రూ.50,000/-, మిగతా రూ.50,000/- 18వ సంవత్సరం వచ్చిన తరువాత ఇచ్చే విధంగా పెట్టడం జరిగింది.

గౌరవ సభ్యులు యం.రంగారెడ్డి గారు చెప్పినట్లు రూ.2,50,000/-కాదు, రూ.1,00,000/-లు మాత్రమే. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత పాప పుట్టిన దగ్గర నుంచే కాదు పుట్టకముందు నుండే గర్భిణీగా దాల్చిన దగ్గర నుండే ఆ పాపను, తల్లిని బ్రతికించుకోడానికి రూ.750కోట్లతో గర్భిణీ స్త్రీలకు గానీ, బాలింతలకు నిధులు కేటాయించడం జరిగింది. జీరో వయసు నుంచి ఆరు సంవత్సరాల వరకు పెరిగే పాపకు గానీ, బాబుకు గానీ అదేవిధంగా ఆరు సంవత్సరాల నుండి పది సంవత్సరాల వరకు వారి విద్యకు గానీ, పది సంవత్సరాల నుండి పద్దెనిమిది సంవత్సరాల వరకు డిగ్రీ పూర్తయ్యే దాకా ప్రభుత్వమే అన్ని విధాలుగా పుస్తకాలు, బట్టలతో పాటు అన్ని ఇచ్చి చదివించడం జరుగుతుంది. ఈ కళ్యాణలక్ష్మికి సంబంధించి, ఇప్పటికిప్పుడు తల్లిదండ్రుల గుండెల మీద కుంపటి అయినటువంటి ఆడపిల్ల పెళ్లి కోసం 18 సంవత్సరాల దాకా ఆగకుండా ఇవాళ తెలంగాణ ప్రభుత్వం వచ్చింది కాబట్టి పేద ఆడపిల్లలు పెళ్లి చేసుకొని కుటుంబంలో సంతోషంగా బ్రతకాలనే ఉద్దేశ్యంతో మేము కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను తీసుకురావడం జరిగింది.

ఈ సంవత్సరంలో 67,000 మంది ఆడపిల్లల పెళ్లి కోసం ప్రభుత్వం నిధులు ఇవ్వడం జరిగింది. బిసిలను కూడా ఆ పథకాలలో కలపడమే కాకుండా అగ్ర కులాల్లో ఉన్న పేద ఆడపిల్లలకు పెళ్లి చేసే బాధ్యత తెలంగాణ ప్రభుత్వం తీసుకుందని గౌరవ సభ్యులకు మనవి చేస్తున్నాను. కాబట్టి మంచి పథకం అయితే మేము ఉంచే వాళ్లము. దానికి ఉన్నటువంటి లోటుపాట్లు, లొసుగులు ఏవైతే ఉన్నాయో, సెర్ప్ గానీ, మెప్మా గానీ, 10 సంవత్సరాల ప్రభుత్వ పరిపాలనలో మీరు ఇచ్చింది రూ.9కోట్లు. ఈ సంవత్సరంలోనే పెళ్లిళ్ల కొరకు రూ.345కోట్లు ఖర్చుపెట్టడం జరిగింది. గర్భిణీ దాల్చిన దగ్గర నుండి, పాప పుట్టిన దగ్గర నుండి ఎస్సీ, ఎస్టీ, బిసి పేదలందరికీ ఇవాళ సంవత్సరానికి రూ.1,650కోట్లు ఖర్చు పెట్టి, వారిని సాకడం, పోషించడం, న్యూట్రిషన్ ఫుడ్ ఇవ్వడం, చదువు చెప్పించడమే కాకుండా పెళ్లి చేసే బాధ్యత కూడా ప్రభుత్వం తీసుకుంది. అది గమనించమని గౌరవ సభ్యులకు మనవి చేస్తున్నాను.

శ్రీ యం. రంగారెడ్డి : అధ్యక్షా, ఆడపిల్ల పుట్టిన సందర్భంగా ఆ బిడ్డను పోషించడానికి రూ.2,000, రూ.3,000 ఇవ్వాలనే ఒక పథకం పెట్టారు. అది చెప్పకుండా ప్రభుత్వం షాదీముబారక్ పథకాన్ని తీసుకొచ్చిందని, కాంగ్రెస్ వారేమో ఎన్నికల ముందు బంగారు తల్లి పథకాన్ని తీసుకొచ్చారని అంటున్నారు. అసలు ఈ బంగారు తల్లి పథకం ఉందా? లేదా? ఆడపిల్ల పుట్టినప్పటి నుండి పాఠశాల స్థాయి నుండి కళాశాల స్థాయి వరకు వారికి ఇంత incentives ఇస్తే, ఆ అమ్మాయి చదువుకొని, యోగ్యురాలై సమాజంలో గౌరవం సంపాదించుకోవడానికి ఆ(బంగారు తల్లి) పథకాన్ని తీసుకురావడం జరిగింది. అది ఎప్పుడు పెట్టారన్నది కాదు. తెలంగాణ రాష్ట్రంలో స్త్రీలు ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసిన ప్రదేశాలలో ఈ పథకాన్ని పెడితే బాగుంటుందని మా కోరిక. అంతకు ముందు ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు పెట్టింది, ఆంధ్ర రాష్ట్రంలో పెట్టిందనే విషయం కాదు ఇక్కడ. ఇప్పుడు వారికి ఈ పథకం అవసరముంది.

శ్రీ మహమ్మద్ ఆలి షబ్బీర్ : అధ్యక్షా, మీ ద్వారా మంత్రివర్యులను అడిగేదేమంటే, ఈ బంగారు తల్లి పథకం చాలా మంచి పథకం. ఆనాడు పెద్దలందరూ ఆలోచన చేసి పెట్టిన పథకం. మీరు ముఖ్యమంత్రిగారి దృష్టికి తీసుకొచ్చి, చర్చించండి. ఎందుకంటే అబ్బాయిలకు గానీ, అమ్మాయిలకు గానీ 4 సంవత్సరాల నుండి 6 సంవత్సరాల వరకు, 6 సంవత్సరాల నుండి 10 సంవత్సరాల వరకు గానీ ఎప్పటి నుంచో ఈ పథకం కొనసాగుతూనే ఉంది.

ఒకటి – ప్రతి అమ్మాయి ఎవరికివారు ఇండివిడ్యువల్‌గా ఈ పథకం వస్తుందనే నమ్మకంతో ఉంటుంది.

రెండు – షాదీముబారక్ పథకం అనేది కొత్త పథకమని తమరన్నారు. కానీ, 2006 సంవత్సరంలో తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపం వారు బీదవారికి పెళ్లి చేయాలనే ఉద్దేశ్యంతో సామూహిక వివాహాలు చేసే కార్యక్రమాన్ని మొదలు పెట్టడం జరిగింది. దానిని చూసి కాంగ్రెస్ పార్టీ ఆలోచన చేసి, ఇటువంటిది మైనారిటీలకు ఎందుకు వర్తింప చేయకూడదనే ఉద్దేశ్యంతో ఈ పథకాన్ని 2006 సంవత్సరంలో రూ.15,000/-లతో మొదలు పెట్టడం జరిగింది. తరువాత రూ.25,000/- వరకు పెంచడం జరిగింది. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత రూ.55,000/- చేశారు. దీనిలో పేరు మరియు కొన్ని విధానాలు మార్చారు. ఎప్పుడైన ఒక ఆచారం వచ్చినప్పుడు implement లో కొన్ని పొరపాట్లు జరుగుతున్నప్పుడు అనుభవం వస్తూ ఉంటే, దానిలో కొన్ని మార్పులు, చేర్పులు జరుగుతూ ఉంటాయి. ఆ ప్రభుత్వం, ఈ ప్రభుత్వమని కాదు. షాదీ ముబారక్ పథకం కొత్త పథకమేమి కాదు. కాబట్టి బంగారు తల్లి పథకం గురించి కూడా ఆలోచన చేయమని తమరి ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ కర్నె ప్రభాకర్ : అధ్యక్షా, ఇప్పటికే 67,000 మందికి పెళ్లి చేసిన భారం తమపై వేసుకున్న ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి గారికి ధన్యవాదాలు తెలియజేస్తూ, దానిని అమలు చేస్తున్నటువంటి మంత్రి గారికి మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నాను. ఇవ్వాళ అగ్ర కులాల్లో ఉన్నటువంటి పేదలకు, బిసిలకు ఇస్తామని చెబుతున్నారు. వారికి ఈ పథకం ఎప్పటి నుండి వర్తిస్తుంది? ఈ సమావేశాల తరువాతనా, లేకపోతే వచ్చే మాసమా? దయచేసి స్పష్టంగా తెలియజేయాల్సిందిగా మీ ద్వారా మంత్రి గారిని అడుగుతున్నాను.

11.40 ఉ. శ్రీ ఎన్. రామచంద్ర రావు (పట్టభద్రుల నియోజక వర్గం–మహబూబ్‌నగర్, రంగారెడ్డి మరియు హైదరాబాద్): అధ్యక్షా, మీ ద్వారా గౌరవ మంత్రిగారిని ఒకే ఒక్క అంశం అడగదలచుకున్నాను. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం "బేటీ బచావో, బేటీ పడావో" ప్రస్తుతం ఎంత వరకు అమలు జరుగుతున్నది ?

శ్రీమతి ఆకుల లలిత(శాసనసభ నియోజకవర్గం): అధ్యక్షా, ఈ రోజు మహబూబ్ నగర్ జిల్లాలో కళ్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ పథకాల అమలులో గోల్‌మాల్ జరిగినట్లు పేపర్లలో వార్త వచ్చింది. ఆ రకమైన అవకతవకలు జరగకుండా చూడవలసిందిగా నేను కోరుతున్నాను.

శ్రీ తుమ్మల నాగేశ్వర రావు: అధ్యక్షా, పేదలైనటువంటి మహిళలతో సహ, వారికి పుట్టినటువంటి బిడ్డలను సాకే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని నా సమాధానంలో చెప్పడం జరిగింది. గతంలో అంగన్‌వాడీలలో భోజనం వండిపెట్టే పరిస్థితి లేదు. పేదలైన గర్భిణీ స్త్రీలకుగాని, బాలింతలకు గాని పౌష్టికాహారం అందించినట్లయితే, ఆ పిల్లలు ఆరోగ్యంతో ఉంటారు. ప్రసవం తరువాత, ఆ తల్లి కూలికో,నాలికో పోయి, కడుపునిండా తినడానికి అవకాశం లేనటువంటి కుటుంబాలను అందరినీ కూడా అంగన్‌వాడీ కేంద్రాల్లోనే, సుమారు రూ.1550 కోట్ల ఖర్చుతోటి, అన్నం, ఆకుకూర, పప్పు , పాలు, గుడ్డుతో సహా, వారికి కావలసిన ఐరన్ టాబ్లెట్స్‌ను అందించి, పాప ఆరోగ్యంగా ఉండడానికి అవసరమైన చర్యలు అన్నిటినీ తీసుకోవడం జరుగుతుంది. ఇందుకు కేంద్ర ప్రభుత్వం నుండి అదనంగా డబ్బు అందకపోయినా, రాష్ట్రప్రభుత్వమే రూ1650కోట్లు బడ్జెటులో పెట్టుకుని, ఈ రాష్ట్రంలో ఉన్న పేద మహిళలందరికీ, గర్భిణీ స్త్రీలుగాని, బాలింతలు గాని, వారికి మంచి భోజన వసతితో సహా, పాపలు ఆరోగ్యవంతంగా పుట్టే విధంగా చర్యలు తీసుకుంటేనే, పాప పుట్టిన దగ్గరనుండి "బాలామృతం" ద్వారా ఆరు సంవత్సరాలు వయసు వచ్చేదాకా అంగన్ వాడీ కేంద్రాల్లోనే ఉంచి, వారికి కావలసిన ప్రీ స్కూల్ విద్యను కూడా అందించి, తరువాత వచ్చిన అనేక పథకాల ద్వారా, వారికి డిగ్రీ వరకు ఉచిత విద్యను అందించే సదుపాయం కల్పించడం జరుగుతున్నది. ఆ విధంగా ఆ కుటుంబాల పిల్లలను

18 సంవత్సరాల వయసు వచ్చే వరకు సంరక్షించడం జరుగుతున్నది. ఆ కుటుంబాల మీద ఎటువంటి భారం పడకుండా, అన్నీ ఉచితంగానే ఏర్పాటు చేస్తూ, ఆ పిల్లలకు 18 సంవత్సరాల వయసు వచ్చిన తరువాత కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా వివాహం జరిపించడం కూడా ఈ సంవత్సరం నుండే ప్రారంభించడం జరిగింది. గతంలో ఉన్న బంగారు తల్లి కంటే ప్రస్తుతం ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి పథకానికి ఎక్కువ అప్రీసియేషన్ వచ్చింది. గౌరవ సభ్యురాలు లలిత గారు చెప్పినట్లు ఎక్కడైనా అవకతవకలు జరిగితే తప్పకుండా చర్యలు తీసుకుంటాము.

అదే విధంగా శ్రీ ప్రభాకర్‌గారు చెప్పినట్లు ఈ బడ్జెటులో నిధులు కేటాయించాము. వచ్చే సంవత్సరం నుండి బిసిలకు, ఇబిసిలకు, తెల్ల కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ కళ్యాణ లక్ష్మి పథకం అమలు చేస్తామని గౌరవ సభ్యులందరికీ మనవి చేస్తూ, మరింత పక్కాగా, పకడ్బందీగా, పేదలకు చేరే విధంగా నిర్వహించడం జరుగుతుందని తెలియజేస్తున్నాను.

బంగారు తల్లి కార్యక్రమాన్ని ఈ ప్రభుత్వం ఉంచదలచుకోలేదని మళ్లీ స్పష్టం చేస్తున్నాను.

**ఆధునిక సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రుల ఏర్పాటు**

ప్రశ్న నెం. 1344 (49)

శ్రీ కొంపల్లి యాదవరెడ్డి, ఎం.ఎల్.సి.:- గౌరవనీయులైన వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా :

అ) రాష్ట్రంలో అధునాతన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను ఏర్పాటు చేయడాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్న విషయం వాస్తవమేనా ;

ఆ) అయితే, ఆ వివరాలేమిటి, ఏర్పాటు చేయబోయే అట్టి ఆసుపత్రుల సంఖ్య ఎంత ;

ఇ) అయితే, సదరు ఆసుపత్రులను ప్రభుత్వమే ఏర్పాటు చేసి, నిర్వహిస్తుందా ;

ఈ) లేనట్లయితే, దానికి గల కారణాలేమిటి ?

గౌరవనీయులైన వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి (శ్రీ సి. లక్ష్మారెడ్డి):- అ) అవునండీ.

ఆ) నగరం నాలుగు మూలల మరో నాలుగు (4) అధునాతన మల్టీ స్పెషాలిటీ ప్రభుత్వ ఆసుపత్రులను ఏర్పాటు చేయాలని, పిఎంఎస్ఎస్‌వై పథకం క్రింద ఆదిలాబాద్‌లోని రిమ్స్‌ను, వరంగల్‌లోని ఎం.జి.ఎం.ను సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులుగా స్థాయిని పెంచాలని ప్రతిపాదించడమయింది. ఖమ్మం, కరీంనగర్‌ల వద్ద రెండు (2) అధునాతన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను నిర్మించాలని కూడా ప్రతిపాదించడమయింది.

ఇ) అవునండీ.

ఈ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీ కె. యాదవరెడ్డి: అధ్యక్షా, మన ప్రభుత్వం ఆరోగ్యానికి ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చి, నాలుగు కొత్త సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను నిర్మించడానికి నిర్ణయించడం సంతోషకరమైన విషయం. ఈ సందర్భంలో రెండు విషయాలు నేను మంత్రిగారి దృష్టికి తీసుకు రాదలచుకున్నాను. ఒకటి, వనరులను సేకరించడం ద్వారా ఆసుపత్రులను నిర్మించడం. Infrastructureను కూడా అభివృద్ధి పరచవచ్చు. కాని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు అవసరమైన అనుభవజ్ఞులైన వైద్యులు, స్పెషలిస్టులు ఒక్కొక్క ఆసుపత్రికి ఎంతమంది కావలసి ఉంటుంది అనే విషయం అంచనా వేయవలసి ఉంటుంది. ఒక వేళ అంతమంది వైద్యులు మన దగ్గర అందుబాటులో లేకపోయినట్లయితే, వారిని ఇతర చోట్ల నుండి రిక్రూట్ చేసుకునే అవకాశం ఉందా? అటువంటి ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఏమైనా ఉందా, అలా లేకపోయినట్లయితే ఈ సమస్యను ఏ రకంగా పరిష్కరించబోతున్నారు? ఈ మధ్యనే మంత్రిగారు శ్రీలంక వెళ్లి, అక్కడ రోబో అనే సంస్థ గురించి అధ్యయనం చేసి, వచ్చినట్లు మేము పేపర్లలో చూసాము. తమిళనాడులో కూడా వైద్య విధానం బాగా అమలు జరుగుతున్నట్లు తెలిసింది. ఈ సమస్యను ఏ విధంగా పరిష్కరించబోతున్నారో మంత్రిగారు తెలియజేయవలసిందిగా కోరుతున్నాను.

శ్రీ సి. లక్ష్మారెడ్డి : అధ్యక్షా, ప్రభుత్వం నాలుగు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను నెలకొల్పాలని నిర్ణయించడం జరిగింది. నిధుల పరంగా ఎక్కడనుంచి సహకారం పొందినా, వాటి నిర్వహణ పూర్తిగా ప్రభుత్వపరంగానే ఉంటుంది. అవసరమైన వైద్యులను రిక్రూట్ చేసుకోవడం జరుగుతుంది. మన అవసరాలకు తగిన వైద్యులను రిక్రూట్‌చేసుకోవడానికి ఎటువంటి ఇబ్బంది లేదు. క్వాలిఫైడ్ డాక్టర్స్‌కి మన రాష్ట్రంలో ఎటువంటి కొరత లేదు.

**"హరిత హారం" కార్యక్రమం క్రింద మొక్కల పెంపకం**

ప్రశ్న నెం1054 (50)

శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి, ఎం.ఎల్.సి.:- గౌరవనీయులైన అటవీ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా :

అ) రాష్ట్రంలోని హరితహారం కార్యక్రమం క్రింద 40 కోట్ల మొక్కలను నాటిన విషయం వాస్తవమేనా;

ఆ) అయితే, ఈ మొక్కల ప్రస్తుత స్థితి ఏమిటి;

ఇ) మొక్కల పెంపకం కోసం చేసిన వ్యయం ఎంత?

గౌరవ అటవీ, పర్యావరణ మరియు వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ మంత్రి (శ్రీ జోగురామన్న):- అ) తెలంగాణకు హరితహారం కార్యక్రమం క్రింద సంబంధిత శాఖలన్నీ మొత్తం 38.63 కోట్ల నార మొక్కలను పెంచడమయింది అయితే, వివిధ కారణాల వల్ల 15.86 కోట్ల మొక్కలను మాత్రమే నాటడమయింది.

ఆ) తెలంగాణకు హరితహారం కార్యక్రమం క్రింద నాటిన మొక్కలను సంబంధిత శాఖలు నిర్వహిస్తాయి. అటవీ శాఖ నాటిన మొక్కలలో సుమారు 80 శాతం మొక్కలు బతికివున్నాయి. ఇతర శాఖలు నాటిన వాటిలో బ్రతికున్న మొక్కల డేటాను సేకరించడమవుతున్నది.

ఇ) వివిధ పథకాల క్రింద నార మొక్కలు పెంచడం, నాటడం మరియు ఇతర సంబంధిత కార్యకలాపాల నిమిత్తం చేసిన వ్యయం రూ.339.06 కోట్లు.

శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి: అధ్యక్షా, ఇది చాలా ముఖ్యమైన ప్రశ్న. వరుస కరవులు, ప్రతికూల వాతావరణం ఉన్న నేపథ్యంలో, మనకు ఉన్న అటవీ సంపద 20 శాతానికి తగ్గిపోయింది. మినిమం 33 శాతం ఉండాలి. ఇంత మంచి కార్యక్రమం చేపట్టినందుకు ప్రభుత్వాన్ని అభినందిస్తున్నాను. అయితే 40 శాతం లోపే మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఇందులో మూడు రకాల మొక్కలున్నాయి. పల్లె రకం, ఔషధ రకం, మరియు బహుళ ప్రయోజన రకం. అటవీ శాఖ ద్వారా నాటిన మొక్కలు 80 శాతం వరకు బ్రతికినట్లు మంత్రిగారు చెప్పారు. మిగిలిన మొక్కలు పెరగలేదు. నేను కోరేది ఏమిటంటే దయచేసి అన్ని ప్రభుత్వ శాఖలను ఇన్‌వాల్వ్ చేయండి. అలాగే స్వచ్ఛంద సంస్థలను కూడా కలుపుకు వెళ్లండి. ఇదొక సామాజిక బాధ్యతగా గుర్తించండి. మేము ఆ నాడు స్వర్గీయ సంజయ్ గాంధీగారి నాయకత్వంలో Five-point Formulae క్రింద, Each one, Plant one అనే ఒక నినాదం పెట్టుకుని, ఇటువంటి కార్యక్రమమే చేపట్టడం జరిగింది. ప్రస్తుతం ఈ కార్యక్రమాన్ని నిరంతర పర్యవేక్షణ జరుపుతూ, మొక్కలను పెంచుతూ, వాటిని సంరక్షించడంతో పాటు, మొక్కలను, చెట్లను నరక్కండి అనే నినాదం ప్రచారం చేయవలసి ఉంది. ఎందుకంటే కట్టెల వ్యాపారస్తులు యధేచ్ఛగా, అక్రమంగా నరికి, అడవులను పాడు చేస్తున్నారు. దాని మీద మీరు ఏమి చర్యలు తీసుకుంటున్నారో తెలుపవలసిందిగా కోరుతున్నాను. ఇది ఒక డిబేట్ చేయవలసినంత ముఖ్యమైన అంశం. ఒక మంచి సంకల్పంతో ప్రభుత్వం ముందుకు వెళుతుంది కాబట్టి, సీరియస్‌గా ఆలోచించి, చర్యలు చేపట్టవలసి ఉంది.

ఓజోన్ పొర వలన వాతావరణ కాలుష్యం కూడా పెరుగుతున్నది. ప్రపంచ వ్యాప్తంగా మేలుకున్న సందర్భంలో, మనం ఒక సామాజిక బాధ్యత క్రింద Priority Programme క్రింద ముఖ్యమంత్రిగారు చెబుతున్నారు కాబట్టి, మొక్కల పోషణ, సంరక్షణను mandatory చేసి, గ్రామ పంచాయతీలను మానీటర్ చేస్తూ, ఫీల్డ్ ఆఫీసర్స్‌ను నియమించి, ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించవలసి

ఉంది. నాటిన మొక్కలు ఏవి ఎండిపోతున్నాయో, ఏవి సంరక్షించబడుతున్నాయో తెలియదు. మీరు టార్గెట్స్ బాగానే పెట్టుకుంటున్నారు. కాని అది సక్సెస్ కావడం లేదు. సక్సెస్ కావాలని మేము కోరుకుంటున్నాము. ఇప్పటికి మీరు దాదాపు రూ.339 కోట్లు కేటాయించారు. అవసరమైతే ఇంకా పెంచండి. మనకు సరైన వర్షాలు లేవు. భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. మనకు చెట్లు ఆక్సిజన్‌ను ఇస్తున్నాయి. సంపదను కూడా ఇచ్చే మొక్కలు మనకు ఉన్నాయి. పల్లె రకం, ఔషధ రకం మొక్కలతో మనకు కొంత ఆదాయం కూడా సమకూరుతుంది. ఏ రకంగా చూసినా సంపద పెంచే అవకాశం ఈ హరిత హారంలో ఉంది. కాబట్టి అన్ని పార్టీలతో అఖిల పక్షం మీటింగ్ పెట్టండి. అన్ని వర్గాలవారిని ఇన్‌వాల్వ్ చెయ్యండి. ప్రజా ప్రతినిధులు, ఉద్యోగస్తులు, ఎన్‌జివోలు అందరినీ భాగస్వాములుగా చేసి, యుద్ధప్రాతిపదిక మీద చేస్తే తప్ప, ఇది సక్సెస్ కాదు. It is the need of the hour కాబట్టి తప్పకుండా ఇది సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను. ఈ దిశగా మంత్రిగారు ఏమి చర్యలు తీసుకుంటున్నారో చెప్పవలసిందిగా ఈ సందర్భంగా కోరుతున్నాను.

శ్రీ జోగు రామన్న: అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పినట్లు ఈ కార్యక్రమం ముఖ్యమంత్రిగారి మానస పుత్రిక. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని, దృఢ సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. గతంలో సమైక్య రాష్ట్రంలో ఉన్నప్పుడు కూడా అటవీ శాఖ ఆధ్వర్యంలో రెండుకోట్ల మొక్కలకు మించి పెంచిన దాఖలాలు లేవు. మేము ఈ కార్యక్రమాన్ని చేపట్టడానికి ముందే అన్ని ప్రభుత్వ శాఖలతో, ఎన్‌జీవో సంస్థలతోటి, గ్రామ పంచాయితీలకు చెందిన గ్రామ హరిత రక్షణ సమితులతో, సర్పంచ్‌లు, ఎమ్‌పిటిసిలతో మరియు గ్రామ పరిధిలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులతో కలిసి ఒక కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఆ కమిటీ పర్యవేక్షణలోనే ఈ కార్యక్రమం జరుగుతున్నది. ఇన్ని చేసినా, ప్రకృతి వైపరీత్యం అనేది మన చేతిలో లేకపోవడం వల్ల, మనం పెట్టుకున్న టార్గెట్ చేరుకోలేక పోయాము. ఏది ఏమైనప్పటికీ అనుకున్న లక్ష్యాన్ని చేరడానికి గౌరవ సభ్యులు సూచించిన విధంగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించడం జరుగుతుంది. వర్షాకాలం రాకముందే అఖిల పక్షం గాని, NGO సంస్థలతో గాని సమావేశం ఏర్పాటు చేసి, ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటాము. మొక్కలు నాటడమే కాదు, వాటిని సంరక్షించడానికి వన సంరక్షణ సమితి సభ్యులను ఈ కమిటీలో సభ్యులుగా చేర్చడం జరిగింది. రెండు కమిటీలు కలిసి మొక్కలు నాటడంతో పాటు, చెట్లను నరకవద్దని ఆదేశాలు ఇవ్వడం జరిగింది. బెయిలబుల్ సెక్షన్లను నాన్ బెయిలబుల్ సెక్షన్లుగా మార్చి, అడవులను రక్షించడానికి ప్రయత్నం చేస్తున్నాము.

రాబోయే రోజులో మరింత సమర్థవంతంగా ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళతాము. గతంలో మాదిరిగానే అన్ని పార్టీల నాయకులు మరియు NGO సంస్థలను కలుపుకుని కార్యక్రమం విజయవంతం చేస్తాము. గత సంవత్సరం మొట్టమొదటి సారిగా చేపట్టడం ఒకటి, ప్రకృతి కరుణించక పోవడం మరొకటి, ఈ కారణాల వల్ల అంచనాలను అందుకోలేక పోయాము. అవన్నీ దృష్టిలో పెట్టుకుని, ఇప్పటికే వుుప్పై శాఖలను ఇందులో భాగస్వాములను చేశాము. అటవీ శాఖతో పాటు, ఎండోమెంట్స్ గాని, పరిశ్రమల శాఖగాని, ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నాయి. వారికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో శిక్షణ ఇవ్వడం జరిగింది. ఒక అవగాహన సదస్సు కూడా పెట్టడం జరిగింది. ఫారెస్ట్ బ్లాకులు ఉన్నచోట, 80-90% plants survival ఉంది. Non-Forest and Social forest areas ఉన్న చోట వర్షాభావం వల్ల 60% survival ఉంది. వాటిని రక్షించుకోవడానికి ట్యాంకర్లద్వారా నీటిని సరఫరా చేస్తున్నాము.

ఇది మనందరి సమిష్టి బాధ్యత. కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో హరిత హారం పథకాన్ని ముఖ్యమంత్రిగారు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టడం జరిగింది. రాబోయే తరాలకు వన సంపదను అందిస్తూ, వాళ్లు సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా ఉండాలని భావించారు. ఈ రోజు మనకు 24 శాతం ఉన్నటువంటి అటవీ ప్రాంతాన్ని కనీసం 33 శాతానికి తీసుకు రావాలంటే 230 కోట్ల

మొక్కలను, మూడు సంవత్సరాల్లో నాటాలనే కార్యక్రమం ఏదైతే చేపట్టామో, దానిని సభ్యులందరి సహకారంతోటి విజయవంతం చేస్తామని వారికి మనవి చేస్తున్నాను.

శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి : అధ్యక్షా, ఈ విషయంలో అఖిల పక్షాన్ని పిలిచినప్పుడు మరికొన్ని మంచి సలహాలు ఇవ్వడం జరుగుతుంది. ఈ పథకాన్ని mandatoryగా చేస్తే తప్ప, ఫలితాలు సాధించలేము. ఇది మంచి కార్యక్రమం. అందరినీ కలుపుకువెళ్లండి. బరాబర్‌గా మేము అన్ని రకాలుగా కోపరేట్ చేస్తాము. ప్రకృతి imbalanceగా ఉన్న నేపథ్యంలో మనం సమన్వయం చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. హరిత హారం ఎంతో important అని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

MR.CHAIRMAN: Now, Item No.II.

**II. PAPER LAID ON THE TABLE**

A copy of the 77TH Annual Report of Nizam Sugars Limited for the year 2014-15, as required under Section 395 of the Companies Act, 2013.

Item No.III.

**III. GOVERNMENT MOTIONS**

SRI KADIAM SRI HARI: Mr. Chairman, Sir, on behalf of the Minister for Irrigation & Legislative Affairs, I beg to move:

"That the Members of this House do proceed to elect One Member of the House to serve on the **Committee on Public Accounts**, in the manner required by Rule 263 of the Rules of Procedure and Conduct of Business in the Telangana Legislative Council."

"That the Members of this House do proceed to elect One Member of the House to serve on the **Committee on Public Undertakings**, in the manner required by Rule 265 of the Rules of Procedure and Conduct of Business in the Telangana Legislative Council."

MR. CHAIRMAN: Motions moved.

Item No.IV.

**IV. ANNOUNCEMENT**

In accordance with the practice for conduct of Elections to elect one Member each in Committee on Public Accounts and on the Public Undertakings, according to the principle of proportional representation by means of single transferable vote,

I fix the following programme:

| | | | |
|---|---|---|---|
| i) | Last date for filing of nominations | : | Upto 3.00 P.M. on 19-03-2016 (Saturday) |
| ii) | Date of Scrutiny of Nominations | : | At 4.00 P.M. on 19-03-2016 (Saturday) |
| iii) | Last Date for withdrawal of Candidatures | : | Up to 5.00 P.M. on 21-03-2016 (Monday) |
| iv) | Date on which a Poll shall, If necessary, be held. | : | Between 10.00 A.M. & 2.00 P.M. On 22-03-2016 (Tuesday) |

12.00 మ.

**V- ప్రత్యేక ప్రస్తావనలు**

1. శ్రీ యన్. రామచంద్రరావు : యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం అభివృద్ధిలో భాగంగా దేశంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా దాన్ని తీర్చిదిద్దాలని ప్రభుత్వం సంకల్పించడం నిజంగా అభినందనీయం. అందుకు అవసరమైన మా సంపూర్ణ సహాయ సహకారాలు అందించడానికి మేము కూడా సిద్ధంగా ఉన్నాం. అయితే ఈ సందర్భంగా ప్రభుత్వానికి మావిన్నపం ఏమంటే – గత యాభై సంవత్సరాలుగా యాదాద్రి గుట్టపై దాదాపు 150 మంది చిరు వ్యాపారులు షాపులు నిర్వహిస్తూ స్వామివారి దర్శనానికి విచ్చేసే భక్తులకు అవసరమైన పూజా సామగ్రిని అందజేస్తూ తమ వంతు సేవలందిస్తున్నారు. కానీ వారికి ఎటువంటి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు చూపించకుండా వారు నిర్వహిస్తున్న దుకాణాలు ఒకేసారి తొలగించడం వల్ల వాళ్ల కుటుంబాలన్నీ రోడ్డు మీద పడ్డాయి. ఎటువంటి జీవనాధారం లేక దుర్భరమైన పరిస్థితుల్లో ఉన్నారు. అంతేగాకుండా స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు

పూజాసామగ్రి దొరకకపోవడం వల్ల తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కాబట్టి ఈవిషయాన్ని చాలా తీవ్రంగా పరిగణిస్తూ, ప్రభుత్వం వెంటనే వాళ్లకి ప్రత్యామ్నాయ వాణిజ్య సముదాయాన్ని ఏర్పాటు చేయవలసిందిగా కోరుతున్నాను. వాళ్లందరూ ఈ ఉదయమే వచ్చి నన్ను కలిశారు. అధ్యక్షా, ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకొస్తున్నాను. గౌరవ ముఖ్యమంత్రిగారే స్వయంగా స్పందించి వాళ్ల రెస్క్యూకి రావాలని కోరుతున్నాను.

2. శ్రీ పురాణం సతీష్ కుమార్(స్థానికసంస్థలు-ఆదిలాబాద్)ః సింగరేణి ఆధ్వరంలో నిర్మిస్తున్న జైపూర్ పవర్ ప్లాంటుకు త్రాగునీటి సరఫరా పథకం క్రింద చెన్నూర్ మండలం, కాంబోజీ గ్రామంలో ఒక రిజర్వాయర్ ప్రపోజల్ పెట్టడం జరిగింది. ఇది మూడు సంవత్సరాల నుండి ప్రాసెస్ జరుగుతుంది. అయితే కాంబోజీ పేట రైతుల నుండి 390 ఎకరాలు భూసేకరణ కోసం కలెక్టర్, జాయింట్ కలెక్టర్, R.D.O.లతో చర్చలు జరిపి వాళ్లకు ఒక రేటు ఖరారు చెయ్యడం జరిగింది. ఒక్కొక్క ఎకరానికి రూ. 7,00,000 రూ.7,50,000లు, రూ. 8,00,000 లక్షలు నిర్ణయించడం జరిగింది. కలెక్టర్‌గారు స్వయంగా 15 రోజులలో పేమెంట్ ఇప్పిస్తామని చెప్పారు. సింగరేణి వాళ్ల గొల్లవాగు లెఫ్ట్ కెనాల్ నుండి కాంబోజీ పేట 390 ఎకరాలకు సాగునీటికోసం ల్యాండ్ అక్విజిషన్‌లో పోతుందని నీరు ఇవ్వలేదు. 15,20 రోజుల క్రితం సింగరేణి యాజమాన్య సంస్థ వాళ్లు ఈ 390 ఎకరాలు మేము తీసుకోవడం లేదని చెప్పడంతో రైతుల నెత్తి మీద బండ వేసినట్టు అయ్యింది.

భూమి పోతుందని కలెక్టర్‌గారు స్వయంగా చెప్పడం వల్ల, వేరే భూమి కోసం 2 నెలల బయానా పెట్టుకోవడం జరిగింది. కొంతమంది రైతులు ఈ డబ్బులు వస్తాయని ఆడ పిల్లల పెండ్లిలు కూడా పెట్టుకోవడం జరిగింది. రైతులు ఏం చెయ్యాలో తోచని స్థితిలో ఉండి, ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి కూడా కనపడుతుంది. సింగరేణి వాళ్లు భూ సేకరణలో 395 ఎకరాలు సేకరించడం గొప్ప విషయం కాదు. కాని రైతుల సమస్యలను గుర్తించి, మానవతావాదంతో, రైతుల భూములను సేకరించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నాను. నేను, గౌరవ మంత్రివర్యులు, ఎండోమెంటు మినిష్టర్, అందరూ రెవ్యూ మీటింగ్‌లో సింగరేణి వాళ్లకి చెప్పడం జరిగింది. రైతులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు.

(ప్రత్యేక ప్రస్తావనలను అధ్యక్షుల వారికి అందజేయడం జరిగింది)

MR. CHAIRMAN: Now, there is Tea-break for ten minutes.

(The House then adjourned for tea-break at 12.03 p.m.)

12.20 మ. (After tea beak, the House reassembled at 12.39p.m. with the Hon'ble Chairman in the Chair.)

మిస్టర్ ఛైర్మన్ః సభకి నమస్కారం. 2016-17 బడ్జెటుపై సాధారణ చర్చలో మాట్లాడవలసిందిగా శ్రీ పూల రవీందర్ గారిని కోరుతున్నాను.

## (VI) 2016-17 సంవత్సరానికి వార్షిక ఆదాయ-వ్యయ పట్టిక (బడ్జెట్)పై చర్చ

శ్రీ పూల రవీందర్ః అధ్యక్షా, 2016-17 బడ్జెట్‌పై ప్రసంగించే అవకాశం కలిగించినందుకు ముందుగా మీకు ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను.

అధ్యక్షా, తెలంగాణ రాష్ట్ర సాధన కొరకు ముఖ్యమంత్రిగారు స్వయంగా 14సంవత్సరాలు ఉద్యమం చేసి, యావత్ తెలంగాణ రాష్ట్రంలోని పది జిల్లాలలోని నాలుగు మూలలు తిరిగి, ఆ ప్రాంత ప్రజలు ఏమి కోరుకుంటున్నారు, ఎక్కడ నదీ జలాలున్నాయి, ఆ ప్రాంత ప్రజల స్థితిగతులేమిటి, ఎటువంటి కష్టాలు పడుతున్నారు, వాళ్లేమి కావాలని కోరుకుంటున్నారనే విషయాలపై ఆయన సంపూర్ణ అవగాహన కలిగించుకున్నారు.

12.40 మ. అధ్యక్షా, మొదటి బడ్జెట్, రెండవ బడ్జెట్‌లో సుమారుగా అంచనాల ప్రకారంగా చేసినప్పటికీ 2016-17 బడ్జెట్ వచ్చేవరకు ఒక సమగ్రమైన, సంపూర్ణమైన బడ్జెట్‌ను గత ఉమ్మడి రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయని

విధంగా మన ముఖ్యమంత్రి గారు ప్రతి శాఖ అవసరాలు ఏమిటి? ఎంత ఖర్చు అవుతుంది. ఏవిధమైనటువంటి ఆదాయం వస్తుంది. ఆదాయ వనరులు ఏమిటి? వీటన్నింటిని ఒక అద్భుతమైన ఆలోచన విధానంతో రూపొందించినటువంటి బడ్జెట్ ఈ బడ్జెట్.

గౌరవ ముఖ్యమంత్రి గారు స్వయంగా ఆర్థిక శాఖ మంత్రి గారితో, అధికారులతో ఒకమంచి బడ్జెట్‌ను తయారు చేస్తే మన పెద్దల సభలో గౌరవ ఉప ముఖ్యమంత్రి గారు అపారమైన అనుభవం ఉన్నటువంటి వారు స్పష్టంగా ఈ బడ్జెట్ మీద ప్రసంగించడం జరిగింది. నిజంగా ఈ తెలంగాణ ప్రభుత్వం ప్రజల యొక్క ఆశలు, ఆకాంక్షలు ఏమిటి? ఆశయాలు ఏమిటి? వారి యొక్క అవసరాలు ఏమిటి? అనేది సమగ్రంగా తెలుసుకొని ఈ బడ్జెట్‌ను ప్రవేశ పెట్టడం జరిగింది.

గతంలో బడ్జెట్ ఒక మూస పద్ధతిలో వచ్చేది. కానీ, దానికి విరుద్ధమైనటువంటి రీతిలో ఒక్కొక్క శాఖను తీసుకొని ఆ శాఖ మీద చాలా depth గా పోయి, ఎందుకు ఇన్ని నిధులు కేటాయించాలి. ఇంత బడ్జెట్ కేటాయించడం వల్ల ఈ డిపార్టుమెంట్ ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం ఏమిటి? అంతకుమించి ప్రజల యొక్క అవసరాలు ఏమి తీరుతాయి. ఇవన్నీ ఆలోచన చేసి ఈ బడ్జెట్ మీద ఒక నూతన ఒరవడిని తీసుకువచ్చినటువంటి గొప్పతనం మన తెలంగాణ ప్రభుత్వానికి, గౌరవ ముఖ్యమంత్రి గారికే దక్కుతుంది. ఇందులో గత బడ్జెట్‌లు ఏవి చూసినా ప్లాన్ బడ్జెట్ ఎంత అయితే ఉంటుందో, అంతకన్న ఎక్కువగా నాన్ ప్లాన్ బడ్జెట్ పెట్టుకోవడం జరుగుతుంది. కానీ, ఇక్కడ దానికి విరుద్ధంగా మన గౌరవ ముఖ్యమంత్రి గారు ప్లాన్ బడ్జెట్‌నే రూ.67వేల కోట్లతో తయారు చేయడం జరిగింది.

ఎందుకు ప్లాన్ బడ్జెట్‌ను మనం పెంచుకోగలిగాము. ఎప్పుడైతే, ఆయా డిపార్టుమెంట్ మీద పట్టు ఉండి, అది ఎంత అవసరం అనేది ముందుగా చాలా అద్భుతంగా ఆలోచన చేసి, స్టడీ చేసి, ఈ బడ్జెట్‌లో దీనికింత కేటాయించాలని చెప్పి ధైర్యంగా ముందుకు వచ్చి అధికారులను, మంత్రులందరినీ కూర్చోపెట్టుకొని స్వయంగా ఒక ముఖ్యమంత్రే బడ్జెట్‌ను తయారు చేసినటువంటి దాఖలాలు గత పరిపాలనలో ఎక్కడా మనకు కనిపించవు. అందుకు నిదర్శనమే ఈనాటి ఈ ప్లాన్ బడ్జెట్ కానివ్వండి, నాన్ ప్లాన్ బడ్జెట్ కానివ్వండి. రూ.67,630కోట్లు ప్లాన్ బడ్జెట్, రూ.62,785కోట్లు నాన్ ప్లాన్ బడ్జెట్. అంటే, ప్లాన్ బడ్జెట్‌ను మనం ఎక్కువగా పెట్టగలిగామంటే దానిమీద ఎంతో ఆలోచన ఉంటే తప్ప అది మామూలుగా సాధ్యం అయ్యేది కాదు. అట్లా మన ముఖ్యమంత్రి గారు ఆవిధంగా ఆలోచన చేసి తెలంగాణ ప్రజల యొక్క అవసరాల కొరకు తయారు చేసినటువంటి బడ్జెట్.

ప్రతి శాఖ పని తీరును కూడా స్వయంగా వారే పర్యవేక్షించడం జరిగింది. 2014-15వ బడ్జెట్ తీసుకుంటే నైరుతి రుతుపవనాల వల్ల వచ్చిన వర్షపాతం 2014లో 30శాతం. అదేవిధంగా 2015వ సంవత్సరంలో 14శాతానికి నైరుతి రుతుపవనాలు పడిపోయాయి. 2015-16 తీసుకుంటే దీనిలో 58శాతం నైరుతి రుతుపవనాలు పడిపోయాయి. అదేవిధంగా 2016-17 తీసుకుంటే 79శాతానికి ఈశాన్య రుతుపవనాలు పడిపోయాయి. రెండు సంవత్సరాలు నైరుతి, ఈశాన్య రుతుపవనాలు పడిపోయిన సందర్భంలో రైతాంగం ఎంత కష్టపడిపోతున్నారు. నీళ్లు లేక అనేది ఈ సంవత్సరం ఏప్రిల్, మే నెలల్లో డ్రింకింగ్ వాటర్‌తో మనకు అర్థం అవుతుంది. ఎప్పుడైతే ఈ పరిస్థితులు ఏర్పడ్డాయో మహారాష్ట్ర, కర్ణాటకలో కృష్ణా నదీ మీద సుమారు ఒక 400 బ్యారేజీలు/చెక్ డ్యామ్‌ల నిర్మాణాలు చేసిపోయిన తరువాత రాబోయే రోజుల్లో కృష్ణా నది మీద ఆధారపడి చేసేటటువంటి వ్యవసాయం కానివ్వండి, సాగునీటి ప్రాజెక్టులు కానివ్వండీ ఏ పరిస్థితుల్లో కూడా మనకు నీరు కనిపించేటువంటి అవకాశం లేదు.

ఎంతసేపు మనం ఆధారపడేది గోదావరి నదీ జలాల మీదనే. ఈ గోదావరి నదిమీద ఏవిధంగా మనం నీటిని తీసుకోగలుగుతాం? ఎక్కడ మనకు నీరు 365రోజులు అందుబాటులో ఉంటుంది? ఇదంతా స్వయంగా గౌరవ

ముఖ్యమంత్రి గారే రీడిజైన్ చేసి, రీఇంజనీరింగ్ చేసి ఆ ప్రాజెక్టులు గతంలో ఉమ్మడి రాష్ట్రంలో ప్రాజెక్టులను ఏర్పాటు చేసినప్పటికీ అవి అంతర్ రాష్ట్ర విభేదాల వైపుకు పోయేవిధంగా ఉన్నాయి తప్ప, ఎన్ని వేల కోట్లు ఖర్చుపెట్టినా, నీటి చుక్క రానటువంటి పరిస్థితుల్లో మహారాష్ట్ర ప్రభుత్వంతో తేదీః 08-03-2016నాడు గౌరవ ముఖ్యమంత్రి గారు అంతర్ రాష్ట్ర జల ఒప్పందాల మీద గోదావరి నది మీద నిర్మించేటువంటి ప్రాణహిత-చేవెళ్ల కానివ్వండి, వచ్చేటువంటి గోదావరి నది మీద నీరు తగ్గుతున్నటువంటి సందర్భంలో ప్రాణహిత, ఇంద్రావతి, పెన్‌గంగా ఈ ఉప నదుల మీద ఆధారపడవలసిన పరిస్థితి ఉంది.

ఇక్కడ మహారాష్ట్రతో ఏ ఇబ్బందులు లేకుండా ఒప్పందాలు చేసుకొని, ఎక్కడైతే నీటి నిలువ ఉంటుందో, నీటి సామర్థ్యం ఉంటుందో అక్కడనే ప్రాజెక్టుల ఏర్పాటు చేయాలని చెప్పి ఒక చక్కటి ఆలోచన చేయడం. ఉద్యమ కాలంలో తిరుగుతున్నప్పుడు ఖమ్మం జిల్లా ప్రజలు ఏమి కోరుకుంటున్నారు, గోదావరిలో ఎక్కడ నీరుందో, అక్కడి నుండి ఆ నీటిని తీసుకోవాలని చెప్పి, ఆ ప్రాజెక్టులకు సీతారామ-భక్తరామదాసు అని సీతా-రాములను మళ్లీ గుర్తు చేసే విధంగా ఆ ప్రాజెక్టులకు పేర్లు పెట్టడం జరిగింది. రూ.1,152కోట్లతో ఆ ప్రాజెక్టులను ఏర్పాటు చేయడం జరిగింది. కృష్ణా జలాలు కావచ్చు, గోదావరి నదీ జలాలు కావచ్చు ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలనేదే ఒక ప్రధానమైనటువంటి ఉద్దేశ్యం. అదేవిధంగా ఇటు దక్షిణ తెలంగాణకు వస్తే, మహబూబ్‌నగర్, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని రూ.7,800కోట్లతో ఏర్పాటు చేయడం జరుగుతోంది. ఇది ఎత్తిపోతల పథకం అయినా పాలమూరు జిల్లా వెనుకబడ్డదని, ఈ ప్రాంత ప్రజలు వలసలు పోవద్దని చెప్పి ఒకమంచి ఆలోచన చేయడం జరిగింది. ఇంత depthకి వెళ్లి, ఇంత సమగ్రమైన ఆలోచన విధానంతో ఈరోజు బడ్జెట్‌ను ఏర్పాటు చేయడం నిజంగా అభినందనీయం.

అట్లాగే, మనం దీనిలో ఏ రాష్ట్రమైనా ఎంతసేపు అభివృద్ధి వైపే కాకుండా సంక్షేమ కార్యక్రమాలు కూడా తీసుకొని ఈ రెండింటిని సమానంగా ఒక బండికి రెండు గిత్తల్లాగా, ఈ రెండు సమానంగా వెళ్లినప్పుడే ఆ రాష్ట్రం ముందుకు వెళుతుంది. అధ్యక్షా, రాష్ట్రంలో ఎస్సీ/ఎస్టీ, సంక్షేమం కానివ్వండీ, బిసి సంక్షేమ, మైనారిటీ సంక్షేమం కానివ్వండీ ఇలా సంక్షేమ కార్యక్రమాలు తీసుకుంటే అన్ని వర్గాల ప్రజలకు చక్కటి అవకాశాలు కల్పించి దానికి ఉదాహరణగా ఆసరా పింఛనులు గతంలో కూడా మిత్రులు పెట్టడం జరిగింది. అయినా ఆ నిధులు సరిపోవని చెప్పి రూ.1000/-, రూ.1500/- పింఛనులను తీసుకువచ్చి ఈరోజు వృద్ధులకు, వికలాంగులకు ఒక భరోసా ఇచ్చినటువంటి ప్రభుత్వం ఈ ప్రభుత్వమని మీకు తెలియజేస్తున్నాను.

అలాగే, కళ్యాణ లక్ష్మి కానివ్వండీ, షాదీ ముబారక్ కానివ్వండీ ముందుగా వాటిని లాంచింగ్ చేసిన తరువాత ఏవిధంగా ప్రజలకు ఉపయోగపడుతోందనేది ఆలోచించి దానిని ఇటు బీసీలకు, అదేవిధంగా ఈబీసీలకు కూడా ఎందుకు చేయగూడదనే ఆలోచనతో మరి వారు ఉన్నత వర్గాల్లో జన్మించినా వారు బీద కుటుంబాలుగా ఉన్నప్పుడు ఆ కుటుంబాలను కూడా ఆదుకోవాలని చెప్పి గౌరవ ముఖ్యమంత్రి గారు ఆలోచన చేసి కళ్యాణ లక్ష్మిని ఎస్సీ/ఎస్టీతోపాటు బిసి, ఈబిసిలకు కూడా అందించేటువంటి ఏర్పాటు చేయడం జరిగింది.

ఇట్లా, ఇన్ని రకాలుగా ఈ ప్రభుత్వం ముందుకు వెళుతూ, అదే పద్ధతిలో పట్టణాభివృద్ధి గురించి ఆలోచన చేస్తే నిన్ననే జరిగినటువంటి జి.హెచ్.ఎం.సి. ఎన్నికల్లో మనం చూశాం. ఈ హైదరాబాద్ నగరం కొన్ని వందల ఏళ్ల క్రితం ఏర్పడ్డా, ప్రస్తుతం ఉన్నటువంటి ట్రాఫిక్ విషయం కానివ్వండి, అదేవిధంగా రోడ్లు, అభివృద్ధి విషయంలో కానివ్వండీ, తెలంగాణలోని నాలుగవ వంతు ప్రజలు హైదరాబాద్‌లోనే నివసిస్తున్నారు. అంటే ఒక పావు వంతు అభివృద్ధి హైదరాబాద్‌లో జరగాల్సిన అవసరం ఉంది. ప్రజలు, ఉన్నటువంటి విస్తీర్ణం దానికి అనుకూలమైనటువంటి, సమానమైనటువంటి, అవసరమైనటువంటి రోడ్లు ప్రస్తుతం లేవు. అధ్యక్షా, ఈరోడ్లను ఖచ్చితంగా ఏర్పాటు చేయాలి.

ట్రాఫిక్ సమస్య తీర్చాలనే ఆలోచనతో కూడా గౌరవ ముఖ్యమంత్రి గారు అటు పోలీస్ వ్యవస్థను, ఒకవైపు WIN Towers ని ఏర్పాటు చేసి ఒక ఏడు ఎకరాల్లో అధునాతనమైనటువంటి అంతర్జాతీయ స్థాయిలో పోలీస్ వ్యవస్థను పటిష్టంగా చేసేటువంటి ఆలోచనలో ఉన్నారు.

ఇలా ఇటు హైదరాబాద్, అదేవిధంగా పల్లెల్లో కూడా అభివృద్ధిని సాధించాలని చెప్పి కరీంనగర్, ఖమ్మం, రామగుండం, నిజామాబాద్‌లలో ఉన్నటువంటి కార్పోరేషన్లకు అభివృద్ధిని అందించాలని చెప్పి, ఒక్కొక్క కార్పోరేషన్‌కి రూ.100కోట్లుగా మొత్తం కార్పోరేషన్లకి గాను రూ.400కోట్లు బడ్జెట్‌లో పెట్టడం జరిగింది. అదేవిధంగా వరంగల్ పెద్ద కార్పోరేషన్ కాబట్టి, దానికి రూ.300కోట్లు బడ్జెట్‌లో పెట్టడం జరిగింది. ఇది నిజంగా ప్రతి ఇంచు, ఇంచు ఈ ముఖ్యమంత్రి గారు ప్రజలకు, ఏ ప్రాంతానికి ఏమి కావాలనేటువంటిది ఆలోచన చేస్తున్నారని అనడానికి ఇది అద్దం పడుతుందని తెలియజేస్తున్నాను.

అట్లాగే పరిశ్రమల వైపు ఆలోచన చేసినట్లయితే, రాష్ట్రం ఏర్పడిన రోజు అసలు ఈ పరిశ్రమలు ఎలా నడుస్తాయి. ఈ తెలంగాణ రాష్ట్రానికి విద్యుత్తే రాదని, చీకట్లో మగ్గిపోతారని అన్నారు. కానీ, ఆరు నెలల్లో ముఖ్యమంత్రి గారు కష్టపడి ఇక్కడ కరెంటు ఇబ్బందులు లేకుండా చేసినటువంటి ఘనత ముఖ్యమంత్రి గారికే దక్కుతుంది. దాంతో ఐ.టి. రంగం కానివ్వండీ, పరిశ్రమలు కానివ్వండీ వెంటనే ఇటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మన దగ్గరకు రావడం పరిశ్రమలు అభివృద్ధి చెందడం జరుగుతుంది. ఇదంతా సుమారు ఒక నలభై వేల ఉద్యోగాల కొరకు ప్లాన్ చేసి ఇప్పటికే ఏర్పాట్లు కావడం జరిగింది. ఐ.టి. రంగంలో చూసినట్లయితే ఇప్పటికే గూగుల్ సంస్థ వాళ్లు సుమారు రూ.1000కోట్లతో ఇక్కడ ఆ క్యాంపస్‌ను ఏర్పాటు చేసి ఐ.టి. రంగంలో మన పిల్లలకు అపారమైనటువంటి ఉద్యోగాలు వచ్చేటువంటి అవకాశాలు చేస్తున్నారు. ఈవిధంగా మన రాష్ట్రప్రభుత్వం ఇటు పరిశ్రమల్లో కానివ్వండీ, ఐ.టి. రంగంలో కానివ్వండీ అభివృద్ధిలో చాలా ముందుకు వెళ్తున్నాము.

వ్యవసాయ రంగాన్ని చూసినట్లయితే, రాష్ట్రంలో సుమారు 70శాతం ప్రజలు వ్యవసాయం మీద ఆధారపడి బ్రతుకుతున్నటువంటి వాళ్లు. ఆ వ్యవసాయ రంగ అభివృద్ధి కొరకు, సాగునీటి ప్రాజెక్టుల కొరకు రూ.25,000కోట్లు ఏర్పాటు చేసి వ్యవసాయానికి ప్రధానమైనటువంటి నీటి సదుపాయాన్ని ఏర్పాటు చేస్తున్నటువంటి ప్రయత్నాలు మనం చూస్తున్నాము. అలాగే తెలంగాణని ఒక విత్తన బాంఢాగారంగా చేయాలని ఆలోచించడం చూస్తున్నాము. హైదరాబాద్‌కి 70శాతం పండ్లు, పూలు, కూరగాయలు ఇతర రాష్ట్రాల నుండి దిగుమతి చేసుకుంటున్నాము. ఈ రాష్ట్రప్రజలకు హార్టీకల్చర్‌లో పండ్లూ, కూరగాయలు, పూలు సాగుచేసుకోడానికి సబ్సిడీలు ఇచ్చి వారిని ఎంకరేజ్‌చేసి, సబ్సిడీ రూపంలో విత్తనాలను intime లో ఇచ్చి చేసినట్లయితే ఈ 70శాతం ఇతర రాష్ట్రాల నుండి తెచ్చుకోవాల్సిన అవసరం ఉండదనే ఆలోచనతో వీటిని మన రైతులకే అవకాశాలు కల్పించాలని ఏర్పాటు చేయడం జరుగుతుంది. 600మంది ఎస్సీ/ఎస్టీలకు పాలీ హౌజ్ మీద వంద శాతం సబ్సిడీ ఇవ్వడం జరిగింది. ఉదయం కూడా మంత్రి గారు చెప్పారు. ఎందుకంటే బ్యాంకర్స్ ఇబ్బంది పెడుతారని చెప్పి మొత్తంగా వందశాతం సబ్సిడీ ఇవ్వడం జరిగింది. ఇట్లా వ్యవసాయపరంగా అభివృద్ధి సాధించాలనే ఆలోచనతో ప్రభుత్వం ముందుకు పోతుంది.

అధ్యక్షా, మిషన్ కాకతీయ తీసుకుంటే, ఈ రాష్ట్రంలో 46వేల చెరువులు ఉంటే, గత సంవత్సరం తొమ్మిది వేల చెరువుల పూడిక తీశాం. మళ్లీ ఈ సంవత్సరం ఏప్రిల్ నుండి చెరువుల పూడిక తీయడం మొదలు పెడుతున్నాము. అధ్యక్షా, భగవంతుని దయవల్ల ఈ సంవత్సరం అయినా మంచి వర్షాలు వస్తే, తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని చెప్పి కోరుకుంటున్నాను.

అధ్యక్షా, విద్యుత్ రంగం చూసినట్లయితే, రాబోయే మూడు సంవత్సరాల కాలంలో దాదాపు 23,912మెగావాట్ల విద్యుత్ వస్తుందని expect చేస్తున్నాము. ఆ మూడు సంవత్సరాల కాలంలో immediate గా మనం ప్రణాళిక

వేసుకున్నటువంటి వాటిలో నల్గొండ జిల్లాలోని యాదాద్రి ప్రాజెక్టు కానివ్వండి, ఖమ్మం జిల్లాలోని కొత్తగూడెం, భద్రాద్రి ప్రాజెక్టుల ద్వారా ఒక 6000 మెగావాట్లను మనం రేపు పొందబోయే విధంగా ఈ ఏర్పాట్లు చేసుకోవడం జరిగింది. విద్యుత్ విషయంలో వచ్చే రెండేండ్లలో రెప్పపాటు కూడా విద్యుత్‌ను పోనివ్వమని గౌరవ ముఖ్యమంత్రి గారు తెలియజేయడం జరిగింది. నిజంగా ఇది మామూలు విషయం కాదు. ఇటు పరిశ్రమల విషయం కానివ్వండీ, వ్యవసాయ రంగానికి గానీ ఏప్రిల్ నుండే రైతులకు 9గంటల విద్యుత్‌ను అందిస్తామని ఇంత అడ్వాన్సుగా చెప్పిన ప్రభుత్వం ఈ ప్రభుత్వమని తెలియజేస్తున్నాను.

అట్లాగే, రూ.91,500కోట్ల ఖర్చుతో జెన్‌కో, సింగరేణి, ఎన్.టిపి.సి., సోలార్ యూనిట్స్ ద్వారా ఈ 23,000 మెగావాట్ల విద్యుత్‌ను పొందబోతున్నాము. తెలంగాణ ప్రాంతంలో గతంలో ఏదైతే చీకటి అవుతుందని అన్నారో అటువంటి వాటికి పూర్తి స్థాయిలో మనం క్లోజ్ చేసి మంచి విద్యుత్ ఉందనేది వినిపించగలుగుతాము.

వాటర్ గ్రిడ్ చూసినట్లయితే, ముఖ్యంగా గౌరవ ముఖ్యమంత్రి గారు సిద్దిపేటలో 20ఏండ్ల క్రితం చేసి చూపించారు. మనిషికి ఒక్కొంటికి గ్రామాల్లో వంద లీటర్లు, పట్టణాల్లో 150లీటర్లు, కార్పొరేషన్‌లో 200లీటర్ల నీటిని ఇస్తామని చెప్పి ఒక బ్రహ్మాండమైన ప్రాజెక్టును చేయడం జరుగుతుంది. దీనిని ఏవిధంగా ప్రణాళిక చేస్తున్నారు, మేము కూడా చేయాలని బీహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు హర్షిస్తున్నారు. వచ్చే మూడేండ్లలో రూ.40,000 కోట్లు ఖర్చుపెట్టి ఈ వాటర్ గ్రిడ్ పూర్తి చేయాలనే చిత్తశుద్ధితో మన ప్రభుత్వం ముందుకు వెళుతోంది.

1.00 మ.

నిజానికి 2016 డిసెంబర్ నాటికి 61,000 గ్రామాల్లో ఏర్పాటు చేయడం జరుగుతుంది. అంటే 50 శాతం నియోజకవర్గంలో ఈ సంవత్సరం డిసెంబర్ వరకు దాదాపు 12 పట్టణాలలో వాటర్ గ్రిడ్ అందించే విధంగా తగిన ఏర్పాట్లు జరుగుతున్నాయి. 2017 డిసెంబర్ నాటికి 95 శాతం వరకు పూర్తి చేస్తామని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. నిజంగా ఈ ప్రాజెక్టు మొదలు పెట్టినప్పటి నుండి కొన్ని సంవత్సరాల వరకు పూర్తికానీ దాఖలాలు ఉన్నాయి. మనిషికి గాలి తర్వాత అత్యంత ముఖ్యమైనది సురక్షితమైనటువంటిది మంచినీరు. అటువంటి మంచినీరు అందించే ఒక మంచి కార్యక్రమం మిషన్ భగీరథ పేరుతో తీసుకోవడం దానికి అటు మిషన్ కాకతీయకు హరీష్‌రావుగారు, ఇటు మిషన్ భగీరథకు కెటిఆర్‌గారు చాలా చురుగ్గా ముందుకు తీసుకెళ్లుతూ, ఈ కార్యక్రమాన్ని పూర్తి చేసే పనిలో ఉన్నారు.

ఏ సమాజానికైనా విద్య, వైద్య, ఆరోగ్యం చాలా అవసరం. విద్యా రంగానికి సంబంధించి అపారమైనటువంటి అనుభవమున్న ఉప ముఖ్యమంత్రి గారు ఉన్నారు. మనం సమాజంలోని ప్రతి మనిషిని చదువు వచ్చిన మనిషిగా ఎప్పుడైతే తీర్చిదిద్దుతామో, ఆటోమేటిగా ఆ సమాజం అభివృద్ధి చెందుతుంది. తెలంగాణ ప్రభుత్వం విద్యా రంగాన్ని బలోపేతం చేయడం కొరకు, ఇప్పుడున్నటువంటి హాస్టల్స్‌ను ఒక రెసిడెన్షియల్ స్కూల్స్‌గా తీర్చిదిద్దేటటువంటి ఏర్పాట్లు జరుగుతున్నాయి. దానితోపాటు మీ ద్వారా గౌరవ మంత్రిగారికి, గౌరవ ముఖ్యమంత్రి గారికి ఈ సందర్భంగా తెలియజేసేది ఏమంటే, ప్రభుత్వ పాఠశాలలో, సన్నబియ్యంతో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశ పెట్టాము. అలాగే కళాశాలల్లో కూడా సన్నబియ్యంతో మధ్యాహ్న భోజన పథకం అనే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టబోతున్నాం.

ఇన్ని మంచి కార్యక్రమాలు చేస్తూ, ఉచిత విద్యతో పాటు ఆంగ్ల విద్యను కూడా ప్రవేశపెట్టినట్లయితే బాగుంటుంది. ఎందుకంటే ప్రైవేటు పాఠశాలలో చదువుకుంటున్న బీద విద్యార్థులు వేల రూపాయల ఖర్చు పెట్టకుండా ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటారని, మీ ద్వారా మంత్రిగారికి తెలియజేస్తున్నాను. అలాగే ఆరోగ్యమనేది విద్యకు, వైద్యానికి చాలా దగ్గర సంబంధం ఉంది. మనం యాభైయేళ్లు దాటిన తర్వాత వాకింగ్ ఎలా చేయాలి, యోగ ఎలా చేయాలనే దానిమీద దృష్టిపెడుతున్నాం. అందువల్ల పాఠశాలల్లో ప్రైమరీ ఎడ్యుకేషన్ నుండే వ్యాయామ విద్యను, యోగ విద్యను

ప్రవేశపెడితే బాగుంటుందని తవరి ద్వారా ఉప ముఖ్యమంత్రిగారిని కోరుతున్నాను.

అదేవిధంగా ముఖ్యమంత్రిగారు, ఉప ముఖ్యమంత్రిగారు ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయాలనే ఉద్దేశ్యంతో, నలభై డయాగ్నొస్టిక్ సెంటర్లు ఏర్పాట్లు చేయడం జరిగింది. అందులో మందులు, మంచాలు, పరికరాలను రీప్లేస్ చేసేటటువంటి ఏర్పాట్లు జరుగుతున్నాయి. అలాగే రోడ్లు మరియు భవనాల శాఖను చూసినట్లయితే, కొన్ని జిల్లాల్లోని మండలాలకు, గ్రామాలకు ఒక డాంబర్ రోడ్డు వేసి హైదరాబాద్ నగరం వైపు రోడ్డు వెళ్లేటట్లుగా దాదాపు రూ.3,333కోట్లతో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ విధంగా ఇంత మంచి బడ్జెట్ ఏర్పాటు చేసి, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి కృషిచేస్తున్న గౌరవ ముఖ్యమంత్రి గారికి, గౌరవ మంత్రులకు, అవకాశమిచ్చిన ఛైర్మన్ గారికి ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నాను.

శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి : అధ్యక్షా, గౌరవ ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ గారు ప్రవేశపెట్టినటువంటి 2016-17 బడ్జెట్ టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 21 మాసాల తర్వాత ప్రవేశపెట్టిన బడ్జెట్. తొందరలో ఉగాది రాబోతుంది. ఉగాది పచ్చడిలో అన్ని రకాల రుచులుంటాయి. చేదు, వగరు, తీపి అన్ని ఉన్నాయి. నేను పాజిటివ్‌ను పాజిటివ్‌గా చెబుతాను. కానీ చేదు, వగరు, కారం ఎక్కువుంది. అది ఆరోగ్యానికి మంచిదనుకుంటే ఫరవాలేదు. కానీ ఇది ఆశల్లో కల్పించి, ఊహల్లో విహరింపజేస్తూ, బంగారు తెలంగాణ స్లోగన్‌తో, బంగారు పల్లకి మోతెత్తుట కొరకు, వాస్తవ పరిస్థితులకు విరుద్ధంగా, అంతరాత్మ చెప్పే గోసకు విరుద్ధంగా, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నటువంటి నేపథ్యానికి విరుద్ధంగా, వరుస కరువులతో అతలాకుతలమైనటువంటి వ్యవసాయం రంగం, అన్నం పెట్టేనటువంటి అన్నదాత పదేళ్లు కష్టపడి సంపాదించి, ఐదువేళ్లు మనందరి నోట్లోకి పోయేటట్లుగా చేసేటువంటి అన్నదాతల ఆక్రందనని, కేవలం ఒక ఊహా ప్రపంచంలో విహరింపజేస్తూ, ప్రాక్టికల్‌గా ఎక్కడా కూడా ప్రజలు ఆశించిన విధంగా లేదని చెప్పడానికి బాధపడుతున్నాను.

జర్మనీలో ఒక సామెత ఉంది. " సరైన సమయంలో చెప్పలేని నిజం, అబద్ధం కన్నా కష్టం." ఆ సభగానీ, ఈ సభగానీ మనం మాట్లాడే ఈ రెండు సభల్లో కూడా ప్రతి విషయం మీడియా, ప్రజలు చూస్తారు. సహజంగా అపోజిషన్ ఏమేమి చేయాలి, ఎలా చేయాలి, ప్రభుత్వం పనితీరు ఎలా ఉంది, ఎట్లా మెరుగుపరుచుకోవాలనే విషయానికి వస్తే, ఒక 10 శాతం రాజకీయమైనటువంటి ఆరోపణలు రావచ్చు. మేము బ్రహ్మాండంగా చేస్తున్నామనేకంటే, వాస్తవానికి దగ్గరగా ఆలోచించి ప్రజలు ఏమేమి కోరుకుంటున్నారు? మన నీళ్లు, నిధులు, భూములు, స్వయం పరిపాలన, 60 సంవత్సరాల పోరాటం, 1200 మంది అమరవీరుల త్యాగం చూసి ఆ నాడు కాంగ్రెస్ పార్టీ సభ్యులు, ముఖ్యమంత్రిగారి అభిప్రాయం తీసుకొని, తల్లి మనసుతో సోనియాగాంధీ గారు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇవ్వడం జరిగింది.

అయితే చాలా బాధపడుతూ, మంచి చేసిన కొన్ని విషయాల గురించి నేను బరాబర్‌గా చెప్పదలచుకున్నాను. ఈ తీరని అప్పు, ఆరని నిప్పులాంటిది. ఈ అప్పులనేవి development processలో భాగమైనప్పటికీ, ఈ రోజు ఎట్లా ఉందంటే బడ్జెట్ socio economic outlookలో గత 2014-15 బడ్జెట్‌ను చూస్తే, మనం పెట్టుకున్న అంచనాలకి 60 శాతం మాత్రమే ఖర్చు పెట్టగలిగారు. ప్రత్యేకంగా సంక్షేమరంగం నాకు చాలా ఇష్టమని చెప్పిన ప్రభుత్వం ఎస్సీలకు 34 శాతం, ఎస్టీలకు 42 శాతం, బీసిలకు 52 శాతం, మైనారిటీలకు 30 శాతం ఇవ్వడం జరిగింది.

మైనారిటీల కొరకు దాదాపు రూ.422.03కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారు. ఒక RTI Activist అయిన శ్రీ ఎస్.కె. మసూద్ ఇచ్చిన సమాచారం ప్రకారం రూ.728కోట్లు unspent amount అని తెలిసింది. నిన్న గౌరవ ఆర్థికశాఖ మంత్రిగారికి కొంత కోపం వచ్చింది. మైనారిటీలకు ఉపకార వేతనాలు ఇచ్చేటువంటి విషయంలో గానీ అదేవిధంగా ప్రొఫెషనల్స్ కళాశాలల్లో చదువుకునే విషయంలో గానీ, ఉస్మానియా

యూనివర్సిటీ నోడల్ ఏజెన్సీ CEDM (Center for Education Development of Minorities) ద్వారా వాళ్లకు శిక్షణ ఇచ్చి అన్ని రకాలుగా తీర్చిదిద్దే పథకం. అది defunct చేసే కార్యక్రమం చేశారు. ఈ రోజు ఇంత పెద్దఎత్తున బడ్జెట్ పెట్టుకొని socio economicలో అగ్రికల్చర్ సెక్టార్‌కి (-1.1) సంబంధించి వరుస కరువులు, ప్రకృతి మీద వేసేశారు. Deteriorate condition, alarming conditionలో వ్యవసాయ రంగం ఉందనేది దీంట్లోనే చెబుతున్నారు.

Gross State Domestic Product of Telangana current prices మరియు manufacturingలో కొంత అభివృద్ధి ఉంది. Electricity, Gas, Water Supply and other utility servicesలో అభివృద్ధి ఉందని చూపించడం జరిగింది. గౌరవ అధికారులకు, ప్రభుత్వానికి నేను మనవి చేసేది, జనరల్‌గా Primary, Secondary, Tertiary అనే మూడు సెక్టార్స్‌లో ఈ యొక్క ఎకానమి చూస్తారు. Primary Sectorలో live stock, forest, mining zone ఉంటాయి.

తర్వాత Secondaryలో Manufacturing, Electricity, Gas ఉంటాయి. తరువాత Tertiaryలో Trade, Repair Services, Restaurant ఉంటాయి. ఈ రోజు ప్రధానంగా వారు ఇచ్చిన ఇండెక్స్ ప్రకారం మనం గ్రాఫ్స్(-18.2)లో ఉన్నాం. ఈ రోజు Agriculture, Forest and Fishing (-4.5) ఉంది. అసలు ప్రజలు మన నుంచి ఏం కోరుకుంటున్నారు. ఈ బడ్జెట్‌ను మీరు బ్రహ్మాండంగా ప్రిపేర్ చేశారు. కానీ ఈ రోజు ఒకే దఫా రుణ మాఫీ చేయాలనే విషయాన్ని ఈ Floor of the House లో తొందరగా ప్రకటిస్తామని గౌరవ వ్యవసాయశాఖ మాత్యులు చెప్పడం జరిగింది. ముఖ్యమంత్రిగారు మొన్న రిప్లై ఇచ్చినప్పుడు, మేము మూడో కిస్తీ మాత్రమే కడతాం, ఒకే దఫా లేదని చెప్పారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి ఎంత ఘోరంగా ఉందంటే ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్ కంటే ఎక్కువ తెలంగాణలో సగటు అప్పు మనకు ఉంది. దాదాపు 1000 మందిలో, 674 మంది రైతులు అప్పులపాలైనారు. ఇటువంటి పరిస్థితుల్లో వారికి మోరల్ సపోర్ట్ ఇచ్చి, ఆదుకోవలసిన అవసరం ఉంది. దాదాపు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులు రూ.700కోట్లు కానీ, మా లీడర్ గారు రూ.3,000కోట్లు ఇచ్చిందని చెబుతున్నారు. లెక్కించినది ఇన్‌పుట్ సబ్సిడీ, రాష్ట్ర ఖజానా నుంచి ఇన్ని వేల బడ్జెట్ ఇవ్వలేరా అధ్యక్షా! మీకు హృదయం రాదా! స్వయంగా మీరు రైతు.

ఈ రోజు అన్నదాతలను ఆదుకోవాలనే ఆలోచన చేయాలి. రుణమాఫీ అలాగే ఉంది. ఇచ్చే కొత్త రుణాలు కూడా టార్గెట్ కంటే తక్కువిచ్చారు. బ్యాంకులు అనేక షరతులు పెడుతున్నాయి. రబీ పంటకూడా చాలా తక్కువ వేయడం జరిగింది. వరి పంట కూడా సాంద్రత తగ్గిపోయింది. ఖరీఫ్ తగ్గిపోయింది. ఈవిధంగా వ్యవసాయ రంగం కుదేలైనటువంటి పరిస్థితుల్లో మీరు "మిలీనియం అభివృద్ధి లక్ష్యాల సాధనలో సమీకృత అభివృద్ధి" అని బ్రహ్మాండంగా చెప్పారు. కనీసం ఒకే దఫా రుణ మాఫీ చేస్తారంటే అది చేయలేదు. అలాగే రబీ పంటకు తొందరగా షార్ట్‌టర్మ్ లోన్‌లు ఇస్తారంటే అది లేదు. ఇవ్వాళ ఎంత దుర్భరమైన పరిస్థితి ఉందంటే, పశువులకు త్రాగడానికి నీళ్లు లేవు. పైరా వంటి రిజర్వాయర్లో మినిమమ్ 18 అడుగులకు ఉండాల్సిన నీరు 3 అడుగులకి పడిపోయింది. అక్కడ ఉన్నటువంటి దాదాపు 100 గ్రామాల ప్రజలు ఆ బురద నీళ్లే త్రాగుతున్నారు. ఈ సమస్య గురించి నిన్ననే మా కాంగ్రెస్ పార్టీ నాయకులు ధర్నా చేయడం జరిగింది.

నాగార్జున సాగర్ ప్రాజెక్టు నుండి తక్షణమే నీళ్లు విడుదల చేయకపోతే చాలా ఇబ్బందులు ఎదురవుతాయి. త్రాగునీటికి సంబంధించి పరిస్థితి చాలా తీవ్రంగా ఉంది. ఇటువంటివి అనేక రకాల ఇబ్బందులున్నప్పటికీ కేంద్రప్రభుత్వం పరిస్థితి అర్థం చేసుకోకుండా, ఈ రకంగా చేస్తున్నది. కరువు నివారణ విషయంలో విఫలమయ్యారు.

ఈ రోజు సాగునీటి విషయంలో ప్రభుత్వం రూ.25,000 కోట్లు ఖర్చుపెడుతున్నామని చెబుతోంది. ఈ నిధులు పూర్తి స్థాయిలో ఖర్చు కావాలని, రాష్ట్రం అభివృద్ధి

చెందాలనే మేము కూడా కోరుకుంటున్నాం. దానికి టెక్నికల్‌గా ఆర్థిక శాఖ అధికారులు కూడా ఉన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా Financial Department Checks and Balances లేకుండా, Audit లేకుండా, Finance concurrence లేకుండా నేరుగా రూ.25,000కోట్లు పెట్టుకున్నారు. Delay పేరుతో ప్రాజెక్టులు నత్తనడకలు నడుస్తున్నాయని, వాటిని సరైన సమయంలో పూర్తి చేయాలనే ఉద్దేశ్యంతో నేరుగా బడ్జెట్‌లో పెట్టుకున్నారు. కానీ ఈ నిధులపై నాకు తెలిసి ఆర్థికశాఖ యొక్క పర్యవేక్షణ మరియు ఆడిట్ ఉండాల్సిందే. ప్రాజెక్టులను ఇంకా తొందరగా పూర్తి చేయండి. ఇకపోతే ఈ ఇరిగేషన్‌లో కూడా ఎన్నో వేల కోట్లు దోపిడి జరిగింది. మా ప్రభుత్వమా? ఇంతకు ముందు ప్రభుత్వమా? ఈ ప్రభుత్వమా? ఎవరయ్యా చేసిందంటే – ఏ కాంట్రాక్టర్ల గురించి ఎన్నికల ముందు చెప్పారో, వారే శ్రీ కృష్ణ కమిటీని కూర్చోపెట్టి, తెలంగాణ రాకుండా రిపోర్ట్ రాయించారని తెలిసింది.

నేను ఛాలెంజ్ చేసి చెబుతున్నా, ప్రస్తుతం మంత్రిగారు లేరు. కడియం శ్రీహరి గారి ముందు కూడ నేను మనవి చేస్తున్నా! Modernisation of Nagarjuna Sagar వర్క్ తీసుకుంటే, ఒక్క Head క్రిందనే దాదాపు రూ.4,444కోట్ల మేరకు అవకతవకలు జరిగినట్లుగా తెలిసింది. మా ప్రభుత్వం మీద ఫిర్యాదు ఇచ్చినప్పటికీ, మీరు విజిలెన్స్ రిపోర్ట్ చూసి వాళ్లతో spillway మీద మాత్రమే నామమాత్రపు పెనాల్టీ కట్టించుకోవడం జరిగింది.

మళ్లీ అదే కాంట్రాక్టర్లను ఇవ్వాళ ఎలా తీసుకుంటారు? బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాల్సిన కాంట్రాక్టర్లని, ఇవ్వాళ కొత్తగా పాలమూరు గానీ, అంతకు ముందు గానీ, ఇంకా వచ్చే వాటిలో గానీ వాళ్లని ఎలా తీసుకుంటారు. తెలంగాణని ఎవరైతే అడ్డుకున్నారో, వారికే అవకాశం కల్పిస్తున్నారు. ఒక కాంట్రాక్టరు, ఒక నాయకుడి పేరు చెప్పి పోతిరెడ్డిపాడు తీసుకుపోయారు. కాబట్టి ఇటువంటి వాటికి ప్రభుత్వం సమాధానం చెప్పాలి. రాజకీయం వేరు, నిబద్ధత వేరు, సత్యం వేరు. ఏ లాబీతో పెద్దఎత్తున ఎవరైతే తెలంగాణను అడ్డుకున్నారో, వారికే కాంట్రాక్టులు ఇవ్వడం జరిగింది. తెలంగాణ బిడ్డలిచ్చిన ఎన్నో దరఖాస్తులు నా దగ్గర ఉన్నాయి. ప్రత్యేకంగా నాలుగైదు కంపెనీలకు సంబంధించిన అధికారులు మానిటర్ చేయడం జరిగింది. వరల్డ్ బ్యాంకు నిధులు చూసే అధికారి ఎవరైతే ఉన్నారో, వారి పేరు చెబితే బాగుండదు. 12 సంవత్సరాల నుంచి ఆ అధికారి ఎట్లా వరల్డ్ బ్యాంకు నిధులు పర్యవేక్షిస్తాడు? ఆయనలోనే పనితనం ఉందా, ఇంకే అధికారి లేడా?

కొన్ని సంవత్సరాలు కొన్ని ఏజెన్సీల్లో ఎవరైతే చీఫ్ ఇంజనీర్లు పనిచేశారో, వాళ్లు పదవీ విరమణ చేసిన తర్వాత ఏజెన్సీల్లో జనరల్ మేనేజర్‌గా, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లుగా పని చేస్తున్నారు. దీని మీద చెక్స్ ఉన్నాయా? బ్యాలెన్సెస్ ఉన్నాయా? ఎక్కడ లూటీ జరుగుతుంది? దీని మీద మానిటరింగ్ చేయాలని నేను గౌరవ మంత్రిగారికి, ముఖ్యమంత్రి గారికి మనవి చేస్తున్నాను. ఈ ఏజెన్సీస్ మీద మీరు కాంట్రాక్టర్లకి తప్పుని సరిగా ఎంకరేజ్ చేయాల్సిన కార్యక్రమంలో constructive encouragement ఇవ్వండి. ఏది labour component, ఏదైనా excess పెరిగింది అంటే సిమెంటు, ఇసుక రేట్లు పెరగడం. కానీ, రూ.3,000కోట్లు అధ్యక్షా, ఐటమ్‌ల excess పేరుతో మీరు excess payment చేశారు. మళ్లీ వాళ్లకే అవకాశమిచ్చారు. ప్రాజెక్టులో intentional delay జరుగుతుంది. మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాలో intentional delay చేస్తుంటే, తెలంగాణ మొత్తంలో ఇచ్చిన జి.ఓ.లో నవంబర్ వరకు మీ ఇబ్బందులేంటని చెప్పారు. హరీష్ రావుగారు నాలుగుసార్లు మానిటరింగ్ చేశారు. డిసెంబర్ వరకు పూర్తి చేయాలని చెప్పినా, జనవరి, ఫిబ్రవరి దాకా చేసారు. ఇంకా అదనంగా ఫెసిలిటీస్ ఇస్తున్నారు. అంటే by the contractors, of the contractors, for the contractors అధ్యక్షా. రైతులకు ఒకే దఫాలో రుణమాఫీ చేయడానికి ప్రభుత్వానికి మనసు రాదు.

ఈ రోజు రైతులు అడుక్కునే పరిస్థితుల్లో ఉన్నారు. ఉపాధి కూలీలుగా మారిపోయారు. దాని మీద checks ఉండాలి. Taskforce వేయండి. ఏ ఏజెన్సీని బ్లాక్‌లిస్ట్‌లో

పెట్టాలో పెట్టండి. ఎందుకు వాళ్ల బ్లాక్‌లిస్టులో లేరు? ఇవ్వాళ బయటి వాళ్లు పని చేయొద్దని నేను అనడం లేదు.

మన తెలంగాణ బిడ్డలు పోయి అమరావతిలో పని చేయడం లేదా! విశాఖపట్నంలో కాంట్రాక్టర్లు ఎవరున్నారో చూడండి! ఎక్కడో బయటి నుంచి వచ్చిన ఎల్ అండ్ టి సంస్థలు వచ్చి ఇక్కడ పని చేస్తున్నాయి. కానీ, మొట్టమొదటి తెలంగాణ రాష్ట్రంలో బరాబర్‌గా స్థానికులకు అవకాశమివ్వాల్సిన అవసరముంది. కేవలం నామమాత్రపు రూ.10కోట్లు లోపు పనులకే తెలంగాణ కాంట్రాక్టర్లు పని చేయాలా! 2A and B అనే ఒక సాంకేతిక బిడ్డింగ్ చేసి, ఇప్పుడు 3A and B చేసారు. 2A and B అంటే 1000కోట్ల టర్నోవర్ ఉన్నోడికి రూ.2,000కోట్ల వరకే ఇవ్వవచ్చు. అతని మీద మోయలేని భారమేస్తే మధ్యలో వదిలిపెట్టి వెళ్లి పోతడనేది 2A and B. అది మార్చి, ఈ చట్ట సభలో చేయాల్సిన పని 3A and B చేసారు. అంటే గేట్లు తెరిచారు.

1.20 ప. పోలవరం విషయంలో re-engineering, re-designing గురించి ఎందుకు మాట్లాడరు? ఆ విషయం గాలికి వదిలివేసారు. మమ్మల్ని ముంచి ప్రాజెక్టును కడుతున్నారు. ప్రాజెక్టుకి మేము వ్యతిరేకం కాదు. మాకు ఎటువంటి అభ్యంతరమూ లేదు. కానీ నాలుగు లక్షల మంది గిరిజనుల గోస మీకు పట్టదా? వాళ్లు తెలంగాణ బిడ్డలు కాదా? ఈ రోజు అక్కడ గ్రామాలు మునిగిపోతుంటే ఆ ప్రభుత్వం పట్టించుకోదు. నేను మానవతా దృక్పథంతో ఆలోచించమని కోరుతున్నాను. గౌరవ ముఖ్యమంత్రిగారికి మొన్న చెప్పాను, ఇప్పుడు కూడా చెబుతున్నాను. Humanitarian aspectsలో ఎంతవరకు చేయాలో అంతవరకు తెలంగాణ ప్రభుత్వం చేయవలసిందేనని మొన్న ముఖ్యమంత్రిగారు ఖమ్మం జిల్లా అధికారులకు ఆదేశాలు కూడా ఇచ్చారు. అక్కడ చాలా ఇబ్బందులు ఉన్నాయి. భద్రాచలం టౌన్ మునిగిపోయే పరిస్థితి ఉంది. దుమ్ముగూడెం గిరిజన మండలం మునిగిపోయే పరిస్థితి ఉంది. రిటైర్డ్ సి.ఇ. హనుమంత రావుగారు ఇచ్చిన Expert Report ఉంది. దయచేసి పోలవరం విషయంలో కూడా re-designing and re-engineering అనే అంశాల గురించి ఆలోచించండి. మేము ప్రాజెక్టులను కట్టవద్దని చెప్పడం లేదు.

భద్రాచలం దగ్గర రెండు బ్యారేజీలను కట్టమని కోరుతున్నాము. సీతారామ సాగర్ ప్రాజెక్టు మంచిదే. దాన్ని మేము స్వాగతిస్తున్నాము. అయ్యా, ఇందిరాగాంధీ పేరు మీద ఇందిరా సాగర్, రాజీవ్ గాంధీ పేరు మీద రాజీవ్ సాగర్ ప్రాజెక్టు మీద రూ1900 కోట్లు ఖర్చుపెట్టడం జరిగింది. రెండు లక్షల ఎకరాల్లో ఎనబై వేల ఎకరాలు మాత్రమే వెస్ట్ గోదావరి జిల్లాకు చెందుతుంది.

లక్షా ఎనబైవేల ఎకరాలు మన ఖమ్మం జిల్లాలోనే ఉంది. హెడ్ ఏరియా కాబట్టి మొత్తం ప్రాంతం ఆంధ్రా ఏరియాకు వెళ్లిపోయింది అనే ప్రచారం జరుగుతున్నది. కాని అది కరెక్టు కాదు. గౌరవ నీటి పారుదల శాఖ మంత్రిగారు ఇక్కడ ఉండి ఉంటే వారు నోట్ చేసుకునేవారు, చక్కగా సమాధానం కూడా చెప్పేవారు. ఈ టెండర్లలో మీరు రూ.1900 కోట్లు మైనస్ చేయవలసిన అవసరం ఉంది. సరే, కొంత భాగం ఆంధ్రలో ఉండడం వల్ల కొంత వివాదం ఉండవచ్చు. కనీసం వెయ్యి, పదిహేను వందల కోట్లు మైనస్ చేసి టెండర్లు పిలవవలసింది. మీరు ఒక్క రూపాయి కూడా వేస్ట్ కాదని స్టేట్‌మెంట్ ఇచ్చారు. దయచేసి ఆ విషయం చూడండి. అది మైనస్ చేయండి. పైపులు మొత్తం ఫారెస్ట్ ఏరియాలో పడి ఉన్నాయి. వాటిని ఉపయోగించుకోండి.

పక్క రాష్ట్రంతో మంచి సంబంధాలు ఉండవలసిందే. మేము కాదనడం లేదు. ఉప ముఖ్యమంత్రి శ్రీహరిగారికి ఆ విషయం తెలుసు. సీతారామ ప్రాజెక్టు ఇల్లీగల్ ప్రాజెక్టు అని కంప్లయింట్ ఇచ్చిందెవరు? గోదావరి మేనేజ్‌మెంట్ బోర్డుకి కంప్లయింట్ చేసారు. పాలమూరు ఎత్తిపోతల పథకం మీద పక్క రాష్ట్రం ప్రతిపక్ష నాయకుడు కంప్లయింట్ ఇచ్చాడు. అటువంటి పార్టీతో ఇక్కడ మనం పొత్తు పెట్టుకుంటాం. ఎం.ఎల్.సి. ఎలక్షన్స్‌లో ఆ పార్టీతో మనం ఓట్లు వేయించుకుంటాం. Match fixing అనే పదం బాగుండదు కాని, ప్రజలకు ఈ విషయంలో మీరు సమాధానం చెప్పాలి. ఎందుకంటే ఆ పార్టీ అధినేత పాలమూరు ఎత్తిపోతల పథకం

మీద కంప్లయింట్ చేసాడు. సీతారామ సాగర్ ప్రాజెక్టు మీద కంప్లయింట్ ఇస్తాడు. అలాగే పట్టిసీమ కూడా ఇల్లీగల్ ప్రాజెక్టే. ఎగువ భాగంలో పట్టిసీమ ఎలా కట్టారు అధ్యక్షా? మీరైతే పట్టిసీమ కడతారు, పోతిరెడ్డిపాడు సరే, ఆ రోజు మంత్రులెవరూ వ్యతిరేకించలేదు. అది అయిపోయింది. ఇప్పుడు అవసరమైన చర్యలు వెంటనే తీసుకోండి. తెలంగాణ ప్రయోజనాలు కాపాడ్డంలో, తెలంగాణ ప్రజల హక్కులను కాపాడ్డంలో బరాబర్‌గా మీతో కలిసివస్తామని మొదటినుంచి చెబుతున్నాము. ఆ మాటే రేపు చెబుతాం, ఎల్లుండి కూడా చెబుతాం. కాని ఈ రోజు కంప్లయింట్ ఇచ్చి, మన అభివృద్ధిని అడ్డుకునే పార్టీలతో ఎలా కలుస్తారు. రాజకీయం కోసం రాజకీయం కాదు. రాష్ట్రం కోసం రాజకీయం చేస్తే, రాష్ట్ర అభివృద్ధి కోసం రాజకీయం చేస్తే అప్పుడు మీతో కలిసి రావడానికి మేము సిద్ధం కాని, కాంగ్రెస్ వారిని దెబ్బ కొట్టాలని, తెలంగాణ నీళ్లు, నిధులు దోచుకున్నారని చెప్పినవారితో

(అంతరాయం)

డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి(పట్టభద్రుల నియోజకవర్గం – వరంగల్, ఖమ్మం మరియు నల్గొండ) : ఎం.ఎల్.సి. ఎన్నికల్లో match fixing ఎవరు చేసుకున్నారు, ఎక్కడ చేసుకున్నారు? TRS Party స్వతంత్రంగా పోటీ చేసి, ఖమ్మం జిల్లాలో గెలిచింది. మిగతా అన్ని రాజకీయ పార్టీలు కలిసి ఒప్పందంతో పోటీ చేసాయి. మేము ఎక్కడా, ఎవరితో match fixing చేసుకోలేదు. ఆ కాంట్రాక్టర్లందరూ ఎవరు? వాళ్లంతా కాంగ్రెస్ కాంట్రాక్టర్లు. కాంగ్రెస్ పార్టీనే TDP, YSR CP, మరియు అన్ని పార్టీలతో కలిసి match fixing చేసుకుంది.

శ్రీ తుమ్మల నాగేశ్వర రావు: అధ్యక్షా, ఈ ప్రభుత్వానికి match fixing చేసుకునే అవసరం లేదు. రాజకీయంగా కాని, అభివృద్ధిలో కాని మాకు ఆ అవసరం లేదు. కాకపోతే match fixing చేసుకున్న వాళ్లే ఆ మాట మాట్లాడితే నాకు కొంత బాధ కలిగింది. మొన్నటి వరకు జరిగిన మూడు ఎన్నికల్లో కూడా అన్ని పార్టీలు కలిసి match fixing అయినాయి కాని, ఒంటరిగా పోరాడింది మాత్రం టిఆర్ఎస్ పార్టీనే. అఖండ విజయం సాధించింది కూడా టిఆర్ఎస్ పార్టీనే. అవి మామూలు విజయాలు కావు. అబ్‌నార్మల్ విజయాలు. మనం రాజకీయ చరిత్రలో ఎప్పుడూ కూడా చూడలేదు. వరంగల్ ఎన్నిక కావచ్చు, ఇంకొక ఎన్నిక కావచ్చు, లేదా మరొక ఎన్నిక కావచ్చు. ప్రజాభిప్రాయాన్ని గౌరవించి మాట్లాడాలి. ఇది పెద్దల సభ కాబట్టి, మా సుధాకర్ రెడ్డిగారు మంచి అనుభవం కలిగిన వ్యక్తి కాబట్టి మంచిగా మాట్లాడాలి.

తెలంగాణ హక్కులను కాపాడే విషయంలో, అది గోదావరి జలాలు కావచ్చు, కృష్ణా వాటర్ కావచ్చు, తెలంగాణకు రావలసిన వాటాలో ఎవరు ఎన్ని పిటీషన్లు పెట్టినా, అది ఆంధ్రప్రదేశ్, కర్నాటక లేదా మహారాష్ట్ర ఎవరు అడ్డుపడినా, మన వాటాను వాడుకునే విషయంలో వెనకడుగు వేసే ప్రశ్నే లేదు. కాంట్రాక్టులు ఇచ్చే విషయంలో కూడా అత్యంత పారదర్శకంగా ఉంటాం. మీ కంపెనీలు కూడా ఏవైనా ఉంటే దరఖాస్తు చేసుకోండి. రూల్ ప్రకారంగా వస్తే ఇస్తాము. మాకు కావలసింది క్వాలిటీ, టైం ప్రకారం నీళ్లు ఇవ్వాలనే ఆత్రుతతో, ఉన్నటువంటి వాటిల్లో ఏది బెస్ట్ పాలసీనో దాని ప్రకారం వెళుతున్నాము. మేము EPC విధానం తీసివేసాము, mobilisation advances తీసివేసాము, నామినేషన్స్ తీసివేసాము. రెగ్యులర్‌గా ఉన్నటువంటి కండిషన్స్‌ను పక్కాగా పెట్టి, టెండర్లను పిలుస్తున్నాము. పనులు కూడా పక్కాగా చేయిస్తాము. నాణ్యతలో కూడా ఎక్కడా రాజీ పడం. రాజకీయంగా మాకు match fixing లేదని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి : మంత్రిగారు లేటెస్ట్ విషయాలు చెప్పారు. ఎం.ఎల్.ఎ.తో ఎన్నుకోబడ్డ ఎం.ఎల్.సి. ఎన్నికల్లో ఆ ప్రాంతానికి చెందిన ప్రతిపక్ష నాయకుడు లీడ్ చేసే పార్టీ ఎమ్మెల్యే ఓటు ఎవరికి వేసారు? నేను ఏది మాట్లాడినా కూడా ఉన్న వాస్తవం తీసుకుని మాట్లాడతాను. మీరు గుండె మీద చెయ్యి వేసుకుని చెప్పండి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో, పక్క రాష్ట్ర ప్రతిపక్ష నాయకుడు నేతృత్వం వహించే పార్టీ ఎమ్మెల్యే ఎవరికి ఓటు వేసాడు? సరే, వివరాల్లోకి పోకుండా,

(అంతరాయం)

మిస్టర్ ఛైర్మన్: మీరు బడ్జెట్‌పై మాట్లాడండి.

శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి: నేను మాట్లాడేది బడ్జెట్ గురించే అధ్యక్షా. రూ.4,444కోట్లతో ముడిపడి ఉన్న వ్యవహారం. మీరు సమగ్ర దర్యాప్తు జరిపించండి. నేను ఆరోపించే సంస్థలు అవకతవకలకి పాల్పడలేదు అంటే, ఈపెద్దల సభ సాక్షిగా చెబుతున్నాను. మీ నిర్ణయానికి నేను కట్టుబడి ఉంటాను. Detailed Reportతో ఇంతకుముందే నేను కంప్లయింట్ ఇచ్చాను. ఆ సంస్థలు చేసిన అవకతవకలు, అరాచకాలు, లూటీ, కొంతమంది ఇంజనీరింగ్ శాఖ అధికారులతో match fixing జరిగింది.

(అంతరాయం)

మీరు నన్నేమీ yield చేయలేరు. నేను అధికారులు అందర్నీ అనడం లేదు. కొంతమంది ఇంజనీరింగ్ అధికారులు అని చెబుతున్నాను. ఈ విషయం గౌరవ ముఖ్యమంత్రిగారి దృష్టికి కూడా తీసుకువెళ్లాను. నిరూపించడానికి కూడా నేను సిద్ధం. ఆ ఇంజనీర్లు రిటైరైన తరువాత ఏ సంస్థతో పనిచేస్తున్నారనేది మీరు విచారించి తెలుసుకోండి. ఆ ఇంజనీర్లు పనిచేసిన కాలంలో ఎన్ని పనులు డీవియేట్ అయినయో తెలుస్తుంది.

ఇకపోతే ఆరోగ్యం. మంచి బడ్జెట్ పెట్టారు. నేను స్వాగతిస్తున్నాను. నిన్న సభలో సోదరులు చెప్పారు. నిమ్స్‌లో షాపుల్లో మందులు దొరకడం లేదని. మూడు షాపులు బందయినాయి. బేసిక్ మందులు, ఎనాలజిస్టిక్ మరియు anti-toxic మందులు దొరకడం లేదు. అలాగే ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులలో తాగునీటికి ఇబ్బందికరంగా ఉంది. నగరంలో ఇంకా నాలుగు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు రావలసిన అవసరం ఉంది. ఖమ్మంలో మల్టి స్పెషాలిటీ ఆసుపత్రికి ఆ రోజు ముఖ్యమంత్రిగారు హామీ ఇచ్చారు. చాలా సంతోషం. వంద కోట్ల రూపాయలను ఖమ్మం మున్సిపాలిటీకి మంజూరు చేసినందుకు స్వాగతిస్తున్నాము.

కానీ భద్రాచలం దేవాలయాన్ని విస్మరించారు. బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా పెట్టలేదు. మీరు చేసే మంచి పనులను బరాబర్‌గా వెల్‌కం చేస్తాము. అన్యాయాల్ని చీల్చి చెండాడండి. కాదనము. మా ప్రభుత్వమా, అంతకుముందు ప్రభుత్వమా తేలడానికి ఎంక్వైరీ వెయ్యండి. నేనే కోరుతున్నాను. గత పదిహేను సంవత్సరాల్లో ఎవరెవరు ఏమేమి చేసారో విచారించండి. కాబట్టి దయచేసి ఆ దృష్టితో ఆలోచించండి.

ఈ బడ్జెట్‌లో బి.సి.లకు అన్యాయం చేసారు. జనాభాలో 51% ఉన్నారు. రూ.రెండు వేల కోట్లు బడ్జెట్‌లో చూపిస్తే, చాలా అన్యాయం కాదా? BC Sub-Plan రావలసిన అవసరం ఉంది. Fees Re-imbursement విషయంలో కూడా దాదాపు నాలుగువేల కోట్ల రూపాయలు ఆ రోజు ముఖ్యమంత్రిగారు చెప్పినప్పటికీ ఆ హెడ్ లేదు. మిషన్ భగీరథ, డబుల్ బెడ్ రూం ఇళ్లు వంటి అనేక పథకాలు ఉన్నాయి. రూ.1,60,000 కోట్లు అప్పులు చేయవలసి వస్తుంది. దయచేసి ఆ విషయాలన్నీ చూడండి. మేము అనేక పాజిటివ్ పాయింట్స్ చెప్పడానికి ప్రయత్నిస్తుంటే నన్ను డైవర్ట్ చేస్తున్నారు. కేంద్రం నుండి కూడా మనకు నిధులు వస్తున్నాయి. ఒక్క వ్యవసాయ శాఖలోనే మీరు నాల్గైదు పథకాలకు స్వస్తి పలుకుతున్నారు. ప్రధాన మంత్రి పేరుతో దాదాపు ఇరవై పథకాలు ఉన్నాయి. రాష్ట్రప్రభుత్వం కేవలం పదిశాతం భరిస్తే చాలు. ఇటువంటివి అనేక పథకాలు ఉన్నాయి. అలాగే విద్యాశాఖలోగాని, వైద్య శాఖలో గాని గ్రాంట్స్ ఉన్న పథకాలు అనేకం ఉన్నాయి.

మీరు ఒక Status Report ఇవ్వండి. ఈ సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం శాంక్షన్ ఎంత, రాష్ట్ర ప్రభుత్వ కాంపోనెంట్ ఎంత పెట్టారు వివరంగా చెప్పండి. మన నిర్లక్ష్యం వలన అనేక స్కీంలు ఆగిపోయాయి. ఉదాహరణకు Urban Health Mission లేదా National Rural Health Mission వంటివి అనేక పథకాలు కాంగ్రెస్ హయాంలో వచ్చినవి ఉన్నాయి. మీరు నామ మాత్రపు State component పెట్టకపోవడం వల్ల, ఆ పథకాలు ఆగిపోయాయి. దయచేసి ఒక శ్వేతపత్రం రిలీజ్ చేయవలసిన అవసరం ఉంది. అందరం కలిసి పోరాడదాం. పన్నుల రూపంలో మనకు ఎంత రావాలి, కేంద్రం నుండి మనకు rightfulగా వచ్చే నిధులు రాబట్టడంలో మీరు వైఫల్యం

చెందారని చెప్పడానికి on-record మంచి పదం కాదు కాని, బరాబర్‌గా నిర్లక్ష్యం జరిగింది. అధికారులు సరైన సమాచారం అందించక ఇలా జరిగి ఉంటుంది. నోడల్ ఆఫీసర్లను వేయండి. విద్యాశాఖలో నోడల్ ఆఫీసర్లు లేరు. అందువల్ల ఆ శాఖ నిర్వీర్యమయింది. విద్యా హక్కు చట్టం ఉపయోగించుకోలేక పోయాము.

అలాగే పరిశ్రమల విషయానికి వస్తే, స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలి. శాంతిభద్రతల విషయానికి వస్తే, వీణవంక సంఘటన జరిగింది. వరంగల్‌లో మరొక సంఘటన, గుండాలలో మహిళ అదృశ్యం కావడం, ఒక ప్లాస్టిక్ వ్యాపారస్తుడిని చంపి రోడ్డు మీద పడేసారు. మనకు మంచి పోలీసు యంత్రాంగం ఉన్నప్పటికీ, ఇటువంటి అనేక దుర్మార్గాలు జరుగుతున్నాయి. ఉగ్రవాదం పెరుగుతున్నది. పోలీసు వ్యవస్థను ఆధునీకరించండి. ఒక వైపు మమ్మల్ని పాజిటివ్ సజెషన్స్ ఇవ్వమంటారు. ఇది పాజిటివ్ సజెషన్ కాదా చెప్పండి?

ఇప్పుడున్నటువంటి కరువు,కాటకాల సందర్భంలో input subsidy ఇచ్చే పరిస్థితి లేదు. Minimum Support Price ఇచ్చే పరిస్థితి లేదు. Market intervention fund పెట్టలేదు. ఖమ్మం మార్కెట్ యార్డ్‌లో నిన్న మిర్చి కొనుగోళ్లు నిలిపివేసారు. నేను చెప్పేది ఏమిటంటే బడ్జెటును మీరు overallగా బ్రహ్మాండంగా చూపించారు. మా రాజీవ్‌గాంధీగారు ఒక మాట చెప్పారు. 21వ శతాబ్దంలోకి మనం అడుగుపెట్టాలంటే

Experts from the speeches of late Sri Rajeev Gandhi, former Prime Minister of India:

مل کے چلو، چلتے چلو منزل اور باقی ہے، اکیلے ٹی آر ایس چلے تو نہیں ہوگا۔

అందుకే సకల జనులతో కలిసి అడుగులు వెయ్యండి. రాష్ట్రం ఎదురుచూస్తున్నది. రేపు మీరు ఇటొస్తారు, మేము అటొస్తాము. బరాబర్ జరిగేది అదే. ఊహాలోకపు ప్రపంచంలో విహరించకండి. స్టేట్ డెవలప్‌మెంట్ కొరకు అందరం కలిసి పనిచేద్దాం. మీరు చెయ్యకపోతే, ప్రజల పక్షాన మా పోరాటం ఉంటుంది. బరాబర్ నిలదీస్తాం. ఎంత స్థాయికి పోవడానికైనా మేము సిద్ధం. అడుగడుగునా ప్రభుత్వాన్ని నిలదీస్తాం. తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్ పార్టీ రెడీగా ఉంటుంది. మీరు ఇచ్చినటువంటి అవకాశానికి ధన్యవాదాలు. మరికొన్ని విషయాలు చెప్పవలసినవి ఉన్నాయి. సోదరులు నన్ను డిస్టర్బ్ చేసారు. తెలివిగా నాకు స్పీడ్‌బ్రేక్ వేసారు. ఆ విషయాలు తరువాత మాట్లాడతా.

శ్రీ కొంపల్లి యాదవరెడ్డి : అధ్యక్షా, మొదటగా నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నాను. టెక్నికల్‌గా ఇది మూడవ సారి అయినప్పటికీ, మొట్టమొదటి బడ్జెట్‌గానే అందరూ అనుకుంటున్నారు. దానిని శాసన సభలో ప్రవేశపెట్టిన రాజేందర్ గారికి, ఇక్కడ ప్రవేశ పెట్టిన శ్రీహరిగారికి ధన్యవాదాలు తెలియజేస్తూ, మనము ఈ బడ్జెట్ పై చర్చించేటప్పుడు జనరల్‌గా ఉన్న డిమాండ్స్‌పైననో, లేదా రాష్ట్రంలో ఉన్న ఆర్థిక పరిస్థితి గురించో మాట్లాడుకుంటూ ఉంటాము.

అంతటితో సరిపోదు. బడ్జెటు రూపకల్పన చేయడంలో ఎన్నో రకాల విషయాలను అనుసంధానం చేసి, వాటి పరిధిలోనే మనం బడ్జెటుకి తుది రూపం ఇవ్వవలసి ఉంటుంది. ఆ విషయం మనందరం గమనించవలసి ఉంటుంది. బడ్జెట్ అంటే నాకు కొంత ఉత్సాహం ఎక్కువే. ఎందుకంటే రెగ్యులర్‌గా బడ్జెట్‌కి సంబంధించిన విషయాలు చదువుతుంటాను. రాష్ట్రంలో ఉన్న ఆర్థిక, సాంఘిక పరిస్థితులను మనం రెవ్యూ చేసుకున్నప్పుడు మన వృద్ధి రేటు ఏ విధంగా ఉన్నదనేది తెలుస్తుంది. గత రెండు సంవత్సరాల నుండి మనకు సరైన వర్షపాతం లేదు. దానికి తోడు రాష్ట్ర విభజన వల్ల ఏర్పడిన సమస్యల కారణంగా వృద్ధి రేటులో మనకు కొంత ఇబ్బంది ఎదురైంది. అయినప్పటికీ ఈ మధ్య కాలంలో మనం మరల పుంజుకుని వృద్ధి రేటు 11.67% ఉంటుందని అంచనా వేయడం చాలా మంచి పరిణామం. 2005-2010 సంవత్సరాలకు వృద్ధి రేటు చూసినట్లయితే 10.05% ఉండేది. తరువాత 2013-14

వచ్చేసరికి 4.5% కి పడిపోయింది. తరువాత మరల పుంజుకుని, గాడిలో పడినందుకు సంతోషపడవలసిన విషయం. దానికి అనుగుణంగా మనం బడ్జెటును రూపొందించుకోవడం జరిగింది.

వృద్ధిరేటు మందగిస్తే ప్రగతి కుంటుపడుతుందని చాలామంది భయపడుతుంటారు. అలా కాకుండా, వృద్ధిరేటు రివర్స్ అయినప్పుడు మాత్రం విపరీత పరిణామాలు జరుగుతాయి. ఆ పరిస్థితి ఈ వర్షాభావం వలన కలుగుతుందేమోననే భయం కూడా తొలగిపోయినందుకు మనందరం హర్షించవలసిన విషయం. ఆర్థిక పరిస్థితులు ఇలా ఉన్నప్పుడు మనము వ్యవసాయము దాని అనుబంధ శాఖలలో పెరుగుదల కుంటుపడడం అన్నది విచారకరం. ప్రకృతి సహకరించకపోవడం వల్ల మనము ఆ ఇక్కట్లను ఎదుర్కోవలసి వచ్చింది.

1.40 మ. బడ్జెట్ రూపకల్పన చేసిన శిల్పి మన కె. చంద్రశేఖర్ రావు గారు. బంగారు బాటలు వెయ్యాలనే ఆలోచనతో చేస్తున్న కృషిని చూసి ప్రజలు ఎప్పుడూ గుర్తు పెట్టుకొని, వారికి రుణపడి ఉంటారు.

(మిస్టర్ డెప్యూటి ఛైర్మన్ అధ్యక్ష స్థానంలో ఉన్నారు.)

బడ్జెట్ ప్రవేశపెట్టే ముందు అనేక అంశాలను పరిగణనలో తీసుకుంటాం. దానిలో 'జీరో' బడ్జెట్ నుండి రీజనల్ బ్యాలెన్స్, అవుట్ కం బడ్జెట్, చాలా రకాలైన డెఫిసిట్స్, డెట్ బ్యాలెన్స్ చివరగా FRBM యాక్ట్ వరకు పరిగణనలోకి తీసుకోవడం జరిగింది.

కొత్తగా వచ్చిన 14వ పే కమీషన్ యాక్ట్ ద్వారా వచ్చిన నిబంధనలు వీటికి అనుగుణంగానే బడ్జెట్ తయారుచేసుకోవలసి ఉంటుంది. కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత ఫ్లాగ్‌షిప్ కార్యక్రమం కోసం నిధుల సేకరణ ఎక్కువ అయ్యింది. ఈ అప్పుల భారం గురించి చాలా మంది ఆందోళన చెందుతున్నారు. కాని అప్పులు చేయకుండా పాలన చెయ్యడం ప్రగతికి సోపానం కాదు అనేది ఆడంస్మిత్ నుండి అమర్త్యాసేన్ వరకు ఎవరూ కూడా అప్పు తీసుకోవడం తప్పు అని చెప్పలేదు. అప్పును ఏవిధంగా వాడుకోవాలనే వారు సూచిస్తూ వచ్చారు. విద్యుత్ ఉత్పత్తి కోసం రూ.91 కోట్లు మనకు అవసరం ఉంది. వాటి అన్నింటిని సమకూర్చి ఖర్చు పెట్టడానికి ఉపయోగిస్తున్నాం.

వాటర్‌గ్రిడ్‌కి దీర్ఘకాలిక ఖర్చు అవసరం. వీటిని ఒకసారి సేకరణ చేస్తే తరతరాలకు ఇది ఉపయోగపడుతుంది. అటువంటి అన్ని పథకాలకు శ్రీకారం చుట్టడం జరిగింది. అభివృద్ధి, సంక్షేమం రెండూ సమానంగా అడుగులో అడుగు వేస్తూ ముందుకు పోతున్నది మన రాష్ట్రం. ఇతర రాష్ట్రాల వారు కూడా ఈ పథకాలను పరిశీలించడానికి మన రాష్ట్రానికి రావడం జరుగుతుంది. ఈ రెండూ జోడెద్దుల వలె పోవాలని, కానీ జోడెద్దుల లాగా కాదు, జోడు సింహాల మాదిరిగా జోరుగా సాగుతుందని చెపుతున్నాను.

**సంక్షేమరంగంః**

సంక్షేమానికి నిధులు తగ్గించారని కొందరు అంటున్నారు అది అపోహ మాత్రమే.

| | 2015-16 బడ్జెట్ | 2016-17 బడ్జెట్ |
|---|---|---|
| సంక్షేమ రంగం | రూ.5,547 కోట్లు | రూ. 7,122 కోట్లు |
| ఎస్టీ | రూ. 2,878 కోట్లు | రూ. 3,752 కోట్లు |
| బీసీ | రూ.2,172 కోట్లు | రూ. 2,538 కోట్లు |
| మైనారిటీ | ... | పెరిగింది |
| ఆసరా పింఛన్లు | ... | పెరిగింది |

అప్పుల భారంః

మనం అప్పులు ఏ సంవత్సరానికి ఎంత చెల్లించామో తెలిపే నివేదిక.

| 2014 - 15 | 2015 - 16 | 2016 - 17 |
|---|---|---|
| రూ. 7,400 కోట్లు | రూ.10,928 కోట్లు | రూ. 10,856 కోట్లు. |

మనం మొత్తం చెల్లించిన అప్పులు రూ. 28,788 కోట్లు. ఇది ఈ ప్రభుత్వం చేసిన అప్పు కాదు, ప్రస్తుతం

ఉన్న ప్రభుత్వం ఆ భారాన్ని చెల్లిస్తూ ఉండాలి. అప్పు అనేది భారం కాదు, కాని అప్పు తీసుకొని దానిని సక్రమంగా ఉపయోగించుకోకపోతే భారం అనిపిస్తుంది. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పటి అప్పు చూపించాము. జి.యస్.డి.పి.లో అప్పు నిష్పత్తిగా చెబుతారు. దానిలో తెలంగాణ రాష్ట్ర నిష్పత్తి 18.5% గా ఉంది. బీహార్ నిష్పత్తి 18.9% గా ఉంది. మిగతా రాష్ట్రాలు అన్ని 20% కి పైగా ఉన్నాయి. మధ్యప్రదేశ్ 21.67%, ఆంధ్రప్రదేశ్ 27.9%, రాజస్థాన్ 33.2%. గా ఉంది. Sir, as regards debt ratio, I will read out the figures of various States in the Country. Telangana (15.5%), Bihar (15.9%), others States are over 20%, like Madhya Pradesh (21.67%), Andhra Pradesh (27.9%), Rajasthan (33.2%).

1.50 మ.

In terms of figures of combined Andhra Pradesh, for the year 2014-15, it was **Rs.1,89,750 Crores**, post bifurcation of A.P., it is **Rs.1,56,420 crores.** మార్చి, 2015 మన తెలంగాణ షేర్‌కి వచ్చింది రూ.83వేల కోట్లు. మార్చి లోపల ఆంధ్రప్రదేశ్‌కి సంబంధించి రూ.1.70కోట్లకు పెరిగింది. తెలంగాణాలో రూ.1.0లక్షల కోట్లకు పెరిగింది. These figures are from Economic Survey. నా సొంతంగా చెప్పినవి కావు. ఇవేమీ భారం కావు, వాటిని సరైన పద్ధతిలో వాడుకునేలా చూడవలసిన బాధ్యత మనందరిపై ఉంది. ఇథియోపియా, సౌదీ, అమాన్ లాంటి చిన్న చిన్న దేశాలు డెట్ ట్రాప్‌లో పడిపోయి ఒక భయంకరమైన ఆందోళన కలిగించిన మాట వాస్తవమే. కానీ భారతదేశంలో అన్ని రాష్ట్రాలలో economic position చూస్తే, అన్ని రాష్ట్రాల కంటే మన తెలంగాణ రాష్ట్ర economic health చాలా చక్కగా ఉంది, దాని గురించి మన మిత్రులలో ఎవరికైనా అపోహలుంటే తొలగించుకోవాలి. అయితే ఇక్కడ ఒక విషయం ఉంది. కేటాయింపుల్లో ఏదైనా ఒక డిపార్టుమెంటుకి ఎక్కువ ఉన్నాయనుకుంటే దాన్ని కట్‌మోషన్ ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకరావచ్చు. ప్రభుత్వం దానికి కన్విన్స్ అయితే సదరు కేటాయింపులను తగ్గించడానికి ప్రయత్నం చేస్తుంది. ఇది పార్లమెంటులో జరిగింది. అయితే ఇక్కడ శాసనసభలో జరిగిన ఉదంతమైతే లేదు నాకు తెలిసి. ఆపద్ధతులు వాడుకోవచ్చని గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

రాష్ట్రాలలో అమలు చేయడానికి ఇచ్చిన సెంట్రల్ గవర్నమెంటు స్కీములో కొన్ని చాలా బాగా ఉన్నాయి. వాటిని వాడుకోవలసిన అవసరం ఉంది. పవర్ సెక్టారులో ఉదయ్ అనే ఒక స్కీముంది. దాన్ని ఈమధ్యనే ప్రవేశపెట్టారు. Under this scheme, DISCOM's 75% of the outstanding will be taken over by the respective State Governments. For this, the Government of India will provide some incentives such as – (a) The State Governments need not pay 3 years' interest on such loan transferred to the State Government's DISCOMS. Sir, it is a huge figure. దీన్ని మనం వాడుకోవలసిన అవసరం ఉంది. దీనికి సంబంధించి మనం ఇంకా అప్రోచ్ కాలేదు, అప్రోచ్ అయితే బాగుంటుంది.

(b) The State Governments need not show any loan account transferred by the DISCOMS in their fiscal deficit. ఇది చాలా ముఖ్యమైన అంశం. ఈ ఫిస్కల్ డెఫిసిట్‌లో లోను భారం పెరిగినట్లయితే మనం కొత్తగా తీసుకునే లోన్లకు ఈ కండిషన్ కొంచెం ఇబ్బంది అవుతుంది కాబట్టి ఆ ఫెసిలిటీ ఈ ఉదయ్ స్కీము ద్వారా రాష్ట్రాలకు కేంద్రప్రభుత్వం కల్పించింది. దీన్ని వాడుకుంటే చాలా బాగా ఉంటుంది.

నేను ఇంతకు ముందే ఆర్ అండ్ బి మినిష్టర్‌గారితో పర్సనల్‌గా మాట్లాడాను. రాష్ట్రాలలో ఆర్‌యుబి, ఆర్‌ఓబి ల నిర్మాణానికి సంబంధించి రైల్వే బడ్జెటులో కొంత ప్రొవిజను ఉండేది. ఇప్పుడు రైల్వే బోర్డు దాన్ని మార్చి, ఎవరికైతే అవసరముందో ఆ రాష్ట్రప్రభుత్వాలే వాటి ఖర్చు భరించాలనే నిబంధన పెట్టింది. మన బడ్జెటులో ప్రత్యేకంగా రైల్వే సేఫ్టీ ప్రొవిజను ఒకటి ఉంటుంది. దీంట్లో రూ.50కోట్లు లేదా రూ.100కోట్లు పెట్టి బడ్జెటు పాస్ చేస్తే బాగుంటుందని రిక్వెస్ట్ చేస్తున్నాను. ఎందుకు ఈవిషయం చెబుతున్నానంటే – నాలుగైదు ముఖ్యమైన ఆర్‌యుబి లను నిర్మించవలసిన అవసరం ఉంటే దాని కోసం నేను, మా జిల్లా ఎమ్మెల్యేలు

అందరమూ ఈమధ్యన సౌత్ సెంట్రల్ రైల్వే జోన్ జనరల్ మేనేజర్ గారిని కలిసినపుడు వారు ఈ సూచన చేశారు.

మీరు మీ బడ్జెటులో దానికి కేటాయింపులు చేసుకుంటే తప్ప మీకు రావడానికి వీలు కాదని, మీరు ఆవిధంగా బడ్జెటులో రూపొందించి మాకు స్పెషల్‌గా మీ గవర్నమెంటు ద్వారా letter of intent ఇస్తే , మేము పర్మిషన్ తీసుకొని వాటి నిర్మాణం చేపడతామని చెప్పారు. ఈవిషయాన్ని సభలో ఉన్న ఆర్ అండ్ బి మినిష్టర్ గారి దృష్టికి తీసుకొచ్చాను. నేను ఎందుకు రికార్డుల్లోకి వెళుతున్నానంటే – ఒకవేళ మంత్రిగారు మరచిపోయినా వాళ్ల దృష్టికి రావాలంటే ఈ ప్రొసీడింగ్స్‌ని రెఫర్ చేసి దాన్ని రికమెండేషన్‌లో ఇన్‌క్లూడ్ చేస్తారనే ఉద్దేశ్యంతో ఈవిషయాన్ని మీవముందు ఉంచుతున్నాను. ఈవిషయాన్ని మంత్రిగారు మళ్లీ దాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకొస్తే బాగుంటుందని మరీ మరీ కోరుతున్నాను.

గౌరవ సభ్యులు పొంగులేటి సుధాకర్ రెడ్డి గారు మాట్లాడుతూ – ఎక్కువ ఆశలు కల్పించి ప్రజలను disappoint చేయవద్దని అంటున్నారు. అది వాస్తవమే. మంచి సలహానే, తప్పు సలహానైతే కాదు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల గురించి వారు ప్రత్యేకంగా కామెంట్ చేశారని అనుకుంటున్నాను.

అయితే ప్రజలకు చేయవలసిన ముఖ్యమైన కొన్ని బాధ్యతలు ప్రభుత్వం ముందుంటాయి. ఫుడ్ అయితేనేమీ, షెల్టర్ అయితేనేమీ ఇటువంటివి మూడు, నాలుగు ముఖ్య కార్యక్రమాలు ప్రజలకోసం చేపట్టవలసిన బాధ్యత ప్రతి ప్రభుత్వం మీద ఉంటుంది. అది దృష్టిలో ఉంచుకునే ఫుడ్ సెక్యూరిటీని మన రాష్ట్రంలో మొదలు పెట్టిన మాట వాస్తవం. అది దృష్టిలో పెట్టుకునే ఈ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లనిర్మాణాన్ని చేపట్టాం. పేదలకు ఇళ్లనిర్మాణ కార్యక్రమం ఇంతకు ముందు నుంచి చాలా కాలంగా జరుగుతూ వస్తోంది. అయితే ఆ ఇళ్లల్లో ఒక రూము మాత్రమే ఉండడం వల్ల జాయింట్ ఫ్యామిలీలకు ఇబ్బంది అవుతోందనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రిగారు – మంత్రులు, శాసనసభ్యులు, అందరితో చర్చించి, తప్పకుండా ఈకార్యక్రమాన్ని చేపట్టాలని , దీనికి ఎంత ఖర్చయినా సరే భరించాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం తీసుకోవడం జరిగింది.

ఇది ఆశల పల్లకి కాదు. తప్పకుండా ఈకార్యక్రమాన్ని విజయవంతం చేస్తామనే పట్టుదలతో వారున్నారు. ఆమేరకు అడుగులు వేస్తున్నారు. ఆ ఇళ్లనిర్మాణానికి అవసరమైన ల్యాండ్ విషయంలో కొంత ఇబ్బందికరమైన పరిస్థితి ఉంది. కలెక్టర్లు నివేదికలు ఇస్తున్నారు, అయినా సరే ఎంత ఖర్చయినా అవసరమైన భూమి కొనుగోలు చేసి దాన్ని చేయవలసిన బాధ్యత మన మీద ఉందని ముఖ్యమంత్రిగారు చెప్పారు. ఏవైతే ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రాములు ఈప్రభుత్వం ముందున్నాయో అవి ఏవిధంగా జరుగుతున్నాయో మనమందరమూ చూస్తున్నాం. వాటర్‌గ్రిడ్ ఏస్థాయికి వచ్చిందో మనందరికీ తెలిసిందే. పవర్ జనరేషన్ ఏస్థాయిలో ఉందో మనందరికీ తెలిసిందే. ఏవైతే ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రాములున్నాయో అవి చురుకైన దశలో నడుస్తున్నాయి. ఈ బడ్జెటులో సమకూర్చుకున్న నిధులలో ఏ ఒక్క పైసా కూడా వృధా పోకుండా ఈ స్కీములన్నింటికీ చేర్చి, అవి గ్రౌండ్ అయ్యేలా చూసే బాధ్యత ఈ ప్రభుత్వం మీద ఉంది. అందుకే ఇంత పట్టుదలతో ఇటువంటి బడ్జెటు వాళ్లు పెట్టి ప్రజల ముందుకు వచ్చారు. ఈబడ్జెటు పాసైన తర్వాత ఎక్కడైనా ఏవైనా చిన్న చిన్న లొసుగులు కనబడితే వాటి కొరకు తప్పకుండా ప్రత్యేకమైన నిర్ణయాలు తీసుకొని వాటిని మన ముందు ఉంచుతారని పూర్తిగా ఆశిస్తూ, ఈ బడ్జెటు ప్రతిపాదనలన్నింటినీ హృదయపూర్వకంగా సమర్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ డెప్యూటి ఛైర్మన్: శనివారం ఉదయం పది గంటలకు తిరిగి సమావేశమయ్యేందుకు సభను వాయిదా వేయడమైంది.

(The House, then adjourned at 2.00 p.m. to meet again at 10.00 a.m. on Saturday, 19th March, 2016).

☺☺☺

**“Published under Rule 316 of the Rules of Procedure and Conduct of Business in the Telangana Legislative Council and Printed at the Assembly Press, Public Gardens, Hyderabad.”**